ఆదివారం 17-9-2023


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00


సంపుటి: 16 సంచిక: 178




'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

హైదరాబాద్ సమీపంలో భారత సైన్యాలు..



నిజాం దిగేదాక.. తుపాకులు దించం: కమ్యూనిస్టు రైతాంగ సేనలు



ఆపరేషన్.. హైదరాబాద్

➤ భారతదేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం వస్తే ..హైదరాబాద్ సంస్థానం నిజాం రజాకార్ల ఆగడాలతో అట్టుడికిపోయింది. నిజాం రాజు ఉస్మాన్ తాను స్వతంత్ర దేశంగానే ఉండాలని కోరుకోగా, అది కుదరకపోతే పాకిస్తాన్‌తో విలీనం కోసం చేస్తున్న ఎత్తుగడలను భారత ప్రభుత్వం పసిగట్టి 1948, సెప్టెంబర్ 13న మిలటరీ ఆపరేషన్‌ను మొదలుపెట్టి కేవలం ఐదు రోజుల్లో పూర్తి చేసింది. 16వ తేదీ నాటికి వాస్తవ పరిస్థితి నిజాంకు అర్థమైంది. 2,727 మంది రజాకార్లను భారత సైన్యాలు హతమార్చగా, మరో 4వేల మందిని బందీలుగా పట్టుకున్నాయి. పరిస్థితిని గమనించిన నిజాం చీఫ్ ఇద్రూస్ లొంగిపోవాలని చేసిన సూచన మేరకు ఆ రోజు సాయంత్రమే తొలుత ప్రధానమంత్రి మీర్ లాయక్ అలీ రేడియో స్టేషన్‌కు వెళ్లి తాను రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. మరుసటి రోజు అంటే..సెప్టెంబర్ 17న సాయంత్రానికి భారత ప్రభుత్వ ప్రతినిధి మున్షీ ఆదేశం మేరకు మీర్ ఉస్మాన్ అలీఖాన్ సైతం దక్కన్ రేడియో ద్వారా హైదరాబాద్ సైన్యం తరఫున కాల్పుల విరమణ చేస్తున్నామని, యూఎన్ సెక్యూరిటీ కౌన్సిల్‌కు ఇచ్చిన ఫిర్యాదు వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించారు. దీంతో హైదరాబాద్ సంస్థానం స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది.



మేం లొంగి పోతున్నాం.. జయంతినాథ్‌తో ఈఎల్ ఇద్రూస్..


ఆ నలుగురు..

నాటి హైదరాబాద్ సంస్థానంలో కీలకం

సాక్షి ప్రత్యేక ప్రతినిధి: హైదరాబాద్..భారతదేశంలోనే అతిపెద్ద సంస్థానం. తెలుగు, ఉర్దూ, మరాఠీ, కన్నడ భాషల సమ్మేళనంతో ఓ వెలుగు వెలిగింది. 1724లో నిజాం ఉల్‌ముల్క్ స్వతంత్రుడిగా ప్రకటించుకొని నిజాంపాలనకు శ్రీకారం చుట్టగా, 1948 వరకూ ఆయన వారసులు పరిపాలించారు. అయితే 1947 తర్వాత హైదరాబాద్‌ను స్వతంత్ర దేశంగా ఉంచాలని నిజాం ఆర్మీ చీఫ్ ఇద్రూస్, పాకిస్తాన్‌లో కలపాలని నిజాం పెంచి పోషించిన రజాకార్ల చీఫ్ ఖాసీం రజ్వీ చూస్తే...సంస్థానంలో రైతుకూలీ రాజ్యం కోసం కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి పావులు కదిపారు. చేయి దాటిపోయే పరిస్థితి రావడంతో భారత సైన్యాలు జనరల్ జయంత్‌నాథ్ చౌదరి ఆధ్వర్యంలో ఆపరేషన్ పోలోతో 1948, సెప్టెంబర్ 17న హైదరాబాద్‌ను భారత యూనియన్‌లో విలీనం చేశాయి. నిజాం ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు ఇద్రూస్, ఖాసీం రజ్వీలు, పడగొట్టేందుకు జయంత్‌నాథ్, నారాయణరెడ్డి ఆధ్వర్యంలోని సేనలు కారణమయ్యాయి.

రైతాంగ సేనాని.. రావి

➤ ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేక సిరాతో లిఖించిన రైతుకూలీల పోరాటాన్ని ముందుకు నడిపిన సేనాని రావి నారాయణరెడ్డి. రజాకార్లు, నిజాం సామంతులైన దేశ్‌ముఖ్‌ల ఆగడాలను ఎదుర్కొనేందుకు సాయుధ పోరాటానికి ఝంగ్ సైరన్ ఊదారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మెదక్, కరీంనగర్ జిల్లాల్లో మెజారిటీ ప్రాంతాల్లో ప్రజా ప్రభుత్వాలు ఏర్పడి సమాంతర పాలన సాగించారు. ఒక దశంలో కమ్యూనిస్టులు సంస్థానమంతా విస్తరిస్తారన్న వార్తల నేపథ్యంలోనే భారత ప్రభుత్వం ఆపరేషన్ పోలో అమలు చేసింది. రైతాంగ పోరాటమే లేకపోతే హైదరాబాద్ సంస్థానం భారతదేశ గుండెల మీద కుంపటిలా తయారయ్యేది. కశ్మీర్‌లా నిత్యం రావణకాష్టం రగిలించేది..సాయుధ పోరాటం దేశ స్వతంత్ర, సమైక్యతకు కారణమైందని రావి తన ఆత్మకథలో రాసుకున్నారు.



ఆపరేషన్ పోలో.. జయంత్‌నాథ్

➤ 'తక్కువ రక్తపాతంతో మన విజయయాత్ర ముందుకు వెళ్లాలి. శత్రువు వ్యూహం మేరకు మన ప్రతివ్యూహం ఉండాలి. మనం చేస్తున్న ఆపరేషన్ భూభాగంతోపాటు మనుషుల్ని కలిపేదిగా ఉండాలి' అంటూ తన సైన్యాలకు దిశా నిర్దేశనం చేసిన ఆపరేషన్ పోలో చీఫ్ జయంత్‌నాథ్ చౌదరి ఆధ్వర్యంలో జాతీయ పతాకం తొలిసారిగా ఇక్కడ రెపరెపలాడింది. జయంత్ 1928లో సైన్యంలో చేరి 1966లో ఇండియన్ ఆర్మీ చీఫ్‌గా ఉద్యోగ విరమణ చేశారు. హైదరాబాద్ సంస్థానంపై ఐదురోజుల్లోనే ఆపరేషన్ పూర్తి చేసిన జయంత్ హైదరాబాద్ స్టేట్‌కు తొలి మిలటరీ గవర్నర్‌గా కూడా పనిచేశారు. బెంగాల్‌లో పుట్టిన జయంత్, కాంగ్రెస్ అధ్యక్షుడిగా చేసిన డబ్ల్యూసీ బెనర్జీ మనువడే. చౌదరి అత్యున్నత సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మ విభూషణ్‌తో సత్కరించింది.



పాకిస్తాన్ కోసం.. రజ్వీ



➤ ఖాసీం రజ్వీ..పుట్టి పెరిగింది ఉత్తరప్రదేశ్‌లోని లక్నో. లా చదివి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. తన సమీప బంధువు నిజాం ఆర్మీలో ఉండటంతో అతి తక్కువ సమయంలోనే ఉన్నత స్థానాలకు చేరుకున్నాడు. 1944లో ఇతెహైదూల్ ముస్లిమీన్ వ్యవస్థాపకుడు బహదూర్‌యార్ ఝంగ్ మరణంతో ఆ సంస్థ బాధ్యతలు తీసుకొని తన ఆస్తులన్నీ సంస్థ పేరుతో రాసిచ్చాడు. నిజాం రాజును దైవాంశ సంభూతుడిగా అభివర్ణిస్తూ సిద్ధిఖీ యే దక్కన్‌గా రెచ్చిపోయి రజాకార్ల సంస్థ ఏర్పాటు చేసి నిజాం రాజ్యంలో రక్తపుటేరులు పారించారు. 1948 సెప్టెంబర్ 17న అరెస్ట్ అయ్యి 1957 వరకు జైలు జీవితం గడిపాడు. విడుదల చేస్తే తాను పాకిస్తాన్‌లో తలదాచుకుంటానన్న షరతుతో కరాచీ వెళ్లిపోయాడు. 1970 జనవరి 15న చనిపోయాడు. రజ్వీ వారసులు ఇప్పుడు పాకిస్తాన్ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు.

స్వతంత్ర రాజ్యం కోసం.. ఇద్రూస్



➤ ఇండియా ఆర్మీ చీఫ్‌గా కూడా పనిచేసే సామర్థ్యం ఉందంటూ బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ వేవెల్ హైదరాబాద్ స్టేట్ ఫోర్స్ చీఫ్ సయ్యద్ అహ్మద్ ఈఎల్ ఇద్రూస్‌ను ప్రశంసించాడు. నిజమే మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు నమ్మిన బంటుగా హైదరాబాద్ స్టేట్ ఫోర్స్‌కు సుదీర్ఘకాలం కమాండర్ ఇన్ చీఫ్‌గా పనిచేశాడు. ఇద్రూస్ పూర్వీకులు యెమన్ నుంచి వచ్చి నిజాం సైన్యంలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఇద్రూస్1913లో హైదరాబాద్ స్టేట్ ఆర్మీలో చేరి 1948 వరకు కొనసాగారు. మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల్లో బ్రిటిష్ మిత్రదేశాలకు మద్దతుగా హైదరాబాద్ లాన్సర్స్ తరఫున పాలస్తీనాతో పాటు వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. భారత్‌కు స్వాతంత్య్రం రాగానే, హైదరాబాద్ స్టేట్‌ను స్వతంత్ర రాజ్యంగా ఉంచాలనే లక్ష్యంతో యూరప్ వెళ్లి అత్యాధునిక ఆయుధ సంపత్తిని కొనుగోలు చేసే యత్నం చేసి విఫలమయ్యాడు. ఆపరేషన్ పోలో చీఫ్ జేఎన్.చౌదరి సమక్షంలో లొంగిపోయే కొన్ని క్షణాల ముందు '' ఇది జీవితంలో ఒక ఆట, మేం చేయాల్సింది అంతా చేశాం'' అంటూ అంతర్జాతీయ జర్నలిస్ట్‌తో మాట్లాడుతూ తమ లొంగుబాటు ప్రకటించారు. అయితే నిజాం ప్రధానమంత్రి లాయక్ అలీని గృహ నిర్బంధం నుంచి తప్పించిన కేసులో ఇద్రూస్ అరెస్ట్ అయ్యి విడుదలయ్యారు. కుటుంబసభ్యులంతా పాకిస్తాన్‌లో స్థిరపడగా, ఇద్రూస్ మాత్రం బెంగళూరులో చిన్నగదిలో చివరి రోజులు గడిపాడు. అనారోగ్య సమస్యలతో 1962లో చనిపోయారు.



ఇది స్పేస్ బాణసంచా

అంతెత్తున ఆకాశంలో ఎవరో బాణసంచా పేల్చితే.. అరుణ కాంతులు జాలిపడుతున్నట్టుగా అద్భుతంగా ఉంది కదూ! టిబెట్ ప్రాంతంలోని హిమాలయ పర్వతాల్లో ఏంజిల్ అన్ అనే ఫొటోగ్రాఫర్ తీసిన ఈ చిత్రం.. బ్రిటిష్ రాయల్ అబ్జర్వేటరీ ఆస్ట్రానమీ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్ పోటీలో స్కైస్కేప్స్ విభాగంలో విజేతగా నిలిచింది. భూవాతావరణంలో 50 నుంచి 90 కిలోమీటర్ల ఎత్తున.. మెరుపులు వచ్చినప్పుడు వెలువడే విద్యుదయస్కాంత తరంగాలు ఇలా ప్రకాశవంతమైన ఎరుపు, నారింజ రంగుల కాంతులను వెదజల్లుతాయి. వీటిని ట్రాన్సియెంట్ ల్యూమినస్ ఈవెంట్లు అని పిలుస్తారు.

వరంగల్ కేఎంసీలో ర్యాగింగ్!

- ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థిపై సీనియర్ల పైశాచికం
- గాయాలతో ఎంజీఎం ఆస్పత్రిలో చేరిన బాధితుడు
- రెండు రోజుల అనంతరం వెలుగు చూసిన ఘటన
- 10 మందిపై సస్పెన్షన్ వేటుకు రంగం సిద్ధం?



కాకతీయ మెడికల్ కళాశాల

ఎంజీఎం: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల(కేఎంసీ)ను ర్యాగింగ్ భూతం వెంటాడుతోంది. ఈ కళాశాలలో పీజీ వైద్యవిద్య చదువుతున్న ప్రీతి మృతి చెందిన విషయాన్ని ఇప్పుడిప్పుడే మరిచిపోతున్న క్రమంలో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. కేఎంసీలో రాజస్తాన్‌కు చెందిన మనోహర్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 14న కళాశాల లైబ్రరీలో అర్ధరాత్రి ఒంటి గంట వరకు చదువుకుని హాస్టల్ గదికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఓ సీనియర్ విద్యార్థి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న 15 మంది విద్యార్థుల కళ్లు మనోహర్‌పై పడ్డాయి. అతడిని దగ్గరికి పిలిచి మద్యం తాగించి, నృత్యాలు చేయించారు. సీనియర్లు ఎంతకీ వదలకుండా వేధిస్తుండగా ఎదురుతిరిగాడు. దీంతో అతడిని వారు దారుణంగా చితకబాదారు. ఈ ఘటనపై బాధిత విద్యార్థి ఈ నెల 15న తల్లిదండ్రుల సహాయంతో ప్రిన్సిపాల్‌కు, మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎంజీఎం ఆస్పత్రిలో అడ్మిట్

ర్యాగింగ్ ఘటనలో గాయపడ్డ మనోహర్‌ను వెంటనే ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. ర్యాగింగ్ విషయాన్ని ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ డీఎంఈకి వివరించగా కళాశాల అంతర్గత కమిటీతో విచారణ చేపట్టారు. 10 మంది విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు విచారణలో నిర్ధారించారని విశ్వసనీయ వర్గాల సమాచారం. సదరు విద్యార్థులను సంవత్సరంపాటు సస్పెండ్ చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో కేఎంసీ అధికారులపై ఒత్తిళ్లు మొదలైనట్లు తెలుస్తోంది. ఘటనపై అంతర్గత విచారణ చేస్తున్నామని, ర్యాగింగ్ జరిగినట్లు రుజువైతే ఆ విద్యార్థులపై చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ తెలిపారు.

క్వింటాల్ ధాన్యం సగటున రూ.1,685

- 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయం
- గరిష్ట ధర రూ. 1,732.. కనిష్ట ధర రూ. 1,618
- ఫైనాన్షియల్ బిడ్స్ తెరిచిన పౌరసరఫరాల సంస్థ



సాక్షి, హైదరాబాద్: మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యం విక్రయానికి మరో అడుగు ముందుకుపడింది. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా మిల్లుల్లోని 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించేందుకు ఆన్‌లైన్‌లో గత నెలలో గ్లోబల్ టెండర్లు ఆహ్వానించగా, 11 సంస్థలు 54 బిడ్స్ దాఖలు చేశాయి. ఈనెల 14న టెక్నికల్ బిడ్స్ తెరిచిన పౌరసరఫరాల సంస్థ ఈ 11 సంస్థల్లో హరియాణాకు చెందిన గురునానక్ రైస్ అండ్ జనరల్ మిల్స్ కంపెనీ బిడ్‌ను తిరస్కరించింది. మిగతా అర్హత పొందిన 10 సంస్థలకు సంబంధించి శనివారం ఫైనాన్షియల్ బిడ్స్ తెరిచారు. ఇందులో క్వింటాల్ ధాన్యానికి కనిష్టంగా రూ.1,618, గరిష్టంగా రూ.1,732 కింద బిడ్స్ వేసిన 10 సంస్థలకు 25 లాట్లు అప్పగించారు. మొత్తం 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సగటున రూ.1,685 లెక్కన విక్రయించారు.

నష్టం క్వింటాల్‌కు రూ. 375

రాష్ట్ర ప్రభుత్వం గత యాసంగి (2022–23)లో క్వింటాల్ ధాన్యాన్ని గరిష్ట మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూ.2,060 చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేసింది. యాసంగిలో మొత్తంగా 66.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లుల్లో నిల్వ ఉంచింది. యాసంగి ధాన్యాన్ని ముడిబియ్యంగా మిల్లింగ్ చేయడం వల్ల నూకల శాతం ఎక్కువగా వస్తుందని మిల్లర్లు సీఎంఆర్‌కు నిరాకరించారు. దీంతో ఈ ధాన్యాన్ని విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించి టెండర్లు ఆహ్వానించింది. ముడి బియ్యంగా మిల్లింగ్ చేస్తే వచ్చే నూకలకు నష్టపరిహారంగా క్వింటాల్ ధాన్యానికి రూ. 280 వరకు కేంద్ర ప్రభుత్వం భరించేందుకు ముందుకొచ్చినా, మిల్లర్లు ససేమిరా అనడంతో తప్పక విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే సగటున ధాన్యం క్వింటాల్‌కు రూ.1,800 వరకు విక్రయించేందుకు బిడ్స్ వస్తాయని ప్రభుత్వం భావించింది. కానీ ఫైనాన్షియల్ బిడ్స్ తెరిచిన తర్వాత 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సగటున క్వింటాల్‌కు రూ. 1,685 మాత్రమే బిడ్స్ ఫైనల్ అయ్యాయి. అంటే ఎంఎస్‌పీ రూ.2,060తో పోలిస్తే క్వింటాల్‌కు రూ. 375 ప్రభుత్వానికి నష్టం. అంటే ఒక మెట్రిక్ టన్నుకు రూ. 37 కోట్ల చొప్పున 25 ఎల్ఎంటీకి రూ. 925 కోట్ల నష్టం. కాగా ఈ ఫైనాన్షియల్ బిడ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేతృత్వంలోని కమిటీ ఆమోదించాల్సి ఉంది.

25 లాట్లు దక్కించుకున్న 10 సంస్థలు ఇవే

కేంద్రీయబండార్, సామ్ అండ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, పట్టాబి ఆగ్రోఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్‌ఫుడ్ ఇండస్ట్రీ లిమిటెడ్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ ప్రొక్యూర్‌మెంట్ ప్రాసెసింగ్ అండ్ రిటేనింగ్ కోఆపరేటివ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, నోచా ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, బగదీయ బ్రదర్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ సిద్ధరామేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్, శ్రీలలిత ఎంటర్‌ప్రైజెస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, శంభుదయాల్ జైన్ అండ్ కంపెనీ.

'అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, హెల్పర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కోరారు. ఈమేరకు శనివారం సీఎంకు ప్రత్యేకంగా లేఖ రాశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న వారంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారేనని తెలిపారు. వారం రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, హెల్పర్లకు కనీస వేతనం లేదని, పింఛన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలకు నోచుకోవడం లేదని వివరించారు. వారి సమస్యలను అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో సమ్మెకు దిగారని తెలిపారు. గతనెల 18న అంగన్‌వాడీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మంత్రి సత్యవతి రాథోడ్ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తామని నిర్దిష్టమైన హామీ ఇచ్చారని, కానీ ఆ హామీలకు భిన్నంగా ఉద్యోగ విరమణ సదుపాయాలు తీసుకురావడం సరికాదని స్పష్టం చేశారు.



ఎలిశెట్టిపల్లి వద్ద పడవ ఏర్పాటు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఎలిశెట్టిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో జంపన్నవాగు వద్ద శనివారం ఐటీడీఏ అధికారులు పడవను ఏర్పాటు చేశారు. కొత్తూరు, ఎలిశెట్టిపల్లి గ్రామాల ప్రజలకు జంపన్నవాగు వల్ల రాకపోకలకు సమస్యగా ఉండటంతో శుక్రవారం 7 నెలల గర్భిణిని ట్రాక్టర్ టైర్‌పై వాగు దాటించారు. దీనిపై శనివారం సాక్షి ప్రధాన సంచికలో ఫొటో వార్త ప్రచురితమైంది. దీంతో ఐటీడీఏ పీఓ అంకిత్ స్పందించి ప్రజల రాకపోకల కోసం పడవను ఏర్పాటు చేయించారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్

అబద్ధాలు ఆపండి.. అసలు నిజాలివీ

- చంద్రబాబును జైలుకు పంపింది ప్రభుత్వం కాదు కోర్టు
- స్కిల్ స్కాంకు సంబంధించి సీఎంగా చంద్రబాబు 13 చోట్ల సంతకాలు చేశారు లోకేశ్..
- గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద మేం ఏ రాష్ట్రంలోనూ ప్రాజెక్టు చేపట్టలేదని సీమెన్స్ స్పష్టంచేసింది
- రాష్ట్రంలో మాకు తెలియకుండానే కంపెనీ ప్రతినిధులు కొందరు కుమ్మక్కయారని సీమెన్స్ చెప్పిన మాట వాస్తవం కాదా!?
- రూ.130 కోట్లు ఖర్చుచేసి రూ.3,300 కోట్ల ప్రాజెక్టు అంటే నమ్మేదెలా?
- రూ.240 కోట్లు హవాలా మార్గంలో తరలించినట్లు ఈడీ, ఐటీ విచారణల్లో తేలిన విషయం నిజమా కాదా?

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పెట్టుబడులు ఆకర్షించేలా వసతుల కల్పన

- అందుకే ఐటీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ రంగాల్లో భారీ పెట్టుబడులు: కేటీఆర్
- ఐటీ ఉద్యోగాల కల్పనలో బెంగళూరును హైదరాబాద్ దాటేసింది
- ఐటీ ఎగుమతులతోపాటు ధాన్యం ఉత్పత్తిలోనూ తెలంగాణ అగ్రస్థానం
- మహారాష్ట్ర రియల్ ఎస్టేట్ ప్రతినిధులతో భేటీలో మంత్రి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రభుత్వం బహుముఖ వ్యూహంతో పనిచేస్తోందని ఐటీ, మునిసిపల్ శాఖల మంత్రి కె.తారక రామారావు అన్నారు. నగరంలో ఐటీ, దాని అనుబంధ రంగాలతోపాటు లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ రంగాల్లోనూ భారీ ఎత్తున పెట్టుబడులు ఆకర్షించేలా చేపట్టిన మౌలిక వసతుల కల్పన ఆశించిన ఫలితాలను ఇస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రగతి, హైదరాబాద్ అభివృద్ధిపై అధ్యయనం కోసం మహారాష్ట్ర నుంచి 250 మందితో కూడిన రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధుల బృందం మూడు రోజుల పర్యటన కోసం హైదరాబాద్ వచ్చింది. శనివారం వారు టీ–హబ్‌లో కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారులకు కల్పిస్తున్న సదుపాయాల కారణంగానే ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో తమ అతిపెద్ద కార్యాలయాలను ఏర్పాటు చేశాయన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఐటీ ఉద్యోగాల కల్పనలో బెంగళూరు నగరాన్ని హైదరాబాద్ వరుసగా రెండేళ్లు దాటేసిందన్నారు. ఐటీ ఎగుమతులతోపాటు ధాన్యం ఉత్పత్తిలోనూ తెలంగాణ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విప్లవాత్మకమైన టీఎస్ ఐపాస్, భవన నిర్మాణాల అనుమతుల కోసం టీఎస్ బీపాస్‌ను ప్రవేశపెట్టామన్నారు. టీఎస్–బీపాస్ కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు రియల్ ఎస్టేట్ రంగ భాగస్వాములతో ముఖ్యమంత్రి స్వయంగా సమావేశమై ఒక్కరోజే 7 జీవోలను జారీ చేశారని గుర్తుచేశారు. ఇప్పటికే తెలంగాణ విధానాలను, పథకాలను అనేక రాష్ట్రాలు వచ్చి అధ్యయనం చేసి వెళ్లాయన్నారు. అందుకే తెలంగాణ ఈరోజు చేసిన కార్యక్రమాలను భారతదేశం రేపు అనుసరిస్తుందని అంటున్నారని చెప్పారు.



టీ హబ్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

మహారాష్ట్రతో అనుబంధం వీడనిది

విద్యార్థిగా పుణేలో చదివిన రోజుల నుంచి మహారాష్ట్రతో తనకు అనుబంధం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని అనేక జిల్లాలు చరిత్రాత్మకంగా తెలంగాణతో అనుబంధాన్ని కలిగి ఉన్నాయని, ఇవి గతంలో హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉన్నాయని గుర్తు చేశారు. అందుకే తెలంగాణ, మహారాష్ట్ర మధ్యన సాంస్కృతిక, మానవ సంబంధాలు బలంగా ఉన్నట్లు చెప్పారు. దేశంలో ముంబై తర్వాత ఎత్తైన భవనాలు కలిగిన నగరంగా హైదరాబాద్ స్థానం సంపాదించుకుంటుందన్నారు.

బుల్లెట్ ట్రైన్ కన్నా వేగంగా అభివృద్ధి: మహారాష్ట్ర ప్రతినిధి బృందం

హైదరాబాద్ గత పదేళ్లలో అద్భుతంగా అభివృద్ధి చెందిందని మహారాష్ట్ర ప్రతినిధులు వ్యాఖ్యానించారు. రాష్ట్రం ఏర్పాటు కన్నా ముందు హైదరాబాద్‌లో ఉన్న పరిస్థితి తమకు గుర్తుందని, పాలకులకు సరైన విజన్ ఉంటే అభివృద్ధి చెందుతుందనడానికి హైదరాబాద్ నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ వేగాన్ని మించి అభివృద్ధి చెందుతుందని ప్రశంసలు కురిపించారు.

రామోజీ.. నీకు మానవత్వం లేదా!

- జైలు సూపరింటెండెంట్ రాహుల్‌పై తప్పుడు కథనాలా..
- నిప్పులు చెరిగిన ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి



సాక్షి, అమరావతి: రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ సెలవు విషయంలో తన స్నేహితుడు చంద్రబాబు కోసం రామోజీరావు దిగజారి ఈనాడులో తప్పుడు రాతలు రాయించాడని ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన చెత్త పేపర్‌ను అడ్డుపెట్టుకుని తప్పుడు రాతలు రాసి, రాజకీయ వ్యభిచారం చేస్తున్నాడని మండిపడ్డారు. జైలుకు కొత్త అధికారిగా వచ్చిన వారిపైనా ఈనాడు పత్రిక బురద జల్లే ప్రయత్నం చేసిందని, రామోజీ దిగజారిపోయినంత మాత్రాన అధికారులు దిగజారిపోరని చెప్పారు. అధికారం కోసం అవినీతి, వెన్నుపోట్లు, మేనేజ్‌మెంట్లు చేసి చంద్రబాబు ఇన్నాళ్లు నెట్టుకొచ్చాడని, అలాంటి దుర్మార్గుడిని అక్షరాలతో వ్యభిచారం చేసే రామోజీ తన భుజాన మోస్తున్నాడని ధ్వజమెత్తారు. రామోజీ కథనంపై శనివారం పోసాని హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

బుద్ధిలేనోడా.. రామోజీ

'జైలు సూపరింటెండెంట్ రాహుల్ భార్య కొన్నాళ్లుగా ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రిలో ఉంది. ఉన్నతాధికారుల అనుమతితో సెలవులో రాహుల్ ఆస్పత్రికి వెళ్లారు. కానీ ఈనాడు పత్రిక దిగజారిపోయి తప్పుడు రాతలు రాసింది. ఒరే బుద్ధిలేనోడా రామోజీరావు.! నీ చిన్న కొడుకు ఎలాగైతే చనిపోయాడో రాహుల్ భార్య కూడా అలాగే చనిపోయింది. నీకో చెత్త పేపర్ ఉందని ఇంత రాజకీయ వ్యభిచారం చేస్తావా? ఇప్పటికే నీ పత్రికలో అక్షరాలను వేశ్యలుగా మార్చావు. ఏదో రోజు ఆ అక్షరాల ఎయిడ్స్ తగిలి కుళ్లికుళ్లి చస్తావు. ఓ ఆడ కూతురు చనిపోయి రాహుల్ కుటుంబం ఏడుస్తుంటే.. కావాలనే ప్రభుత్వ పెద్దలు ఆయన్ను సెలవులో పంపించారని తప్పుడు రాతలు రాస్తావా.? ఇది నిజమని నిరూపించు. నీకు మానవత్వం అనేది లేదా? రేపు రామోజీ చనిపోతే ఆయన కొడుకు కిరణ్ తన తండ్రి శవాన్ని చూడ్డానికి వెళ్లకుండా ఈనాడు కార్యాలయంలో పనిచేసుకుంటూ ఉంటాడా.. నాకు నా తండ్రి కంటే పత్రికే ముఖ్యమంటాడా? నీ కొడుకే చచ్చాడనుకో ఆయన భార్య నేను రాను అని మార్గదర్శిలోనే ఉంటుందా.. వెళ్లి నీ కొడుకును చూసి కన్నీళ్లు పెట్టుకోదా? నీకు మాత్రమే కన్నీళ్లు ఉంటాయా? రాహుల్‌కు కన్నీళ్లు ఉండవా? రాహుల్‌తో సెలవు పెట్టించి రవికిరణ్‌ను తీసుకొచ్చారని, ఆయన ఆర్థికమంత్రి బుగ్గనకు దగ్గరి బంధువంటూ తప్పుడు రాతలు రాస్తావా? అధికారులంటే నీలా, ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ5లా జగన్ నాశనం కావాలని కోరుకునేవారే ఉంటారనుకున్నావా. మా కమ్మోడు.. మా చంద్రబాబే ముఖ్యమంత్రి కావాలి. ఆయన ఎన్ని వెధవ పనులు చేసినా, ఆడవారి జీవితాలను నాశనం చేసినా.. ఆయనే సీఎం కావాలి అంటున్నావా?. మీరు ఎన్ని తిట్టినా ప్రజలు మాత్రం జగన్నే నమ్మారు, అందుకే 151 సీట్లు ఇచ్చారు. మళ్లీ మీ కుళ్లు రాతలు రాయండి, యజ్ఞాలు, చేతబడులు చేయండి. ప్రజలు మాత్రం జగన్‌ను గుండెల్లో పెట్టుకున్నారు. మీరు ఎంత ఏడ్చినా ఆయనకేం కాదు' అని అన్నారు.

ఆదివారం 17-9-2023

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 16 సంచిక: 178

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

క్లుప్తంగా...

పాకిస్తాన్‌లో లీటర్ పెట్రోల్ రూ.330

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని ఆపద్ధర్మ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచింది. లీటర్ పెట్రోల్‌పై రూ.26.02, డీజిల్‌పై రూ.17.34 పెంచుతున్నట్లు శుక్రవారం అర్ధరాత్రి ప్రకటించింది. తాజా పెంపుతో లీటర్ పెట్రోల్, హైస్పీడ్ డీజిల్ ధర గతంలో ఎన్నడూ లేనంత స్థాయికి రూ.330కు చేరుకుంది. ద్రవ్యోల్బణం 27.4 శాతానికి చేరడంతో ఈ చర్య అనివార్యమయినట్లు ప్రభుత్వం చెబుతోంది. శనివారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 296.41 పాకిస్తానీ రూపాయలకు చేరుకుంది. ఈ నెల ఒకటో తేదీన కూడా ఆపద్ధర్మ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.14 చొప్పున పెంచింది.

'ఇండియా' కూటమి బహిరంగ సభ వాయిదా

భోపాల్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో అక్టోబర్‌లో నిర్వహించ తలపెట్టిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి తొలి బహిరంగ సభ వాయిదా పడింది. మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ శనివారం ఈ విషయం ప్రకటించారు. బహిరంగ సభ ఎప్పుడు నిర్వహించాలన్నది ఇంకా నిర్ణయించలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా చెప్పారు. భోపాల్‌లో ఉమ్మడిగా భారీ సభ నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని ఇండియా కూటమి పక్షాలు ఇటీవలే నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే.

దమ్ముంటే దేశం పేరు మార్చండి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: కేంద్రంలోని అధికార బీజేపీకి నిజంగా దమ్ముంటే దేశం పేరును మార్చాలని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సవాలు విసిరారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం చాలా పథకాలకు ఇండియా అని పేరు పెట్టిందని చెప్పారు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా' అని పేరుపెట్టుకున్న తర్వాత అది సహించలేక దేశం పేరు మార్చే ఆలోచన చేస్తోందని ఆరోపించారు. ''దేశం మీ అబ్బ సొత్తా? ఇది 140 కోట్ల మందికి చెందిన దేశం. ఇండియా, భారత్, హిందూస్తాన్ అనేవి ప్రజల హృదయాల్లో జీవిస్తున్నాయి'' అని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఆయన శనివారం ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. ఇప్పుడు దేశం పేరును 'భారత్'గా మార్చిన తర్వాత ప్రతిపక్ష కూటమి పేరు భారత్‌గా మారితే అప్పుడు కూడా దేశం పేరును మారుస్తారా? అని ప్రశ్నించారు.

సరైన చర్యలుంటేనే 2050 కల్లా ఉద్గారాలకు పూర్తిగా కళ్లెం
కానీ 2030 లక్ష్యాలకే అతీగతీ లేని దుస్థితి
సంపన్న దేశాల ద్వంద్వ ప్రమాణాలే ప్రధాన కారణం
భావితరాలకు పెను ప్రమాదమే
హెచ్చరిస్తున్న తాజా నివేదిక..



రూ. 2.24 కోట్ల కోట్లు!

కర్బన, గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలు. ప్రస్తుతం ప్రపంచ మానవాళికి పెను ప్రమాదంగా పరిణమించిన పెను సమస్యలు. పర్యావరణం పట్ల మనిషి బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట. వాటిని ఎలాగైనా తగ్గించాలన్న ప్రతినలు, లక్ష్యాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. భావితరాల భద్రత పట్ల మన జవాబుదారీతనాన్ని నిరంతరం ప్రశ్నిస్తూనే ఉన్నాయి. ప్రస్తుత లెక్కల్లో 2050 నాటికి ఉద్గారాలను పూర్తిగా (నెట్ జీరో స్థాయికి) తగ్గించాలంటే ప్రపంచ స్థాయిలో ఇప్పటి నుంచీ ఏటా కనీసం 2.24 కోట్ల కోట్ల రూపాయలు (2.7 లక్షల కోట్ల డాలర్లు) వెచ్చించాల్సి ఉంటుందట! అలాగైతేనే ఈ శతాబ్దాంతానికల్లా అంతర్జాతీయ సగటు ఉష్ణోగ్రతలు కూడా 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్ పరిమితిని దాటకుండా ఉంటాయట. కానీ ఉద్గారాలకు ప్రధాన కారణంగా ఉన్న చాలా దేశాలు తామే స్వయంగా నిర్దేశించుకున్న 2030 లక్ష్యాల సాధనకే అల్లంత దూరంలో ఉన్నాయనీ తాజా నివేదిక ఒకటి వాపోతోంది! ఈ పరిస్థితుల్లో వాటి నుంచి 2050 లక్ష్యాల పట్ల చిత్తశుద్ధితో కూడిన కార్యాచరణను ఆశించడం అత్యాశేనని పర్యావరణవేత్తలు అంటున్నారు. మరోవైపు సముద్రాలకు ముప్పు కూడా నానాటికీ మరింతగా పెరిగిపోతోందని గ్రీన్ పీస్ నివేదిక హెచ్చరిస్తోంది. చేపల వేట విచ్చలవిడిగా సాగుతోందని, గత నాలుగేళ్లలో 8.5 శాతం దాకా పెరిగిందని అది పేర్కొంది!

లక్ష్యాలు ఘనమే కానీ...

- కర్బన ఉద్గారాల కట్టడికి ప్రస్తుతం అన్ని దేశాలూ కలిపి ఏటా 1.9 లక్షల కోట్ల డాలర్లు వెచ్చించాలన్నది లక్ష్యం. కానీ ఇదీ ఒక్క ఏడాది కూడా జరగడం లేదు.
- పలు కీలక సంపన్న దేశాలు ఈ విషయంలో చేస్తున్న గొప్ప ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయి.
- అవి పాటిస్తున్న ఈ ద్వంద్వ ప్రమాణాలు పరిస్థితిని మరింత జటిలం చేస్తున్నాయి.
- అవిలాగే దాటవేత ధోరణి కొనసాగిస్తే ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు 2050 కల్లా ఏకంగా 2.5 డిగ్రీలు పెరగడం, మానవాళి మనుగడ పెను ప్రమాదంలో పడటం ఖాయమని స్వయంగా ఐక్యరాజ్యసమితే తాజాగా హెచ్చరించింది.

నెట్ జీరో అంటే..

- కర్బన ఉద్గారాలను దాదాపుగా సున్నా స్థాయికి తగ్గించడం.
- కాస్తో కూస్తో మిగిలే ఉద్గారాలను మహా సముద్రాలు, అడవుల వంటి ప్రాకృతిక వనరులు శోషించుకుంటాయన్నది సిద్ధాంతం.
- ఇందుకు ఉద్దేశించిన నిధుల్లో మూడొంతులు కీలకమైన ఇంధన, మౌలిక రంగాలపై వెచ్చించాలన్నది లక్ష్యం. మిగతా లక్ష్యాలు ఏమిటంటే...
- రవాణా రంగాన్ని వీలైనంతగా విద్యుదీకరించడం.
- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి.

సముద్రాలకు 'మహా' ముప్పు

మహా సముద్రాలలో విచ్చలవిడిగా సాగుతున్న చేపల వేటపై అంతర్జాతీయ పర్యావరణ సంస్థ గ్రీన్ పీస్ తాజా నివేదిక తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది...



- కానీ ఏ దేశమూ ఈ ఒప్పందాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదని నివేదిక వాపోతోంది.
- విచ్చలవిడిగా వేట దెబ్బకు అరుదైన సముద్ర జీవరాశులు దాదాపుగా అంతరించిపోతున్నాయి.
- 2018తో పోలిస్తే 2022 నాటికి సముద్రాల్లో చేపల వేట 8.5 శాతం పెరిగింది. ప్రత్యేక రక్షిత ప్రాంతాలైన సున్నిత సముద్ర జలాల్లోనైతే ఏకంగా 23.5 శాతం పెరిగింది.
- నిర్దిష్ట అంతర్జాతీయ సముద్ర జలాలను చేపల వేటను నిషేధించాలన్న ప్రతిపాదనలు ఏళ్ల తరబడి గ్రీన్ పీస్ చేసిన కృషి ఫలించి ఎట్టకేలకు గత మార్చిలో ఒప్పందంగా రూపుదాల్చాయి. జూన్‌లో ఐరాస కూడా దానికి ఆమోదముద్ర వేసింది.
- ఉదాహరణకు పసిఫిక్ బ్లూఫిన్ ట్యూనా చేప జాతి గత మూడు దశాబ్దాల్లోనే ఏకంగా 90 శాతానికి పైగా క్షీణించిపోయింది.
- '30 బై 30' లక్ష్య సాధనకు దేశాలన్నీ ఇప్పటికైనా నడుం బిగిస్తే మేలని గ్రీన్ పీస్ నివేదిక పేర్కొంది.
- ప్రపంచంలోని భూ, జలవనరులను 2030 కల్లా కనీసం 30 శాతమన్నా సంపూర్ణంగా సురక్షితంగా తీర్చిదిద్దడమే '30 బై 30' లక్ష్యం.

ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే '1.5 డిగ్రీ ఉష్ణోగ్రత లక్ష్య సాధన అత్యంత పెను సవాలేనని చెప్పాలి. ఈ దశాబ్దంలో మిగిలి ఉన్న ఆరేళ్లలో ఆ దిశగా ఎంత చిత్తశుద్ధితో ప్రయత్నిస్తామన్న దానిపైనే ప్రపంచ భవిష్యత్తు చాలావరకు ఆధారపడి ఉంటుంది'

– సైమన్ ఫ్లవర్స్
సీఈఓ, చీఫ్ స్ట్రాటజిస్ట్, వుడ్ మెకంజీ సంస్థ

'లక్ష్యాల మాట ఎలా ఉన్నా చమురు, సహజ వాయువు పాత్ర అంతర్జాతీయ స్థాయి లో కనీసం మరి కొన్నేళ్ల పాటు కీలకంగానే ఉండనుంది'

– ప్రకాశ్ శర్మ
వైస్ ప్రెసిడెంట్, వుడ్ మెకంజీ

– సాక్షి, నేషనల్ డెస్క్

రేపటి నుంచి పార్లమెంట్

నేడు అఖిలపక్షం భేటీ

న్యూఢిల్లీ: ఈనెల 18వ తేదీ నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరుగనుండగా ఒక రోజు ముందుగా ఆదివారం అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో ప్రభుత్వం సమావేశం కానుంది. ఈ సెషన్ ఉద్దేశం వారికి వివరించి, అభిప్రాయాలు తెలుసుకోనుంది. అయిదు రోజుల సమావేశాల్లో మొదటిరోజు రాజ్యాంగ సభ మొదలుకొని 75 ఏళ్ల పార్లమెంట్ ప్రస్థానంపై ప్రత్యేక చర్చ ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే రాజ్యసభలో ప్రవేశపెట్టిన ది అడ్వొకేట్స్(సవరణ)బిల్లు–2023, ది ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు–2023, ది పోస్టాఫీస్ బిల్లు–2023లను ఈ సెషన్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన మార్పులతో గత సమావేశాల్లో రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లును ఈసారి చర్చకు పెట్టనుంది. అయితే, అనూహ్యంగా మరికొన్ని అంశాలను సైతం ముందుకు తీసుకువచ్చే అవకాశాలున్నాయన్న చర్చ సర్వత్రా జోరుగా సాగుతోంది. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు కోటా కల్పించే బిల్లును ఈ సమావేశాల్లోనే ప్రవేశపెడుతుందనే వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం దీనిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. ఈ ప్రత్యేక సెషన్ సమయంలోనే పార్లమెంట్‌ను నూతన భవనంలోకి మార్చనుందని భావిస్తున్నారు. పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధాని మోదీ మే 28వ తేదీ ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులోకి మారాక వివిధ విభాగాల సిబ్బందికి కొత్త యూనిఫాం అందజేసేందుకు సైతం కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే, ఈ యూనిఫాంపై బీజేపీ ఎన్నికల గుర్తు కమలం ముద్రించడంపై కాంగ్రెస్ మండిపడింది. ఈ అంశంపైనా ప్రత్యేక సెషన్‌లో ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టే అవకాశాలున్నాయి. ప్రధాని మోదీ సారథ్యంలో దేశ రాజధానిలో ఇటీవల విజయవంతంగా ముగిసిన జీ20 శిఖరాగ్రం అంశాన్ని పాలకపక్షం చర్చకు తీసుకు వస్తుందని భావిస్తున్నారు. ఏడాదిలో మూడుసార్లు బడ్జెట్, వర్షాకాల, శీతాకాల సమావేశాలు సర్వసాధారణంగా జరుగుతుంటాయి.



నూతన భవనంపై నేడు పతాకావిష్కరణ

పార్లమెంట్ నూతన భవనంపై ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆదివారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు సోమవారం నుంచి కొత్త భవనంలోనే ప్రారంభం కానున్న దృష్ట్యా జగదీప్ ధన్‌ఖడ్ గజద్వారంపై జాతీయ జెండాను ఎగురవేస్తారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతోపాటు కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఆ పోలీసును తొలగించాలి

అమెరికాలో ఆన్‌లైన్ పిటిషన్

వాషింగ్టన్: అమెరికాలో గత జనవరిలో పోలీసు వాహనపు అతి వేగానికి బలైన తెలుగమ్మాయి జాహ్నవి కందుల విషయంలో జాత్యహంకార వ్యాఖ్యలు చేసిన సియాటిల్ పోలీసు అధికారి డేనియల్ ఆడరర్‌పై ఆగ్రహ జ్వాలలు నానాటికీ పెరుగుతున్నాయి. 'ఇదేమంత పెద్ద విషయం? ఏ 11 వేల డాలర్లకో చెక్కు రాస్తే సరి. ఆమెకు 26 ఏళ్లు. అలా చూస్తే ఆమె జీవితం అంత విలువైనదేమీ కాదు' అంటూ ఈ ఉదంతంపై అతను చేసిన వ్యాఖ్యలు గత సోమవారం బాడీకామ్ ద్వారా వెలుగులోకి వచ్చాయి. అప్పటినుంచీ వాటిపై తీవ్ర దుమారం రేగుతోంది. రాజా కృష్ణమూర్తి వంటి భారత అమెరికన్ చట్ట సభ్యులతో పాటు అమెరికా చట్ట సభ్యులు కూడా వాటిని తీవ్రంగా తప్పుబడుతున్నారు. డేనియల్ ప్రవర్తన మీద స్వతంత్ర విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. అతన్ని ఉద్యోగం నుంచి తొలగించాలంటూ శుక్రవారం (అమెరికా కాలమానం ప్రకారం) ఆన్‌లైన్ పిటిషన్ దాఖలైంది. నిషిత రోహెజా గోయల్ అనే భారత్ అమెరికన్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ఇప్పటికే వేలాది మంది సంతకాలు చేశారు. శుక్రవారం రాత్రికే సంతకాల సంఖ్య 6,700 దాటిపోయింది. 'డేనియల్ ప్రవర్తనతో సియాటిల్ పోలీసు శాఖపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లింది. అందుకే అతన్ని తక్షణం ఉద్యోగం నుంచి తొలగించడంతో పాటు ఇకపై కొత్తగా పోలీసు శాఖలో చేరే ప్రతి ఒక్కరికీ సున్నితత్వం తదితరాల విషయంలో విధిగా శిక్షణ ఇవ్వాలి. అప్పుడే జాహ్నవి, అలాంటి ఇతర బాధిత కుటుంబాలకు కాస్తయినా సాంత్వన చేకూరుతుంది' అని పిటిషన్ పేర్కొంది. మరోవైపు, డేనియల్‌ను సియాటిల్ పోలీసు అధికారుల గిల్డ్ సమర్థించింది! అతను ప్రైవేట్‌గా చేసిన వ్యాఖ్యలను అసంబద్ధంగా విడుదల చేసి అపార్థాలకు తావిచ్చారని ఆరోపించింది. ఈ మేరకు సుదీర్ఘ వివరణ విడుదల చేసింది. తన వ్యాఖ్యలను దురర్థం వచ్చేలా వక్రీకరించారని డేనియల్ కూడా ప్రకటన విడుదల చేశాడు.

చొరబాట్లు ఆగాలంటే మోదీకే ఓటేయండి

బిహార్‌లో జరిగిన ర్యాలీలో హోం మంత్రి అమిత్ షా • నితీశ్, లాలూవి బుజ్జగింపు రాజకీయాలని ఆరోపణ

ఝంఝార్‌పూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరోసారి అధికారం ఇవ్వకుంటే బిహార్‌లోని సరిహద్దులకు సమీపంలోని ప్రాంతాలు అక్రమ చొరబాటుదార్లతో నిండిపోతాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హెచ్చరించారు. బిహార్‌లో ఝంఝార్‌పూర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో శనివారం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. బిహార్‌లోని ఈ ప్రాంతం నేపాల్, బంగ్లాదేశ్‌ల సరిహద్దులకు సమీపంలో ఉంటుంది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దుతోపాటు వచ్చే ఏడాది జనవరికల్లా అయోధ్యలో రామాలయ నిర్మాణం పూర్తి చేయనున్న ప్రధాని మోదీపై ఆయన ప్రశంసలు కురిపించారు. లాలూ– నితీశ్ ద్వయం మళ్లీ అధికారంలోకి వచ్చినా, ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టలేకపోయినా ఈ ప్రాంతం మొత్తం అక్రమ చొరబాటుదార్లతో కిక్కిరిసిపోవడం ఖాయమన్నారు. ఫలితంగా బిహార్‌ను అనేక సమస్యలు చుట్టుముడతాయని ఆయన హెచ్చరించారు. చొరబాటుదార్లతో ఈ ప్రాంతం నిండిపోవాలని మీరు అనుకుంటున్నారా అని ఆయన ప్రశ్నించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే 2024 లోనూ బిహార్‌లోని మొత్తం 40 సీట్లను బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



యూపీఏ బదులు..ఇండియా ఎందుకంటే..

యూపీఏ హయాంలో 12 లక్షల కోట్ల కుంభకోణంతో సంబంధాలున్నాయి కాబట్టే అప్పటి పార్టీలన్నీ కలిసి ఈసారి ఇండియా అనే కొత్త పేరు పెట్టుకున్నాయని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఆ కూటమి నేతలు సనాతన ధర్మాన్ని చులకన చేసి మాట్లాడటాన్ని ఆయన తప్పుపట్టారు. ప్రధాని పీఠంపై ఆశలు పెట్టుకున్న నితీశ్ కుమార్ గతంలో లాలూ ప్రసాద్ పాల్పడిన కుంభకోణాలను చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారని ఆరోపించారు. అయితే, ప్రధాని పదవి ఖాళీగా లేదన్న విషయం నితీశ్ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. లాలూతో నితీశ్ పొత్తు నీళ్లు, చమురు కలయిక చందంగా ఉంటుందన్నారు. నీళ్లతో చమురు కలియకపోగా నీళ్లన్నిటినీ కలుషితం చేస్తుందని అమిత్ షా వ్యాఖ్యానించారు. ప్రధాని కావడమెలాగని నితీశ్ ఆలోచిస్తుండగా లాలూ మాత్రం తన కొడుకు, డిప్యూటీ సీఎం తేజస్వీని సీఎంగా చూడాలని ప్రణాళికలు వేస్తున్నారని చెప్పారు. సీఎం నితీశ్ కుమార్, ఆర్‌జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ కలిసి ప్రభుత్వ స్కూళ్లకు సెలవులు తగ్గించడం వంటి బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నా రని ఆరోపించారు. రాష్ట్రంలోని సంకీర్ణ కూటమిలోని కాంగ్రెస్ కూడా ఇదే వైఖరితో ఉందన్నారు. కృష్ణాష్టమి, రక్షాబంధన్ సందర్భంగా సెలవులను రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వును రద్దు చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చిన బిహార్ ప్రజలకు అమిత్ షా అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు సమ్మె చేయడంతో ఏడాదిలో అవసరమైనన్ని రోజులు తరగతులు నిర్వహించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన కొత్త క్యాలెండర్‌ను విద్యాశాఖ ఉపసంహరించుకున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

23న కోవింద్ కమిటీ తొలి భేటీ

'వన్ నేషన్–వన్ ఎలక్షన్'పై చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిఫార్సులు చేసేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన అత్యున్నత స్థాయి కమిటీ తొలి అధికారిక సమావేశం ఈనెల 23న జరగనుంది. ఈ విషయాన్ని భువనేశ్వర్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోవింద్ స్వయంగా ప్రకటించారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే అంశంపై వీలైనంత త్వరగా పరిశీలించి సిఫార్సులు చేసేందుకు 8 మంది సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీని ప్రభుత్వం గతంలోనే నోటిఫై చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీలో హోం మంత్రి అమిత్‌షా, లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి, రాజ్యసభలో మాజీ ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్, ఆర్థిక సంఘం మాజీ చైర్మన్ ఎన్‌కే సింగ్, మాజీ లోక్‌సభ సెక్రటరీ జనరల్ సుభాష్ సి.కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారీ సభ్యులుగా ఉన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్న న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, ప్యానల్ కార్యదర్శిగా ఉన్న న్యాయశాఖ కార్యదర్శి నితిన్ చంద్ర భేటీకి హాజరయ్యే అవకాశాలున్నాయి. 'వన్ నేషన్–వన్ ఎలక్షన్'పై రాజ్యాంగానికి అవసరమైన నిర్దిష్ట సవరణలు, ప్రజాప్రాతినిధ్య చట్టంలో, ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం కోసం అవసరమయ్యే ఇతర సవరణలపై లోతుగా చర్చించనుంది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 22వ తేదీతో ముగియనుండగా, ఆ మరుసటి రోజే కమిటీ భేటీ కానుండటం గమనార్హం.



రష్యాలో కిమ్ జోంగ్ ఉన్ బిజీబిజీ

అత్యాధునిక క్షిపణులు, ఆయుధాలు పరిశీలించిన ఉత్తర కొరియా నియంత

సియోల్: ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ రష్యా పర్యటనలో బిజీబిజీగా గడుపుతున్నారు. ఆయన శనివారం రష్యా ఆయుధాగారాన్ని సందర్శించారు. రష్యా అభివృద్ధి చేసిన అణ్వస్త్ర సహిత బాంబర్లు, హైపర్‌సానిక్ క్షిపణులు, అత్యాధునిక యుద్ధ నౌకను పరిశీలించారు. కిమ్ తొలుత ఉత్తర కొరియా నుంచి రైలులో అర్టియోమ్ సిటీకి చేరుకున్నారు. ఇక్కడికి సమీపంలోని ఎయిర్‌పోర్టులో రష్యాకు చెందిన వ్యూహాత్మక బాంబర్లు, యుద్ధ విమానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కిమ్ వెంట రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగు ఉన్నారు. టు–160, టు–95–, టు–22 బాంబర్ల గురించి కిమ్ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. మిగ్–31 ఫైటర్ జెట్ నుంచి ప్రయోగించే హైపర్‌సానిక్ కింజాల్ క్షిపణుల గురించి కిమ్‌కు సెర్గీ వివరించారు. ఇలాంటి క్షిపణులను ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా సైన్యం ప్రయోగిస్తోంది. కిమ్, సెర్గీ షోయిగు కలిసి రేవు నగరం వ్లాదివోస్తోక్ చేరుకున్నారు. ఇక్కడ అత్యాధునిక యుద్ధ నౌకలను, ఆయుధాలను కిమ్ పరిశీలించారు. ఆయుధాలు, ఉపగ్రహాల తయారీ విషయంలో రష్యా నుంచి ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికే కిమ్ రష్యాలో పర్యటిస్తున్నట్లు పశ్చిమ దేశాలు అంచనా వేస్తున్నాయి.

యూకే విజిటింగ్, స్టూడెంట్ వీసా ఫీజుల మోత

లండన్: బ్రిటన్ ప్రభుత్వం విద్యార్థి, సందర్శక వీసా ఫీజులను త్వరలో భారీగా పెంచనుంది. విజిటింగ్ వీసాపై 15 పౌండ్లు, విద్యార్థి వీసాపై అదనంగా 127 పౌండ్లు పెంచుతున్నట్లు తెలిపింది. భారతీయులు సహా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల వారికి ఇవి వర్తిస్తాయని పేర్కొంది. ఈ పెంపుదల అక్టోబర్ నాలుగో తేదీ నుంచి అమల్లోకి రానుందని స్పష్టం చేసింది. శుక్రవారం పార్లమెంట్‌లో హోంశాఖ ఈ మేరకు బిల్లు ప్రవేశపెట్టింది. దీని బిల్లు ప్రకారం ఆరు నెలల విజిటింగ్ వీసా ఫీజు ప్రస్తుతమున్న 100 పౌండ్ల నుంచి 115 పౌండ్ల(సుమారు రూ.12 వేలు)కు, విద్యార్థి వీసాకు ఫీజు 363 పౌండ్ల నుంచి 490 పౌండ్ల(సుమారు రూ.50 వేలు)కు పెరగనుంది. ఫీజుల పెంపు ఆరోగ్యం, సంరక్షణ వీసాతో సహా దాదాపు అన్ని రకాల వీసాలకు వర్తిస్తుంది; బ్రిటిష్ పౌరుడిగా నమోదు దరఖాస్తుకు, ఆరు నెలలు, రెండు, ఐదు, 10 సంవత్సరాల సందర్శన వీసాల ఫీజులు కూడా పెరగనున్నాయి. ఉద్యోగం, చదువుకు సంబంధించిన కొన్ని దరఖాస్తులకు సైతం ఈ పెంపు వర్తిస్తుంది. అక్టోబర్ నాలుగో తేదీ నుంచి ఇవి అమల్లోకి వస్తాయని హోం శాఖ తెలిపింది.

పైకప్పు కూలిపడి అయిదుగురు మృత్యువాత



లక్నో: ఇంట్లో నిద్రిస్తున్న వారిపై పైకప్పు కొంతభాగం కూలిపడిన ఘటనలో తల్లిదండ్రులు, వారి ముగ్గురు చిన్నారులు మృత్యువాతపడ్డారు. ఆలంబాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్ రైల్వే కాలనీలో శనివారం వేకువజామున ఘటన చోటుచేసుకుంది. ఉదయం 8 గంటల సమయంలో పారిశుధ్య సిబ్బంది గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులతో కలిసి శిథిలాల నుంచి చంద్ర, సరోజినీ దేవి(35), వారి పిల్లలు హర్షిత్(13), హర్షిత(10), అన్ష్(5) మృతదేహాలను వెలికి తీశారు. కాలనీలోని వారుంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, ఖాళీ చేయమని నోటీసులిచ్చినా పట్టించుకోలేదని రైల్వే అధికారులు తెలిపారు.

లిఫ్టు కూలిన ఘటనలో 8కి చేరిన మృతులు

నోయిడా: గ్రేటర్ నోయిడాలోని నిర్మాణంలో ఉన్న భవనంలో లిఫ్టు కూలిన ఘటనలో క్షతగాత్రులైన నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో, ఈ ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. ఆమ్రపాలి డ్రీమ్ వ్యాలీ ప్రాజెక్టులోని నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో శుక్రవారం ఉదయం 14వ ఫ్లోర్ నుంచి లిఫ్టు కూలి నలుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలించిన అయిదుగురిలో నలుగురు శనివారం చనిపోయారు. మరొకరు ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. బాధితులంతా యూపీ, బిహార్‌లకు చెందిన వలస కార్మికులు.



కేరళలోని కోజికోడ్ బీచ్ ఇది. నిఫా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు అధికారులు విధించిన ఆంక్షలతో ఇలా బోసిపోయింది. రాష్ట్రంలో నిఫా వైరస్ కేసులేవీ కొత్తగా నమోదు కాలేదని ప్రభుత్వం శనివారం తెలిపింది. బాధితులతో సన్నిహితంగా మెలిగినట్లుగా అనుమానిస్తున్న 1,192 మందిని గుర్తించామంది.

డ్రోన్లతో చొరబాట్లు!

- పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి ఉగ్రవాది చేరవేత
- లష్కరే తోయిబా బరితెగింపు

న్యూఢిల్లీ: డ్రోన్లతో ఉగ్రవాదులు ఆయుధాలు, మాదక ద్రవ్యాలు, డబ్బులు చేరవేయడం గురించి విన్నాం. చొరబాట్లకు కూడా డ్రోన్లను ఉపయోగించుకుంటున్నట్లు తేలడం ఆందోళన కలిగిస్తోంది. పాకిస్తాన్ చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా కొన్ని నెలల క్రితం డ్రోన్‌తో పంజాబ్‌లో ఓ ఉగ్రవాదిని జార విడిచిందని నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ డ్రోన్‌కు 70 కిలోల వరకు బరువును మోసుకెళ్లగల సామర్థ్యం ఉందని తెలియజేశాయి. పాకిస్తాన్ భూభాగంలోని షాకర్‌గఢ్‌లో లష్కరే తోయిబా శిక్షణా కేంద్రంలో ఇలాంటి డ్రోన్ల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న వీడియోను నిఘా వర్గాలు సేకరించాయి. డ్రోన్లు మనుషులను సునాయాసంగా మోసుకెళ్లి, నీటిలో భద్రంగా వదిలిపెడుతున్న దృశ్యాలు ఈ వీడియోలో కనిపిస్తున్నాయి. పంజాబ్‌లో డ్రోన్ సాయంతో అక్రమంగా చొరబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించామని అధికారులు చెప్పారు. లష్కరే తోయిబా నాయకులే డబ్బులు ఇచ్చి పంపించినట్లు అతడు అంగీకరించాడని తెలిపారు. డ్రోన్ సాయంతో పంజాబ్ వెళ్లి, అక్కడే స్థిరపడి, ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించాలంటూ లష్కరే తోయిబా నాయకత్వం నుంచి అతడికి ఆదేశాలు అందాయని వెల్లడించారు. పంజాబ్‌లో ఇప్పటికే మకాం వేసిన ముష్కరుల నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రి తీసుకోవాలంటూ అతడికి సూచనలిచ్చారని పేర్కొన్నారు. లష్కరే తోయిబాపై భారత్ గతంలోనే నిషేధం విధించిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి ఆయుధాలను, డ్రగ్స్‌ను పంపించడానికి పాకిస్తాన్ ఉగ్రవాద మూకలు డ్రోన్లను వాడుకుంటున్నట్లు ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. ప్రధానంగా జమ్మూకశ్మీర్, పంజాబ్‌కు ఈ డ్రోన్ల ద్వారా ఆయుధాలు, డ్రగ్స్ వచ్చి పడుతున్నాయి. ఈ వ్యవహారం వెనుక పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలతోపాటు ఖలిస్తాన్ అనుకూల శక్తుల హస్తం కూడా ఉండొచ్చని భారత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: వాస్తవాధీన రేఖ(ఎల్‌ఓసీ) వద్ద చొరబాటు యత్నాన్ని భారత భద్రతా దళాలు విజయవంతంగా తిప్పికొట్టాయి. ఈ క్రమంలో చోటుచేసుకున్న ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. బారాముల్లా జిల్లాలోని యూరీ సెక్టార్ హథ్లాంగ్ ఫార్వర్డ్ ఏరియాలో శనివారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. సైన్యం, కశ్మీర్ పోలీసులు, నిఘా ఏజెన్సీలు ఉమ్మడి ఆపరేషన్ చేపట్టాయని, చొరబాటు యత్నాన్ని భగ్నం చేశాయన్నారు. పొరుగు దేశం నుంచి మన భూభాగంలోకి ప్రవేశిస్తున్న ఉగ్రవాదులను అడ్డుకొనేందుకు ప్రయత్నించగా, కాల్పులు జరిపారని, దాంతో భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపాయని తెలిపారు. కాల్పుల్లో ముగ్గురు ముష్కరులు మరణించారని, ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పాకిస్తాన్ వైపు నుంచి కాల్పులు కొనసాగుతున్నాయన్నారు. హతమైన ముగ్గురు ముష్కరుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మరోవైపు, అనంత్‌నాగ్ జిల్లాలో ముగ్గురు భారత ఉన్నతాధికారులను బలి తీసుకున్న ఉగ్రవాదుల కోసం వేట కొనసాగుతోందని వెల్లడించారు. ఈ ఆపరేషన్ శనివారం నాలుగో రోజుకు చేరింది.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 178

SUNDAY Special | ఆదివారం 17-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేడు 'విమోచనం'

- హైదరాబాద్ చేరుకున్న అమిత్ షా
- పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే విమోచన దినోత్సవంలో ప్రసంగం

- వివరాలు 2లో



నేడు తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం

పబ్లిక్ గార్డెన్స్‌లో జెండా ఆవిష్కరించనున్న సీఎం కేసీఆర్

- వివరాలు 2లో



అప్పుడు తన్నులు.. ఇప్పుడు టన్నులు

గతంలో రైతులు ఎరువుల కోసం పోలీసు దెబ్బలు తింటే ప్రస్తుతం టన్నులకొద్దీ ఎరువులు పొందుతున్నారని మంత్రి హరీశ్ అన్నారు.

- వివరాలు 3లో



'ఇండియా' కూటమి దూకుడు

ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వంపై పోరులో ఇండియా కూటమి దూసుకుపోతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు.

- వివరాలు 5లో



గెలుపే ధ్యేయంగా ముందుకు!

ఈసారి తెలంగాణలో అధికారాన్ని దక్కించుకోవాలని సోనియాగాంధీ రాష్ట్ర నాయకత్వానికి సూచించారు.

- వివరాలు 5లో



'బ్యాలెట్' రూట్లో.. 6 గ్యారంటీలు!

రాష్ట్ర ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడ సభలో ఆరు గ్యారంటీ హామీలను ఇవ్వనుంది.

- వివరాలు 6లో

ఆగమైతే గోసపడతాం!

ఎన్నికలు అనగానే కొందరు గంటలు పట్టుకుని బయల్దేరుతారు

అలాంటి పిచ్చోళ్ల మాటలు వింటే పాము లెక్క మింగేస్తారు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్

- కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రం ఇంకా బాగుపడాల్సి ఉంది
- రాష్ట్ర ప్రాజెక్టులకు ఇంటి దొంగలే ప్రాణగండంలా మారారు
- బీజేపీ నేతలకు చేతనైతే కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లోని 20 లక్షల ఎకరాల్లో నీటి పారకాన్ని తన కళ్లతో చూసేదాకా ప్రజల దీవెనలు ఉండాలని వ్యాఖ్య
- నార్లాపూర్ పంపుహౌజ్‌లో మొదటి మోటారును ఆన్ చేసిన కేసీఆర్
- డెలివరీ సిస్టర్న్ వద్ద ఎత్తిపోసిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు
- తర్వాత కొల్లాపూర్ శివార్లలో సీఎం కేసీఆర్ ప్రసంగం



శనివారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించాక కృష్ణా జలాలకు హారతి ఇస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ కేకే, సీఎస్ శాంతికుమారి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్ కర్నూల్: ఎన్నికలు వస్తున్నాయనగానే కొందరు గంటలు పట్టుకుని బయలుదేరుతారని.. అలా వస్తున్న పిచ్చివాళ్ల మాటలు నమ్మి ఆగమైతే గోసపడతామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. వారి చేతిలో ఒక్కసారి మోసపోతే వైకుంఠ పాళిలో పెద్దపాములా మింగేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రాజెక్టులకు ఇంటి దొంగలే ప్రాణగండంలా

మిగతా 3వ పేజీలో ▶

'స్కూల్' ఫీజు కడితే ఎంబీబీఎస్ చదువు

రాష్ట్రంలో జిల్లాకో వైద్య కళాశాల కట్టుకుంటున్నాం. నేడు స్కూల్ స్థాయిలో ఫీజు కడితే ఎంబీబీఎస్ చదువుకునే పరిస్థితి ఉంది. తమిళనాడులో స్కూల్ విద్యార్థులకు టిఫిన్ ఇస్తుండటం బాగుందంట. రాష్ట్ర బృందాన్ని అక్కడికి పంపాం. తెలంగాణలో టెన్త్ వరకు విద్యార్థులందరికీ ఉదయం టిఫిన్, కోడిగుడ్డు అందిస్తాం. - సీఎం కేసీఆర్



శనివారం హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ భేటీ ప్రారంభానికి ముందు పార్టీ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్, కేసీ వేణుగోపాల్, మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క

కూటమిగా... దీటుగా

జమిలి విధానం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం • సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ణయం

- చైనా దురాక్రమణను అడ్డుకోవాలి
- కొత్త రాజ్యాంగ రూపకల్పన ప్రతిపాదనకు నో
- కులగణన చేపట్టాలి.. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల పరిమితిని పెంచాలి
- 14 అంశాలపై తీర్మానాలు... కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఆక్షేపణ
- ఖర్గేపై ప్రశంసలు... రాహుల్‌కు అభినందనలు
- అంతర్జాతీయ సమాజం గర్వించేలా దేశాన్ని నిర్మించేందుకు కట్టుబడి ఉన్నామని ప్రకటన
- హైదరాబాద్‌లో ప్రారంభమైన సమావేశాలు
- నేడు తుక్కుగూడలో కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభ

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని దీటుగా ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసిన ఇండియా కూటమిని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) నిర్ణయించింది. ఈ కూటమిలో కీలకపాత్ర వహించడం ద్వారా దేశ ప్రజానీకానికి బాధ్యతాయుతమైన పారదర్శక ప్రభుత్వాన్ని అందించాలని తీర్మానించింది. ఇండియా కూటమిని సిద్ధాంతపరంగా, ఎన్నికల విజయ సూచికగా నిలబెట్టడం ద్వారా విభజన, విద్వేష రాజకీయాలకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్లో సీడబ్ల్యూసీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు దేశం అనేక రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, చైనా దురాక్రమణ, కొత్త రాజ్యాంగ రూపకల్పన, జమిలి ఎన్నికలు, భారత్ జోడో యాత్ర, మణిపూర్ హింస, కశ్మీర్‌లో ఉగ్రకాల్పులు తదితర 14 అంశాలపై

మిగతా 5వ పేజీలో ▶

ప్రజా సమస్యలతోనే ముందుకెళ్లాలి

సభలు, తీర్మానాలతో సరిపెడితే ఫలితం ఉండదు: రాహుల్ గాంధీ

- వివరాలు 5లో

రథయాత్రలకు బీజేపీ రెడీ

- వివరాలు 2లో

సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే



- ప్రజాధనం దోచేసిన వాళ్లను జైల్లో కాక మరెక్కడ పెట్టాలి?
- బాబు అవినీతిపై నిప్పులు చెరిగిన ఏపీ సీఎం వైఎస్ జగన్
- రూ. 371 కోట్ల ప్రజాధనం ఎక్కడికి పోయింది?
- లేని కంపెనీ ఉన్నట్టు ఫేక్ అగ్రిమెంటుతో దోపిడీ
- అడ్డంగా దొరికినా అడ్డగోలు వాదనలు
- సాక్ష్యాధారాలతో కేంద్ర దర్యాప్తు సంస్థలకు దొరికినా బుకాయింపేనంటూ ఆగ్రహం

6 లో

చెప్పకుండా శైలజ దేశం దాటారు

- చందాదారుల ప్రయోజనాలు కాపాడేందుకే లుక్ అవుట్ నోటీసులు
- దర్యాప్తునకు ఆమె సహకరించడంలేదు
- విదేశాలకు వెళ్తున్నట్లు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు
- విచారణను తప్పించుకోవడానికే అమెరికా వెళ్లారు
- 'మార్గదర్శి' కేసులో తెలంగాణ హైకోర్టులో ఏపీ సీఐడీ కౌంటర్

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



మిమ్మల్ని నేనూ, నన్ను మీరు ఆహ్వానించుకోవాల్సిందే! ప్రపంచంలో మనల్నెవరూ ఆహ్వానించరు..!!

నేడు అతిరథుల మహాసభలు

- పబ్లిక్ గార్డెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం సమైక్యతా దినోత్సవం
- పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం విమోచన దినోత్సవం
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో తుక్కుగూడలో విజయభేరి సభ
- నగరంలో హైవోల్టేజీ రాజకీయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధాని నగరం ఆదివారం(సెప్టెంబర్ 17న) హైవోల్టేజీ రాజకీయాలకు వేదిక కాబోతోంది. ఒక్కరోజే నాలుగు సభలు.. నాలుగు ప్రధాన పార్టీలు పోటాపోటీగా, వాడీవేడిగా కార్యక్రమాలు చేపట్టాయి. మరో రెండు, మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు వస్తాయని భావిస్తున్న తరుణంలో ప్రధాన రాజకీయ పక్షాలు తమ ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, ప్రత్యర్థులపై విమర్శలకు ఈ సభలను వేదికలుగా మార్చుకోబోతున్నాయి. సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం సమైక్యతా దినోత్సవంగా నిర్వహిస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం మాత్రం విమోచన దినోత్సవంగా జరపనుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సమావేశాలు, సెప్టెంబర్ 17 కలిసి వచ్చేలా బహిరంగ సభ నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి, అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగ సభలో మాట్లాడనున్నారు. సభకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, బండి సంజయ్ హాజరుకానున్నారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించే జాతీయ సమైక్యతా దినోత్సవంలో సీఎం కేసీఆర్ జాతీయజెండాను ఆవిష్కరించి, అక్కడ జరిగే సభలో ప్రసంగించనున్నారు. కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి సభలో ఆ పార్టీ అగ్రనాయకులు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొననున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనుంది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సీపీఐ నిర్వహించే కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, మాజీ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, జాతీయ కార్యదర్శులు నారాయణ, అజీజ్ పాషా పాల్గొననున్నారు.

నేడు తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం

- పబ్లిక్ గార్డెన్స్‌లో సీఎం కేసీఆర్ జెండావిష్కరణ
- రాజ్‌భవన్‌లో విమోచన దినోత్సవం నిర్వహణకు గవర్నర్ నిర్ణయం



నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవ ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం ఉదయం 11 గంటలకు నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయపతాకాన్ని ఆవిష్కరించనున్నారు. సెప్టెంబర్ 17న రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు తెలంగాణ పరిణామం చెందిన సందర్భంగా ప్రతిఏటా ఆ రోజున తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించాలని బీఆర్‌ఎస్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవాల్లో భాగంగా జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు జెండావిష్కరణలు చేయనున్నారు. కాగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వవిధానానికి అనుగుణంగా ఆదివారం రాజ్‌భవన్‌లో విమోచన దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నిర్ణయం తీసుకున్నారు. రాజ్‌భవన్ ప్రాంగణంలో గవర్నర్ ఉదయం 9.30 గంటలకు జాతీయజెండాను ఆవిష్కరించనున్నారు.

విమోచన దినోత్సవం జరుపుకోవాలి: గవర్నర్ పిలుపు

హైదరాబాద్ విముక్తి పోరాటం దేశ స్వాతంత్ర్య సంగ్రామచరిత్రలో అత్యంత కీలక ఘట్టంగా నిలుస్తుందని గవర్నర్ తమిళిసై అన్నారు. హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ తన సందేశాన్ని విడుదల చేశారు. విమోచన ఉద్యమంలో పోరాటయోధుల త్యాగాలను స్మరించుకుని వారికి నివాళి అర్పించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని, మనం సంఘటితంగా పోరాడి సాధించిన విజయాలకు ఇది గుర్తుగా నిలుస్తుందని గవర్నర్ పేర్కొన్నారు.

నిజాంను ఎదిరించిన యోధుల
కుటుంబ సభ్యులకు సన్మానం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలన



పరేడ్ గ్రౌండ్స్‌లో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

రసూల్‌పురా (హైదరాబాద్): నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుల కుటుంబ సభ్యులను తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమంలో సన్మానిస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న విమోచన దినోత్సవ కార్యక్రమానికి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం సభ ఏర్పాట్లను కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా చేయడం లేదని, దీంతో ఈ యేడు కూడ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఉత్సవానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఆయన తెలిపారు. కాగా, కేంద్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమంపై పోలీసులు, ఒక పార్టీ మీటింగ్ తరహాలో సర్క్యులర్ జారీ చేశారని, దీనిపై వెంటనే క్షమాపణ చెప్పాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిజాం పాలనలో పోరాటాలు, ప్రజల కష్టాలపై కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పర్చువల్‌గా ఎగ్జిబిషన్, నిజాం పాలన నుంచి విముక్తి కోసం పోరాడిన ప్రముఖ పాత్రికేయుడు షోయబుల్లాఖాన్, గిరిజన యోధుడు రాంజీ గోండు పేర్ల మీద పోస్టల్ కవర్ విడుదల చేస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ జైల్లో పెట్టింది..

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ విమోచన ఉత్సవాలను జరపాలని బీజేపీ డిమాండ్ చేస్తే తమ నాయకులను, కార్యకర్తలను కొట్టి జైల్లో వేశారని కిషన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ఎప్పుడూ విమోచన వేడుకలు నిర్వహించలేదని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రజాకార్ల వారసుల పార్టీతో కలసి చరిత్రను తెలియనివ్వలేదని విమర్శించారు.

బీజేపీలోకి ప్రత్తిపాటి లక్ష్మీనారాయణ: సాక్షి, హైదరాబాద్: సీనియర్ కాంగ్రెస్‌నేత ప్రత్తిపాటి లక్ష్మీనారాయణ బీజేపీలో చేరారు. శనివారం బీజేపీ కార్యాలయంలో పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్ సమక్షంలో ఆయన కాషాయతీర్థం పుచ్చుకున్నారు. లక్ష్మీనారా యణకు కండువా కప్పి లక్ష్మణ్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో ఆ యన కాంగ్రెస్ పార్టీలో జాతీయ, రాష్ట్రస్థాయిల్లో వివిధ హోదాల్లో పని చేశారు.

అమిత్‌షాతో పీవీ సింధు భేటీ

- శనివారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకున్న కేంద్ర హోంమంత్రి
- నేడు పరేడ్ గ్రౌండ్స్‌లో హైదరాబాద్ విమోచన దినోత్సవాలు
- ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్న అమిత్‌షా
- ఢిల్లీకి తిరిగి వెళ్లే ముందు రాష్ట్ర నేతలతో ప్రత్యేకంగా భేటీ



శనివారం హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న క్రీడాకారిణి పీవీ సింధు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శనివారం రాత్రి 9 గంటలకు హైదరాబాద్‌కు చేరుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, సీనియర్ నేతలు డీకే అరుణ, బండి సంజయ్, కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావు, విజయశాంతి తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అమిత్‌షా సీఆర్పీఎఫ్ సెక్టార్ ఆ ఫీసర్స్ మెస్‌కు చేరుకుని బస చేశారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హై దరాబాద్ విమోచన దినోత్సవాల్లో అమిత్‌షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు.

పీవీ సింధుకు అభినందన

కేంద్ర మంత్రి అమిత్‌షాను ఒలింపిక్ పతక విజేత, బాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శనివారం రాత్రి తన తండ్రి, వాలీబాల్ మాజీ క్రీడాకారుడు పీవీ రమణ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలతో కలసి ఆమె సీఆర్పీ ఎఫ్ సెక్టార్ ఆఫీసర్స్ మెస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావడంతోపాటు యువతకు స్ఫూర్తిగా నిలిచావంటూ సింధును అమిత్‌షా అభినందించారు. దేశంలో క్రీడల అభివృద్ధి, అందించాల్సిన ప్రోత్సాహం, ఫిట్‌నెస్‌గా ఉండటంపై వారు మాట్లాడుకున్నట్టు తెలిసింది.

ప్రముఖులపై బీజేపీ ఫోకస్‌లో..

ఇటీవల సినీ, సంగీత, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రభావం చూపే ప్రముఖులను బీజేపీ జాతీయ నేతలు కలసి అభినందించడం తెలిసిందే. గతంలో రాష్ట్ర పర్యటనలకు వచ్చిన సందర్భంగా సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్‌ను, బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌లను అమిత్‌షా కలుసుకున్నారు. తాజాగా పీవీ సింధును కలిశారు. అలాగే సినీనటుడు నితిన్, మహిళా క్రికెటర్ మిథాలీరాజ్, అర్థిక, రాజకీయరంగాల విశ్లేషకుడు కె.నాగేశ్వర్‌లను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కలిశారు.

రాష్ట్ర నేతలతో కీలక భేటీ..

పరేడ్ గ్రౌండ్స్ కార్యక్రమం అనంతరం సీఆర్పీఎఫ్ సెక్టార్ ఆఫీసర్స్ మెస్‌లో రాష్ట్ర బీజేపీ ముఖ్య నేతలతో అమిత్‌షా సమావేశం కానున్నారు. ఈ భేటీ కోసం జాతీయ కార్యవర్గ సభ్యులు, కీలక నేతలకు మాత్రమే పిలుపు అందినట్టు పార్టీవర్గాలు చెప్తున్నాయి. అయితే ఆదివారం విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ బీసీలకోసం ఓ ప్రత్యేక పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తుండటంతో.. దీనికి సంబంధించి హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో కార్యక్రమం జరగనుంది. జి.కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్ అందులో పాల్గొంటుండటంతో.. అమిత్‌షాతో భేటీకి హాజరయ్యే అవకాశాలు లేవని సమాచారం. ఆఫీసర్స్ మెస్‌లో భేటీ తర్వాత అమిత్‌షా ఢిల్లీకి తిరుగుప్రయాణం కానున్నారు.

రథయాత్రలకు బీజేపీ రెడీ

- ఈ నెల 26న బాసర, కొల్లాపూర్, భద్రాచలంలో ప్రారంభం
- అక్టోబర్ 14న హైదరాబాద్‌లో ముగింపు.. అదేరోజు జరిగే బహిరంగ సభకు ప్రధాని మోదీ రాక

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల రథయాత్రలకు రాష్ట్ర బీజేపీ సమాయత్తమైంది. డిసెంబర్‌లో శాసనసభ ఎన్నికలు జరిగే అవకాశాలుండడంతో, షెడ్యూల్ వెలువడేలోగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌ల పరిధిలో బస్సుయాత్ర చేయాలని బీజేపీ సంకల్పించింది. ఈనెల 26న బాసర, సోమశిల ఆలయం (కొల్లాపూర్), భద్రాచలం రాములోరిగుడి నుంచి మూడు రథయాత్రలు ప్రారంభం కానున్నాయి. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే.అరుణ, ఇతర ముఖ్యనేతలు ఈ యాత్రల్లో పాల్గొంటారు. మొత్తం 119 నియోజకవర్గాల మీదుగా 19 రోజుల పాటు 4,040 కిలోమీటర్ల మేర ఈ యాత్రలు సాగనున్నాయి. ఈ మూడు యాత్రలు అక్టోబర్ 14న హైదరాబాద్‌కు చేరుకుంటాయి. యాత్రల ముగింపు సందర్భంగా నగరంలో జరిగే భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశముంది.

రథయాత్రలు ఇలా...

రూట్–1 కొమురంభీం: ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలతోపాటు హైదరాబాద్ –1 (మొత్తంగా 41 అసెంబ్లీ నియోజకవర్గాలు కవర్ అవుతాయి. ఇందులో హైదరాబాద్ పరిధిలోని 12 నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం కిలోమీటర్లు :1,100)

రూట్–2 కృష్ణా: ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతోపాటు హైదరాబాద్–2(మొత్తంగా 39 అసెంబ్లీ నియోజకవర్గాలు కవర్ అవుతాయి. ఇందులో హైదరాబాద్ పరిధిలోని 6 నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం కిలోమీటర్లు : 1,290)

రూట్–3 గోదావరి: ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలతోపాటు హైదరాబాద్–3 (మొత్తంగా 39 అసెంబ్లీ నియోజకవర్గాలు కవర్ అవుతాయి. ఇందులో హైదరాబాద్ పరిధిలోని 4 నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం కిలోమీటర్లు : 1,650)

నేడు పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవం

తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వేడుకలు జరగనున్నాయి. అమిత్‌షా, కిషన్‌రెడ్డి, ఇతర నేతలు ఉదయం తొమ్మిది గంటల సమయంలో అక్కడికి చేరుకుంటారు. తొలుత అమర సైనికుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. పారామిలిటరీ దళాల కవాతు స్వీకరించి ప్రసంగిస్తారు. కార్యక్రమం ప్రాంగణంలో 21 వేల మంది సందర్శకులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు.

బీజేపీ కమిటీల ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీకి సంబంధించిన వివిధ కమిటీలను కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియమించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమించారు. సమాచారహక్కు చట్టం సెల్ కన్వీనర్‌గా జి.శ్రీనివాస్‌ను, జాయింట్ కన్వీనర్లుగా పవన్ మైత్రేయ, రామ్మోహన్‌రెడ్డి, సభ్యులుగా నవీన్ (అంబర్ పేట), ఝాన్సీ, కంచన కృష్ణ (శేరిలింగంపల్లి)లు నియమి తులయ్యారు. విశ్వకర్మ జయంతి నిర్వహణ కమిటీ చైర్మ న్‌గా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి, సభ్యులుగా మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్, రాములు (పరిగి), రాజయ్య, రాజేశ్వరి (సికింద్రాబాద్), మరో పది మందిని సభ్యులుగా నియమించారు.

ఇండియా కూటమికి నాయకత్వం రాహులే వహించాలి

- ఎంపీ ధర్మపురి అర్వింద్



సాక్షి, హైదరాబాద్: ఇండియా కూటమికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీనే నాయకత్వం వహించాలని కోరుకుంటున్నానని బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..హైదరాబాద్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. అది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదని..ఇప్పుడున్నది ఇటాలియన్ కాంగ్రెస్ అని విమర్శించారు.

సీఎంతో చర్చెందుకు.. దర్యాప్తు సంస్థలు పిలుస్తున్నాయి వెళ్లు..

- లోకేశ్‌పై ఏపీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపాటు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): తప్పు చేసి జైలులో చిప్పకూడు తింటున్న చంద్రబాబు చేసిన అవినీతి మీద చర్చకు రమ్మని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని లోకేశ్ పిలవడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆయన శనివారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఈడీ, ఐటీ, సీఐడీ అధికారులు విచారణకు రమ్మని లోకేశ్‌ను పిలుస్తున్నారని, ముందు అక్కడికి వెళ్లమని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌ని చర్చకు పిలిచిన లోకేశ్ ఆయన స్థాయి, బతుకేమిటో ముందుగా తెలుసుకోవాలని ధ్వజమెత్తారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో లోకేశ్ పాత్రను బయట పెట్టడానికే దర్యాప్తు సంస్థలు ఆయన్ని పిలుస్తున్నాయన్నారు. లోకేశ్ స్థాయికి చర్చకు తాను వస్తానని, సిద్ధంగా ఉండాలని సవాల్ చేశారు. ఐటీ కేసులో నోటీసులు ఇచ్చినప్పుడు తప్పించుకుని లా పాయింట్లు మాట్లాడుతున్నారని అన్నారు. అతని తండ్రి తప్పు చెయ్యలేదని ఎందుకు చెప్పలేకపోతున్నాడని ప్రశ్నించారు.


ఆ హక్కు కాంగ్రెస్‌కు లేదు

- విలీనం, విమోచన ఉత్సవాల నిర్వహణపై బీజేపీ మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విలీనం, విమోచనం...ఏదైతేనేమీ ఈ ఉత్సవాలను నిర్వహించే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని బీజేపీనేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను ప్రముఖనేతలు కొండా వెంకట రంగారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు కలిసి హైదరాబాద్ నిజాం అరాచకాలను వివరించి సైనిక బలగాలను పంపాలని కోరితే కుదరదని తిరస్కరించారని గుర్తుచేశారు. ఆ తర్వాత వారు హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను కలవడంతో సైనిక బలగాలను పంపించారని పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విశ్వేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సర్దార్ పటేల్ దగ్గరకు వెళ్లారనే కారణంతో..కొండా వెంకట రంగారెడ్డి, బూర్గులను కాంగ్రెస్ బహిష్కరించిందన్నారు. ప్రతి విషయంలో సెప్టెంబర్ 17 ఆపరేషన్ పోలోను నెహ్రూ వ్యతిరేకించారని తెలిపారు. సైనిక బలగాలను పంపించి హైదరాబాద్ స్టేట్‌కు పటేల్ విమోచనం కల్పించినందున ఈ ఉత్సవాలను జరుపుకునే హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు.

మహిళా రిజర్వేషన్ల పేరిట కేసీఆర్ డ్రామా: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ల పేరిట సీఎం కేసీఆర్ కొత్తడ్రామాకు తెరతీశారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. 119 అసెంబ్లీ సీట్లలో బీసీలు, మహిళలకు ఎన్ని ఇచ్చారో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు ఉంటే.. 22 శాతం తగ్గించి కేసీఆర్ సర్కార్ బీసీలను మోసం చేసిందన్నారు. అదే మోదీ ప్రభుత్వం కేంద్రంలో 11 మంది మహిళా మంత్రులు, 8 మంది మహిళా గవర్నర్లను నియమించడమే కాకుండా ఎంబీసీలకు కేబినెట్‌లో పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. ఆదివారం విశ్వకర్మ జయంతి సందర్భంగా బీసీల కోసం ప్రధాని మోదీ ప్రత్యేక పథకం ప్రారంభిస్తున్న నేపథ్యంలో.. మోదీకి ధన్యవాదాలు పేరుతో సుందరయ్య పార్కు నుంచి రాష్ట్ర బీజేపీ ఆఫీసు దాకా శనివారం డా. కె.లక్ష్మణ్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీజేపీ ఆఫీసు ఎదుట మోదీ చిత్రపటానికి బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, నల్లు ఇంద్రసేనారెడ్డి, టి.ఆచారి, ఇతర నేతలు క్షీరాభిషేకం చేశారు. ఆదివారం మోదీ జన్మదినం కూడా కావడంతో ఆయన దీర్ఘాయుష్షును కాంక్షిస్తూ పార్టీ కార్యాలయంలో 18 బీసీ వర్గాలు నిర్వహించిన విశ్వకర్మ యజ్ఞంలో లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఓట్లపైనే బీఆర్‌ఎస్‌కు ప్రేమ

- సమైక్యతా దినోత్సవం ఎందుకో చెప్పాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

ఖమ్మం మయూరిసెంటర్: బీఆర్‌ఎస్‌కు ఓట్లపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ త్యాగాలు, తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా ప్రజలకు విముక్తి కల్పించిన ఘనత కమ్యూనిస్టులదేనని తెలిపారు. కానీ ఇప్పుడు బీజేపీ, బీఆర్‌ఎస్ ఇతర పార్టీలు తెలంగాణ సాయుధ పోరాట త్యాగాలను మరిచి, ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ఎవరికి భయపడి జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఎంఐఎంకు కోపం వస్తుందనే సమైక్యతారాగం ఎత్తుకున్నారని పేర్కొన్నారు. కాగా, హైదరాబాద్‌లో ఆదివారం సీపీఐ ఆధ్వర్యాన జరిగే తెలంగాణ విలీన దినోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మోదీ ప్రధాని అయినా.. బీసీలకు అన్యాయమే

బీసీ రిజర్వేషన్లు, ప్రత్యేక మంత్రిత్వ శాఖ కోసం ప్రశ్నిస్తాం: ఎంపీ బడుగుల



సాక్షి, హైదరాబాద్: బీసీ సామాజికవర్గానికి చెందిన నరేంద్ర మోదీ దేశానికి ప్రధాని అయినా ఆ సామాజిక వర్గానికి అన్యాయమే జరిగిందని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు చట్టసభల్లో బీసీలకు 33% రిజర్వేషన్ల అంశంతో పాటు బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు కోసం ప్రశ్నిస్తామన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బడుగుల లింగయ్య యాదవ్ మీడియాతో మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ల కోసం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాటం చేస్తున్నారని, ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో తాము కూడా ఒత్తిడి చేస్తామని తెలిపారు. తెలంగాణలో శాంతిభద్రతలు బాగున్నాయని అందుకే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల కోసం ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలను కాదని హైదరాబాద్‌ను ఎంచుకున్నారని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు.

కార్యకర్తల కష్టం తెలిసిన నేత కేసీఆర్: పద్మాదేవేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ కార్యకర్తల కష్టం తెలిసిన నేత అని, కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచేందుకు దేశంలో ఎక్కడాలేని రీతిలో బీఆర్ఎస్ పార్టీపరంగా జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బీమా సంస్థలకు పార్టీ తరఫున ప్రీమియం చెల్లిస్తూ దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున బీమా అందజేస్తున్నట్లు వెల్లడించారు. వివిధ ప్రమాదాల్లో మరణించిన 44 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కులను శనివారం తెలంగాణ భవన్‌లో అందజేశారు. దేశంలో ఏ పార్టీకి లేని రీతిలో 60 లక్షల మంది కార్యకర్తల బలగం బీఆర్ఎస్‌కు ఉందని, వారి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని 2023–24 సంవత్సరానికిగాను రూ.25.54 కోట్లు పార్టీ తరఫున బీమా ప్రీమియం చెల్లించినట్లు బీఆర్ఎస్ హైదరాబాద్ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ అన్నారు.

కమీషన్లు తప్ప.. రైతులపై ప్రేమ ఎక్కడ?

జస్టిస్ చంద్రకుమార్



పంజగుట్ట (హైదరాబాద్): ఏ ప్రాజెక్టులో ఎంత కమీషన్లు వస్తాయి అనే ఆలోచన తప్ప నిజంగా రైతులకు సాగునీరు అందించాలన్న తపన ఈ ప్రభుత్వానికి ఏమాత్రం లేదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వకుండా ప్రాజెక్టు ప్రారంభించడం దేశంలో కేవలం కేసీఆర్‌తోనే సాధ్యమని వారు విమర్శించారు. జాగో తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాగో తెలంగాణ చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్, కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, తెలంగాణ జన సాధన సమితి అధ్యక్షుడు నైనాల గోవర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర బడ్జెట్ మొత్తం ప్రాజెక్టులకు, నిర్మాణాలకు వినియోగిస్తున్నారని ఎందులో ఎక్కువగా కమీషన్ వస్తుందో వాటికే నిధులిస్తూ ప్రజల అవసరాలను విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ.. పాలమూరు ప్రాజెక్టు పనులు భారీ ఎత్తున పెండింగ్‌లో ఉండగానే ఒక్కపంపు మాత్రమే ప్రారంభించి ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతం వారిని మోసం చేసేందుకు చూస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసొమ్ము వేల కోట్లు నాశనం చేస్తున్న కేసీఆర్‌ను విదేశాల్లో ఉంటే ఎప్పుడో జైలులో వేసేవారన్నారు.

ఈసారి బీఆర్ఎస్‌కు డిపాజిట్లు గల్లంతే

పూర్తిగాని ప్రాజెక్టుతో ఎన్నికల రాజకీయం: వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణలో ఈసారి బీఆర్ఎస్‌కు డిపాజిట్లు గల్లంతేనని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో ఒక్క పంపు మాత్రమే ప్రారంభించి దక్షిణ తెలంగాణ మొత్తం సస్యశ్యామలం చేస్తున్నట్లు డప్పు కొట్టుకోవడానికి కేసీఆర్‌కు సిగ్గుండాలన్నారు. దొర గారిది మాటల సర్కారే గానీ చేతల సర్కార్ కాదనేది మరోసారి రుజువు చేసుకున్నారని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.35 వేల కోట్లతో పూర్తి చేయాలనుకున్న ప్రాజెక్టును కేసీఆర్ కమీషన్ల కోసం రూ.52 వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. వైఎస్ఆర్ కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల ద్వారా పాలమూరులో దాదాపు 10 లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తే.. కేసీఆర్ మాత్రం పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పడావు పెట్టారన్నారు. ఈ ప్రాజెక్టు పనులు 50 శాతం కూడా పూర్తికాలేదన్నారు.



కొల్లాపూర్ శివార్లలో జరిగిన బహిరంగ సభకు హాజరైన జనం

ఆగమైతే గోసపడతాం!

▶ మొదటి పేజీ తరువాయి

మారారని మండిపడ్డారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో కృష్ణా తీరంలోని నార్లాపూర్ వద్ద పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును కేసీఆర్ ప్రారంభించారు. అనంతరం కొల్లాపూర్ శివార్లలో నిర్వహించిన భారీ బహిరంగసభలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాల చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. ఒకనాడు పాలమూరు బిడ్డ అంటే వలస కూలీలుగా పేరుపడితే.. నేడు బెంగాల్, యూపీ రాష్ట్రాలతోపాటు పక్కనున్న రాయచూర్, కర్నూల్ జిల్లాల నుంచి కూలీలను రప్పించుకొని పొలాల్లో పని చేయించుకుంటున్న రైతు బిడ్డగా మారాడు. పాలమూరు–రంగారెడ్డిలో ఒక్క పంపును నడిపితేనే వాగు పారేంత నీళ్లు తరలుతున్నాయి. త్వరలో మొత్తం పంపులు, కాలువలన్నీ పూర్తి చేస్తాం. ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని ప్రాంతాలకూ నీళ్లు అందుతాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలోని 20 లక్షల ఎకరాల్లో నీటి పారకాన్ని నా కళ్లతో చూసేదాకా ప్రజల దీవెనలు ఉండాలి.

ఇప్పుడు ఇంటి దొంగలతోనే గండం

ఉద్యమ సమయంలో జోగుళాంబ ఆలయం నుంచే మొదటి పాదయాత్రను ప్రారంభించా. పాలమూరును దత్తత తీసుకున్నామని అప్పట్లో సీఎం చంద్రబాబు, ఆయన తాబేదార్లు మాట్లాడారు. ఆర్డీఎస్‌ను మూసేయకపోతే బద్దలు కొడతామన్నారు. అదే నేను సుంకేశుల ప్రాజెక్టును వంద బాంబులు పెట్టి పేల్చుతానని చెప్పిన. మాకు కూడా బాంబులేసే మొనగాడు పుట్టిండని పాలమూరు ప్రజలు అప్పుడు సంతోషపడ్డారు. కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రాజెక్టులకు ఇంటి దొంగలే, ఈ జిల్లాలో పుట్టిన సన్నాసులే ప్రాణగండంలా మారారు. ప్రాజెక్టు పనులకు అడ్డం పడ్డారు. లేకుంటే పాలమూరు ఎత్తిపోతల పథకం మూడు నాలుగేళ్ల కిందే పూర్తయ్యేది.

ఆగమైతే గోస పడతాం..

ఎన్నికలు వస్తున్నాయనగానే కొందరు గంటలు పట్టుకుని బయలుదేరుతారు. నాడు రాష్ట్రం నుంచి బొంబాయి, దుబాయి వలసపోతే ఒక్కడూ సాయం చేయలే. కష్టపడి రాష్ట్రాన్ని తెచ్చుకుని బాగుచేసుకుంటున్నాం. ఇలాంటి సమయంలో వస్తున్న పిచ్చివాళ్ల మాటలు నమ్మి ఆగమైతే.. గోస పడతాం. ఒక్కసారి మోసపోతే వైకుంఠపాళిలో పెద్దపాము లెక్క మింగేస్తారు. నేను హైదరాబాద్ నుంచి బస్సులో వస్తుంటే బీజేపీ వాళ్లు జెండాలు పట్టుకుని అడ్డం పడుతున్నారు. ఏం పాపం చేశాం, ఎవరిని మోసం చేశామని అడ్డు పడుతున్నారు. కృష్ణా ట్రిబ్యునల్‌లో నీటి వాటా కేటాయింపునకు పదేళ్లు పడుతుందా? సిగ్గు, చీము, నెత్తురు, పౌరుషం ఉంటే జాతీయ స్థాయి నాయకులు, కేంద్ర మంత్రులం అని చెప్పుకునేవారు ఢిల్లీలో కూర్చుని లేఖలు రాయాలి. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలి. కేంద్ర ప్రభుత్వానికి, ఆంధ్రాకు చెప్పేది ఒక్కటే. మాకు ఎవరి నీళ్లూ అవసరం లేదు. మా వాటా మాకు చెబితే బాజాప్తాగా నీళ్లు తీసుకుంటాం. మేం మంది సొమ్ము అడుగుతలేం.

ట్రిబ్యునలే పట్టించుకుని ప్రాజెక్టు ఇచ్చింది

మహబూబ్‌నగర్ చరిత్ర చెబితే ఆశ్చర్యం కలుగుతుంది. 1975లో బచావత్ ట్రిబ్యునల్ తీర్పిచ్చినప్పుడు ఏ ఒక్క తెలంగాణ నాయకుడు కూడా మా మహబూబ్‌నగర్‌కు నీళ్లేవని అడగలే. చివరికి ట్రిబ్యునల్ జడ్జి బచావత్ అనే ఆయనే.. ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో కలవకుండా ఉండుంటే చాలా బాగుపడి ఉండేదన్నారు. కనీసం ఈ ప్రాంతానికి నీళ్లడగటం లేదని, తమకు చూడబుద్ధి కావడం లేదని చెప్పి.. తామే 17 టీఎంసీలతో జూరాల ప్రాజెక్టును మంజూరు చేస్తున్నామని చెప్పారు. అంతేకాదు జూరాల ప్రాజెక్టును ఏదో కారణం చెప్పి మరోచోటికి తరలించకుండా తాము సూచించిన చోటే కట్టాలన్నారు. ట్రిబ్యునల్ రికార్డుల్లో ఈ రోజుకూ ఈ విషయాలు ఉన్నాయి. అంత జరిగినా 1981 దాకా జూరాల ప్రాజెక్టును మొదలుపెట్టలే.. శంకుస్థాపన చేసినా పనులు చేయలే. 2001లో గులాబీ జెండా ఎగిరిన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మీటింగ్ పెట్టి నిలదీశాకే పూర్తిచేసి, నీళ్లు నిల్వ చేశారు.



ప్రాజెక్టు శిలాఫలకం వద్ద సీఎం కేసీఆర్. చిత్రంలో మల్లారెడ్డి, నిరంజన్‌రెడ్డి, సబిత, శ్రీనివాస్‌గౌడ్, కేకే, మహేందర్‌రెడ్డి, రాములు, హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్ తదితరులు

మూడూ పూర్తయితే.. తెలంగాణ వజ్రపు తునకే!

తెలంగాణలో అంచనాలు వేసుకొని, హక్కులు చూసుకొని, రావాల్సిన వాటాలు చూసుకొని మూడు పెద్ద ప్రాజెక్టులు మొదలు పెట్టుకున్నాం. గోదావరి మీద కాళేశ్వరం, సీతారామ ఎత్తిపోతల, పాలమూరు ఎత్తిపోతల. ఈ మూడు ప్రాజెక్టులు పూర్తయితే తెలంగాణ ఒక వజ్రపు తునకలా తయారై దేశానికే అన్నం పెట్టే స్థాయికి పోతుంది. మన రైతులు తలఎత్తుకొని బతుకుతారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా కాళేశ్వరాన్ని వేగంగా పూర్తి చేసుకున్నాం. సీతారామ పనులు కూడా చకచకా జరుగుతున్నాయి..'' అని సీఎం కేసీఆర్ తెలిపారు.

కేసీఆర్ పుణ్యంతో పాలమూరు పచ్చబడింది: నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

సీఎం కేసీఆర్ పుణ్యమా అని పాలమూరు గడ్డ పచ్చబడిందని, వలస వెళ్లినవారంతా తిరిగి వస్తున్నారని మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ కోసం 45వేల మంది 12 ఏళ్లపాటు పనిచేశారని.. సుమారు పదివేల మంది పాలమూరు బిడ్డలు ప్రమాదాల్లో మరణించినా ఈ గడ్డకు మాత్రం ఫలితం దక్కలేదని మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పారు. పాలమూరు ప్రాజెక్టు అద్భుతమని అభివర్ణించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒకప్పుడు వందల ఎకరాలు ఉన్నవాళ్లు కూడా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని, ఇప్పుడు గ్రామాలకు తిరిగి వస్తున్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాగా.. వలసల ప్రాంతంగా గుర్తింపు పొందిన పాలమూరు జిల్లాలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని సీఎస్ శాంతికుమారి అన్నారు. ప్రాజెక్టులోని ఏదుల సర్జిపూల్ ఆసియా ఖండంలోనే పెద్దదని, ఇంజనీరింగ్ అద్భుతమని పేర్కొన్నారు.

పండుగలా 'పాలమూరు' ప్రారంభోత్సవం

పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. శనివారం మధ్యాహ్నం సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కలసి ప్రగతిభవన్ నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో నార్లాపూర్ పంపుహౌస్‌కు చేరుకున్నారు. తొలుత పంపుహౌస్ వద్ద ఏర్పాటుచేసిన పాలమూరు ప్రాజెక్టు పైలాన్‌ను సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు. తర్వాత కేసీఆర్ 145 మెగావాట్ల సామర్థ్యమున్న మొదటి మోటారును ఆన్ చేసి, నీటి ఎత్తిపోతలను ప్రారంభించారు. సర్జ్‌పూల్, పంపుహౌస్‌లను పరిశీలించారు. నార్లాపూర్ పంపుహౌజ్ వద్ద డెలివరీ సిస్టర్న్ నుంచి అంజనగిరి రిజర్వాయర్‌కు తరలుతున్న నీటి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణా జలాలకు పూలు, సారె సమర్పించి, జలహారతి పట్టారు. అనంతరం కొల్లాపూర్ శివార్లలో నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎంపీలు రాములు, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, ఆల వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మారెడ్డి, అబ్రహం, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బాల్క సుమన్, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, గోరటి వెంకన్న, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఎన్నికల కోసమే ప్రాజెక్టుల హడావుడి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

తాండూరు: ఎన్నికలు సమీపిస్తుండటంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరిట హడావుడి చేస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. తాండూరులో శనివారం ఆయన కార్యకర్తల సమావేశం, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీరు అందించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తును 140 మీటర్లకు పెంచారని ఆరోపించారు. 2015లో శంకుస్థాపన చేసిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ఇప్పటి వరకూ పూర్తి చేయలేదని, ప్రజలను మభ్యపెట్టేందుకే ప్రాజెక్టు ప్రారంభం హంగామా చేస్తున్నారని ఆరోపించారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే.. ఎస్సీ, ఎస్టీ రైతుల నుంచి ప్రభుత్వం లాక్కున్న 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను వారికి తిరిగి అప్పగిస్తామన్నారు. టెన్త్, ఇంటర్‌తో పాటు పోటీ పరీక్షల నిర్వహణలో దారుణంగా విఫలమైన విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్, మద్యం, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రవీణ్ వెల్లడించారు.

అటు ఆదాయం.. ఇటు ఆరోగ్యం..



- లాభదాయకంగా మిల్లెట్ల సాగు
- అంతర్జాతీయంగా చూస్తే.. మిల్లెట్ల ఉత్పత్తిలో భారత్ వాటా 41 శాతం
- సాక్షితో నాబార్డు చైర్మన్ షాజీ కేవీ

సాక్షి, హైదరాబాద్: మిల్లెట్లలో ఔషధ గుణాలు ఎక్కువ. పోషకాహారపరంగా ఇవి ఎంతో కీలకమైనవి. సాగుపరంగా రైతులకు ఖర్చు తక్కువగా ఉండి.. మంచి ఆదాయాన్ని ఇస్తాయి. అందుకే మిల్లెట్లు కీలకమైనవిగా భావిస్తుంటామని నాబార్డ్ చైర్మన్ షాజీ కేవీ అన్నారు. మిల్లెట్స్ కాంక్లేవ్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే....అగ్రి ఎకానమీలో మిల్లెట్ల పాత్ర ఎంతో కీలకం. ప్రపంచంలో మిల్లెట్ల ఉత్పత్తిలో భారత్ వాటా 41 శాతం. ఆసియాలో 81 శాతం మిల్లెట్ విస్తీర్ణం ఇండియాలోనే. మిల్లెట్లు వర్షాభావంలోనూ పండుతాయి. ఇతర పంటలు ఐదు నెలల్లో చేతికి వస్తే, మిల్లెట్లు మూడు నెలల్లోనే చేతికి వస్తాయి. దేశంలో అన్ని రకాల వాతావరణానికి ఇవి అనుకూలం.

ప్రజల్లో మిల్లెట్లపై అవగాహన పెంచాలి

గతంలో మనం మిల్లెట్లను ఆహారంగా తీసుకునేవారం. కానీ దేశంలో జనాభా పెరగడంతో ఆహారభద్రత సమస్యగా మారింది. దీంతో మన ఆహారపు అలవాట్లు మారి, ప్రజలకు అవసరమైన పంటలను ముందుకు తీసుకొచ్చాం. దీని ఫలితమే హరిత విప్లవం. ప్రజలు గోధుమ, బియ్యమే ఆహారంగా తీసుకోవడం ప్రారంభమైంది. ఇప్పుడు మళ్లీ మిల్లెట్లను ముందుకు తీసుకురావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మిల్లెట్ సాగులో రైతులకు అవసరమైన ప్రోత్సాహం అందాలి.వీటికి మరింత ప్రచారం కల్పించాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో మిల్లెట్లపై ఇప్పటికే పూర్తి అవగాహన ఏర్పడింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇంకా ప్రచారం కల్పించాలి.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

దేశంలో గోధుమలు, బియ్యానికి ప్రాధాన్యం ఉంది. వాటికి ప్రజలు అలవాటు పడ్డారు. దీన్ని రాత్రికి రాత్రే మార్చలేం. బియ్యం, గోధుమలు పండించాలంటే నీరు కావాలి. మిల్లెట్లు పండించాలంటే తక్కువ నీరు సరిపోతుంది. మిల్లెట్లను సుస్థిరమైన వ్యవసాయంగా భావించొచ్చు. ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఉత్పత్తి, ఉత్పాదకత, విక్రయాలు పెరిగితే మిల్లెట్ల ధరలు తగ్గుముఖం పడతాయి. దీనివల్ల వినియోగదారులకు సరసమైన ధరలకు అందించగలం. రూ. లక్ష కోట్ల అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ఉంది. దానిద్వారా రుణాలు ఇవ్వాలి. కానీ అందులో రూ. 26 వేల కోట్లు మాత్రమే వినియోగిస్తున్నారు. మిల్లెట్లకు కనీస మద్దతు ధర కల్పించాల్సిన విషయం పూర్తిగా విధానపరమైన నిర్ణయం. దీనిని కేంద్రమే చెప్పాలి. ప్రస్తుతం 26 రకాల పంటలకు మద్దతు ధర కల్పించారు. అందులో కొన్ని రకాల మిల్లెట్లు కూడా ఉన్నాయి.

పాలమూరులో పాల నురగల జలహేల: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: 'పల్లేర్లు మొలిచిన పాలమూరులో పాల నురగల జలహేల కనిపిస్తోంది. వలసల వలపోతల గడ్డపై ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం ఆవిష్కృతమైంది'అని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. శనివారం పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభం సందర్భంగా 'కరువు కరాళనృత్యం చేసిన భూముల్లో కృష్ణమ్మ జలతాండవం, శెలిమలే దిక్కైన కాడ ఉద్దండ జలాశయాలు, బాయి మీద పంపుసెట్లు నడవని చోట బాహుబలి మోటార్లు' అంటూ కవితాత్మకంగా ట్వీట్ చేశారు. 'స్వరాష్ట్ర ప్రస్థానంలో సగర్వ సాగునీటి సన్నివేశం, ఆరు జిల్లాలు సస్యశ్యామలం దక్షిణ తెలంగాణకు దర్జాగా జలాభిషేకం, నిన్న పరాయి నేలపైన ప్రాజెక్టులకు రాళ్లెత్తిన పాలమూరు లేబర్.. నేడు సొంత భూమిలో ప్రాజెక్టుల కింద రతనాలు పండిస్తున్న ఫార్మర్' అని వ్యాఖ్యానించారు. 'నాడు నది పక్కన నేల ఎడారిలా ఎండిన విషాదం, సమైక్య పాలకుల పాపం, కాంగ్రెసోళ్ల శాపం. ఆటంకాలు అవరోధాలు అధిగమించి ప్రతిపక్షాల కుట్రలు, కేసులు ఛేదించి సవాల్ చేసి సాధించిన విజయం. నీటి వాటా తేల్చకుండా నిర్లక్ష్యం, అనుమతుల్లో అంతులేని జాప్యం.. అయినా కేంద్ర సర్కారు కక్ష, వివక్షను దీక్షతో గెలిచిన దృఢ సంకల్పం. తీరిన దశాబ్దాల నీటి వెత తెచ్చుకున్న తెలంగాణకు ఇదే సార్థకత' అని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

అప్పుడు తన్నులు.. ఇప్పుడు టన్నులు



- కాంగ్రెస్ హయాంలో ఎరువుల కోసం రైతులు పోలీసులతో తన్నులు తిన్నారు
- ఇప్పుడు మా ప్రభుత్వంలో ఎరువులకు ఎలాంటి ఇబ్బందీ లేదు
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు ఎరువుల కోసం పోలీసులతో తన్నులు తినాల్సి వచ్చేదని, కానీ సీఎం కేసీఆర్ పాలనలో టన్నుల కొద్దీ ఎరువులు అందుబాటులో ఉంటున్నాయని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదని ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ సర్కారు కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్‌లను ప్రజలకు పంపిణీ చేయడానికి పోటీ పడుతుండగా, ప్రతిపక్ష పార్టీల నేతలు మాత్రం తిట్లలో పోటీ పడుతున్నారని విమర్శించారు. శనివారం ఆయన సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ, రోజుకో మేనిఫెస్టో విడుదల చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, 60 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు 24 గంటల విద్యుత్, తాగునీరు ఎందుకు సరఫరా చేయలేదని ప్రశ్నించారు. ఆకలైనప్పుడు అన్నం పెట్టే చేతకాని వాడు, ఎన్నికలు వస్తుండటంతో గోరుముద్దలు తినిపిస్తానని చెబుతున్న తీరును ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ తాను అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనకు కేసీఆర్ పాలనకు నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉందని వ్యాఖ్యానించారు.

ఆ రాష్ట్రాల్లో మైనార్టీలు అభద్రతలో ఉన్నారు

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలు అభద్రతా భావంతో ఉన్నారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మైనార్టీలు ఒక్క తెలంగాణలోనే సురక్షితంగా ఉన్నారని పేర్కొన్నారు. మైనార్టీ విద్యార్థుల కోసం ఏ రాష్ట్రంలో లేనివిధంగా 200 పైగా రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర హ్యాండ్‌లూం కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, కలెక్టర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ఘనత నాదే

నాపేరు ఎత్తే అర్హత కేసీఆర్‌కు లేదు: బీజేపీ మహిళానేత డీకే అరుణ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్‌కు తన పేరు ప్రస్తావించే అర్హత కూడా లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే.అరుణ మండిపడ్డారు. 'నేను చేసిన త్యాగాలు, పోరాటాల వల్లే ప్రాజెక్టు సాధ్యమైంది. పాలమూరు–రంగారెడ్డి ఘనత నాదే.. నువ్వేం చేశావ్ కేసీఆర్' అని ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ ప్రారంభం సందర్భంగా కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై.. శనివారం రాత్రి అరుణ మీడియాతో మాట్లాడారు. ఫామ్‌హౌస్ ముఖ్యమంత్రికి ఇప్పుడు పాలమూరు గుర్తొచ్చిందని ఎద్దేవా చేశారు. '8 ఏళ్ల కింద పనులు ప్రారంభించి.. ఇప్పుడు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించడానికి వచ్చారు. మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తిచేస్తా, కుర్చీ వేసుకొని కూర్చుంట, కృష్ణ నీళ్లతో పాలమూరు ప్రజల కాళ్లు కడుగుత అన్నడు. ఆయన కడిగేదేంది? నేనే ఎన్నడో కృష్ణా జలాలతో పాలమూరు ప్రజల కాళ్లు కడిగిన. కేసీఆర్.. ఇంకా అబద్ధపు ముచ్చట్లు మరవలేదు. కేసీఆర్ ఒక జూటాకోర్. నా నిజాయతీ ఎక్కడ? నీ అవినీతి ఎక్కడ?' అని నిలదీశారు. ఒక్క పంపు పూర్తిచేసి ప్రారంభించింది ఎన్నికల కోసం కాదా? ఓట్ల కోసం కాదా? అని నిలదీశారు. ప్రాజెక్టు అడ్డుకున్నది నీ పక్కన ఎమ్మెల్యేగా ఉన్నాడు.. కొంచెమైనా సిగ్గుందా కేసీఆర్ అని ప్రశ్నించారు.

కరువు జిల్లాలకు కృష్ణా జలాల మణిహారం

సాక్షి, హైదరాబాద్: కరువు కాటకాలతో ఇంతకాలం కునారిల్లుతున్న ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు కృష్ణా జలాల మణిహారాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అందించారని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ శనివారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. వలసల జిల్లాలుగా పేరుపడ్డ దక్షిణ తెలంగాణాలోని ఆరు జిల్లాలను సీఎం కేసీఆర్ సస్యశ్యామలం చేశారని పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో సీఎం దార్శనికతకు నీటిపారుదల నిపుణులు నివ్వెరపోతున్నారని పేర్కొన్నారు.



దేవోక్తి లేనియెడల జనులు కట్టులేక తిరుగుదురు.
ధర్మశాస్త్రము ననుసరించువాడు ధన్యుడు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.విదియ ఉ.9.16 వరకు తదుపరి తదియ, **నక్షత్రం:** హస్త ఉ.9.32 వరకు తదుపరి చిత్త, **వర్జ్యం:** సా.6.01 నుండి 7.43 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.21 నుండి 5.12 వరకు, **అమృతఘడియలు:** తె.4.16 నుండి 5.34 వరకు (తెల్లవారితే సోమవారం)

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం : 6.00
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జైరాం రమేశ్ (కాంగ్రెస్ ఎంపీ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

శుక్రవారం మేము తుక్కుగూడాలో ఉన్నప్పుడు.. "జయ్! పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఎందుకై ఉంటాయి?" అని మళ్లొకసారి అడిగారు వేణుగోపాల్.

ఏఐసీసీకి ఆయనొక ప్రధాన కార్యదర్శి. నేనొక ప్రధాన కార్యదర్శి. ప్రధాన కార్యదర్శులం ఇద్దరం హైదరాబాద్ వచ్చినప్పటి నుంచీ కమ్యూనికేషన్ సౌలభ్యం కోసం ఎక్కడున్నా పక్కపక్కనే ఉంటున్నాం.

'జయ్! పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఎందుకై ఉంటాయి?' అని వేణుగోపాల్ నన్ను అడిగే సమయానికి మేము తుక్కుగూడాలో 'విజయభేరి' సభకు జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ ఉన్నాం. మాకు కొద్ది దూరంలో... పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి... "కానివ్వండి... కానివ్వండి..." అని పనులు చేయిస్తున్నారు. సీఎల్పీ లీడర్ భట్టి విక్రమార్క, తెలంగాణ ఇంఛార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మాతో ఉన్నారు.

"జైరాం సర్ పన్నెండేళ్లు ఇక్కడే ఖైరతాబాద్‌లో ఉన్నారు తెలుసా మాణిక్‌జీ.." అని మాణిక్‌రావ్‌కు చెబుతున్నారు భట్టి విక్రమార్క. మాణిక్‌రావుకు ఆ సంగతి తెలిసి



ఉండకపోదు కానీ. "అవునా!!" అన్నారు ఎక్సయిటింగ్‌గా భట్టి విక్రమార్క వైపు చూస్తూ.

శనివారం మధ్యాహ్నం తాజ్‌కృష్ణలో సీడబ్ల్యూసీ సమావేశాలు మొదలవబోతుండగా ఈసారి నాకు సందేహం వచ్చింది... 18 నుంచి మోదీ పెట్టించిన ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిజంగా ఎందుకై ఉంటాయి?!

మోదీ, అమిత్‌షా వాళ్లేం చేస్తున్నదీ చెప్పరు. ఏం చేయబోతున్నదీ చెప్పరు. భారతదేశ జనాభా కేవలం తామిద్దరేనని వాళ్లు అనుకుంటున్నట్లుగా ఉంది!

హైదరాబాద్ వచ్చేందుకు ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో ఉన్నప్పుడు ఊరికే నా జ్ఞాపకశక్తిని టెస్ట్ చేసుకోవడం కోసం... యువకుడైన ఉదయనిధి స్టాలిన్‌కి ఫోన్ చేసి, "స్టాలిన్! నువ్వు మన రాజ్యాంగాన్ని పూర్తిగా ఎంత సేపటిలో చదవగలవు?" అని అడిగాను.

"సనాతన ధర్మ రాజ్యాంగమేనా అంకుల్?" అన్నాడు!

బిగుసుకుపోయాన్నేను! అతడింకా సనాతన ధర్మాన్ని వదిలినట్లు లేదు. ఈ మధ్యే సడన్‌గా ఎందుకో పట్టుకున్నాడు.

"సనాతన ధర్మం కాదు స్టాలిన్... భారత రాజ్యాంగం గురించి అంటున్నా... పూర్తిగా ఎంతసేపటిలో చదవగలవు?" అని అడిగాను.

"చదవడం ఎందుకు అంకుల్. మొత్తం అంతా నా ఫింగర్ టిప్స్ మీదే ఉంది. చెప్పండి ఏం కావాలో..." అన్నాడు!

"మరేం లేదూ... ఈ.. 'స్పెషల్ సెషన్' అనే మాట రాజ్యాంగంలో ఎక్కడెక్కడ ఉందో చెప్పగలవా?" అని అడిగాను.

ఉదయనిధి స్టాలిన్ పెద్దగా నవ్వాడు.

"ఎక్కడెక్కడ ఉండటం కాదు అంకుల్.. అసలెక్కడా లేదు. మొత్తం రాజ్యాంగంలోనే స్పెషల్ సెషన్ అనే మాటే లేదు.." అన్నాడు!!

"నువ్వు సూపర్ స్టాలిన్" అన్నాను.

"థ్యాంక్యూ అంకుల్.." అని హడావిడిగా ఫోన్ పెట్టేశాడు. అటువైపు సనాతన ధర్మంపై గొడవింకా ముగిసినట్లు లేదు!


తాజ్‌లో శనివారం మీటింగ్ అయ్యాక... ఆదివారం సాయంత్రం తుక్కుగూడాలో భారీ బహిరంగ సభకు అరేంజ్‌మెంట్స్ చూసుకు న్నాం. అప్పుడు మళ్లీ అడిగారు వేణుగోపాల్..!

"పార్లమెంటు స్పెషల్ సెషన్ ఎందుకు అయుంటుంది జయ్? వన్ నేషన్–వన్ ఎలక్షన్ కోసమా?"... అని.

"మొదట అదే అయింటుంది. ఇప్పుడు సనాతన ధర్మం మొదలైంది ఉంటుంది" అన్నాను. ఆ మాటకు వేణు నవ్వారు.

ప్రతిపక్ష కూటమికి తను వెయ్యేళ్లు ముందుగాను, వెయ్యేళ్లు వెనక గానీ ఉండాలని మోదీ కోరుకుంటున్నట్లుంది! సనాతన ధర్మాన్ని నిర్మూలిస్తే దేశం వెయ్యేళ్లు ముందుకు వెళుతుందని ఉదయనిధి అన్నారు... సనాతన ధర్మాన్ని నిర్మూలించిన దేశాన్ని వెయ్యేళ్లు వెనక్కు తీసుకెళతారా అని వెంటనే అనేస్తున్నారాయన!!

కళాత్మక చౌర్యం



జనతంత్రం

వర్ధెల్లి మురళి

చతుష్షష్టి కళల్లో హస్తలాఘవం కూడా ఒకటి. దానర్థం దొంగతనమేనని మృచ్ఛకటికం నాటకంలోని శర్విలకుడు అనే దొంగ అభిప్రాయం. కనుక చాకచక్యంగా, కళాత్మకంగా చేసే దొంగతనాన్ని చోరకళగా భావించాలని వాదిస్తాడు. ఓ తెలుగు సినిమాలోని బ్రహ్మానందం పాత్ర కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తుంది. జైలు గదిలో తనతోపాటున్న బ్రహ్మాజీని ఏం చేశావని బ్రహ్మానందం అడుగుతాడు. ఫోర్జరీ అంటాడు బ్రహ్మాజీ. 'ఫోర్జరీ అంటే ఆర్ట్... ఆర్టిస్టులను కూడా అరెస్ట్ చేస్తారా?' అంటూ వాపోతాడు బ్రహ్మానందం. ఇప్పుడు తెలుగు దేశం, దాని మిత్రపక్షాలవారు, యెల్లో మీడియా బాస్‌లు కూడా ఇదేవిధంగా వాపోతున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ పేరు మీద చంద్రబాబు ప్రమేయంతో జరిగిన ఒక స్కామ్‌పై సీఐడీ దర్యాప్తు చేస్తున్నది. 371 కోట్ల రూపాయల ప్రజాధనానికి సంబంధించిన ఈ స్కామ్‌లో 241 కోట్ల రూపాయలు వివిధ మార్గాల ద్వారా చంద్రబాబుకు చేరిన వైనాన్ని సీఐడీ నిర్ధారించింది. ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం 6 గంటలకు ఆయనను నంద్యాలలో అరెస్టు చేసింది. ఏ సెక్షన్‌ల కింద అరెస్ట్ చేస్తున్నారో తెలియజేసే ఫామ్‌పై (ఇంటిమేషన్ ఆఫ్ అరెస్ట్) ఆయన సంతకాన్ని తీసుకున్న దృశ్యం టీవీల్లో కనిపించింది. కానీ తనకు కారణం చెప్పకుండా అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టడానికి హెలికాప్టర్‌లో తీసుకెళ్తామని పోలీసులు చెప్పారు. అందుకు ఆయన నిరాకరించారు.

అరెస్టు చేసిన ఇరవై నాలుగ్గంటల్లోగా కోర్టు ముందు ప్రవేశపెట్టవలసి ఉన్నందువల్ల, ఈలోగా సీఐడీ వారు ప్రశ్నించే సమయం ఇవ్వకూడదన్న వ్యూహంతో ఆయన వ్యవహరించినట్టు కనిపించింది. అందుకే హెలికాప్టర్‌లో కాకుండా తన వాహనంలోనే వస్తానని భీష్మించుకున్నారు. పోలీసులు ఆయన మాటను గౌరవించారు. మొదట అరెస్టవడానికి ఆయన సమ్మతించలేదు. మొండికేసే ప్రయత్నం చేశారు. కానీ, తప్పక పోవడంతో తన వాహనంలోకి ఎక్కి కూర్చున్నారు. రోడ్డు మార్గాన నెమ్మదిగా వెళ్తుంటే తన అరెస్ట్ వార్త దావానలంగా వ్యాపించకపోతుందా, వేలాదిమంది తెలుగుదేశం కార్యకర్తలు దండయాత్రకు రాకపోతారా? జనాన్ని చూసి జడుసుకొని అల్లూరి సీతారామరాజును విడిచిపెట్టి వెళ్లినట్టు పోలీసులు తనను కూడా వదిలేసి తోకముడవకపోతారా అనే రవ్వంత ఆశ కూడా ఏ మూలో ఉండవచ్చు.

మార్గమధ్యంలో దండయాత్రలూ, దండుయాత్రలూ ఎదురు కాలేదు కానీ, ఆయన కోరుకున్నట్టుగానే బాగా ఆలస్యమైంది. సీఐడీ అధికారుల ప్రశ్నలకు సహాయ నిరాకరణలో కొంత సమయాన్ని, విశ్రాంతి పేరుతో కొంత సమయాన్ని బాబు కరిగించారని సమాచారం. బాబు విజయవాడకు చేరుకోకముందే ఢిల్లీ నుంచి ఖరీదైన లాయర్ల బృందం చేరుకున్నది. కోర్టులో హోరాహోరీగా వాదప్రతివాదాలు జరిగాయి. పది గంటలపాటు జడ్జి ఈ వాదనల్ని విన్నారు. ఇరువైపుల నుంచీ పలు సందర్భాల్లో సందేహాలను నివృత్తి చేసుకున్నారు. చివరకు ప్రభుత్వ న్యాయవాది వాదన, రిమాండ్ రిపోర్ట్ అంశాలతో ఏకీభవించి చంద్రబాబును రిమాండ్‌కు పంపారు. హై ప్రొఫైల్ వ్యక్తికి సంబంధించిన కేసు కాబట్టేమో, సుదీర్ఘ సమయం వాదోపవాదాలు జరిగినా సరే జడ్జి ఓపిగ్గా విన్నారు. తీర్పు వెలువడిన మరుక్షణం నుంచే తెలుగుదేశం – యెల్లో కూటమి, దాని సోషల్ మీడియా బృందాలు వాటి వికృత స్వరూపాన్ని బయటపెట్టుకున్నాయి.

జడ్జి మీద వ్యక్తిగతంగా దాడుల్ని ఎక్కుపెట్టారు. ఎక్కడి నుంచి వెతికి పట్టుకున్నారో తెలియదు, అది నిజమో కాదో కూడా తెలియదు గానీ, జడ్జిగారిది బీసీ సామాజికవర్గంగా తేల్చేశారు. ఇంకేముంది... యెల్లో కూటమి పెత్తందారీ దురహంకారం బుసలు కొట్టింది. 'బీసీలు జడ్జీలుగా పనికిరారు, వారిని నియమించకండి' అంటూ కేంద్ర న్యాయశాఖకు లేఖలు రాసిన చరిత్ర చంద్రబాబుది. ఇప్పుడాయన అనుచర గణాలు ఆయన ఆదర్శాన్ని అందిపుచ్చుకొని విశృంఖలంగా చెలరేగిపోతున్నాయి. తీర్పు చెప్పే న్యాయమూర్తుల్లో, ప్రాణం పోసే డాక్టర్లలో, శాంతిభద్రతలు కాపాడే పోలీసుల్లో కూడా కులం నీడల్ని వెతికిపట్టుకునే దౌర్భాగ్యపు పెత్తందారీ దురహంకార సంప్రదాయాన్ని చంద్రబాబు కూటమి పెంచి పోషిస్తున్నది. పొరపాటున అవతలివారు బీసీలో, ఎస్సీలో, ఎస్టీలో, మైనారిటీలో అని తేలితే వారి ప్రతిష్ఠ మీద రెచ్చిపోయి దాడులు చేస్తున్నారు. అందుకే ఇవాళ ఆంధ్ర రాష్ట్రంలో పేదలకు, పెత్తందార్లకు మధ్యన జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయ పరమైనది మాత్రమే కాదు... అది సామాజిక, సాంస్కృతిక విలువల పోరాటం కూడా!

ఇప్పుడు చంద్రబాబును జైల్లో పెట్టించిన స్కిల్ కేసు వివరాలను మరోసారి క్లుప్తంగా పరిశీలిద్దాం. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వృద్ధి చేయడం అనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. తన అనుచరులను తీసుకొచ్చి సంస్థ పగ్గాలను అందించారు. ఈ సంస్థకూ, డిజైన్ టెక్ అనే ప్రైవేట్ సంస్థకూ, జర్మనీకి చెందిన సీమెన్స్ సంస్థకూ మధ్యన ఒక త్రైపాక్షిక ఒప్పందం కుదిరిందని వెల్లడిస్తూ మరో జీవోను విడుదల చేశారు. ఈ జీవోలో పేర్కొన్న ప్రకారం సీమెన్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సహకరిస్తుంది. ఇందుకోసం ఏర్పాటు చేసే శిక్షణ కేంద్రాలకు అవసరమైన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌ల కొనుగోలు కోసం 3,300 కోట్లు ఖర్చవుతుంది. ఇందులో 90 శాతాన్ని సీమెన్స్ సంస్థ గ్రాంట్- ఇన్-ఎయిడ్‌గా (ఉచిత సహాయం) సమకూరుస్తుంది. ప్రభుత్వం

మామూలుగా తాను ఇంటర్వ్యూ చేసే వ్యక్తిని బెదరగొట్టే విధంగా విరుచుకుపడే ఓ జాతీయ టీవీ ఛానల్ యాంకర్ ఆర్ణబ్ గోస్వామి, చినబాబు విషయంలో కొంత మెతక వైఖరి ప్రదర్శించాడు. మొదటి ఒకటి రెండు ప్రశ్నలు కొంచెం గట్టిగా అడగ్గానే లోకేశ్ కంగారుపడ్డట్టు కనిపించాడు. దాంతో ఆర్ణబ్ కొంచెం నెమ్మదించాడు. 'లవకుశ' సినిమాలో 'ముక్కుపచ్చారని మునికుమారుల చంపకూడదని నే గొంకుచుంటి' అనే పద్యాన్ని చదువుతున్నప్పుడు ఎన్టీ రామారావు ముఖంలో కనిపించిన ఎక్స్‌ప్రెషన్స్ గోస్వామిలో కనిపించాయి. ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ తప్పు చేస్తే చైర్మన్ ఎలా బాధ్యుడవుతాడు అని లోకేశ్ ఎదురు ప్రశ్న వేశాడు. అంటే మేనేజర్ స్థాయిలో తప్పు జరిగినట్టు అంగీకరిస్తున్నారా అనే సరికి చినబాబు ఖంగుతిన్నారు. స్కామ్ జరిగితే ఆ డబ్బు ఎక్కడికి చేరిందో సీఐడీ నిరూపించాలి కదా, అలా నిరూపించలేదని ఆయన ఆఖరి బాణం వదిలారు.

తరపున 10 శాతం కింద 330 కోట్లను సమకూర్చాలి. జీఎస్టీ చెల్లింపులతో కలిపి అది 371 కోట్లు అవుతుంది. ఈమేరకు కుదిరిన ఒప్పంద పత్రంలో మాత్రం గ్రాంట్-ఇన్-ఎయిడ్ ప్రస్తావన గానీ, కుదిరిన తేదీగానీ ఏమీ లేవు.

ప్రభుత్వ వాటాగా 371 కోట్లను తక్షణం డిజైన్‌టెక్ సంస్థకు విడుదల చేయాలని పైనుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. సీమెన్స్ వాటా విడుదల కాకుండానే పది శాతాన్ని ఏకమొత్తంగా విడుదల చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆర్థికశాఖ అధికారులు నోటు ఫైళ్లపై కామెంట్లు రాసినా ఖాతరు చేయలేదు. పదేపదే పైనుంచి ఒత్తిడి పెరగడంతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విడుదల చేస్తున్నట్టు ఆర్థిక శాఖ కార్యదర్శులు నోటుఫైళ్లపై రాసి సంతకాలు చేశారు. ఆ తర్వాత డిజైన్‌టెక్ సంస్థకు ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా డబ్బులు వెళ్లాయి. అసలీ డిజైన్ టెక్ సంస్థ పాత్ర ఏమిటి? నేరుగా ఏపీఎస్ఎస్‌డీసీనే సీమెన్స్ సంస్థతో వ్యవహారం నడపవచ్చు గదా!

371 కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తున్నప్పుడు టెండర్లను పిలవకుండా ఉండడానికి సీమెన్స్ ఉచిత సాయం కథ ముందుకు తెచ్చారు. ఉచిత సాయం 90 శాతం కింద సాంకేతిక సహకారాన్ని అందిస్తారని మధ్యలో కథ మార్చారు. ఈ డిజైన్‌టెక్ అనే సంస్థది బ్రోకరేజీ పాత్ర. ఈ సంస్థకు చేరిన 371 కోట్లలో 59 కోట్లు వెచ్చించి సీమెన్స్ కంపెనీ నుంచి ఏపీఎస్ఎస్‌డీసీకి అవసరమైన పరికరాలను, సాఫ్ట్‌వేర్‌ను తెప్పించారు. ఈ కొనుగోలు జస్ట్ షాపింగ్ లాంటిదే. ఎవరైనా కొనుక్కోవచ్చు. ఒప్పందాలతో పనిలేదు. స్కిల్ సెంటర్ల కోసం మొత్తంగా చేసిన ఖర్చు ఇదే. దీనికే 3,300 కోట్ల బిల్డప్ ఇచ్చారు. టెండర్ల గోల లేకుండా గ్రాంట్ ఇన్ ఎయిడ్ కథను అల్లుకొచ్చారు. డిజైన్ టెక్ సంస్థ మిగిలిన సొమ్ములో 241 కోట్లను పీవీఎస్‌పీ అనే షెల్ కంపెనీకి తరలించింది. ఇది పుణె కంపెనీ. ఈ కంపెనీ నుంచి ఆ సొమ్ము ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్‌లోని షెల్ కంపెనీల ద్వారా దుబాయ్, సింగపూర్‌లోని కంపెనీకి తరలివెళ్లింది. వాటి వివరాలను కూడా సీఐడీ తన రిపోర్టులో పొందుపర్చింది.

ప్రభుత్వం ప్రకటించిన విధంగా మొత్తం ప్రాజెక్టు వ్యయానికి సరిపోయేలా నకిలీ ఇన్వాయిస్‌లను కూడా ఈ పుణె కంపెనీ సమీకరించుకున్నది. దీనికి బ్రోకరేజీ ఫీజు వసూలు చేసి ఉండవచ్చు. ఇదిగో ఈ షెల్ కంపెనీల మీద జీఎస్టీ అధికారులు జరిపిన తనిఖీల్లో నకిలీ ఇన్వాయిస్‌ల భాగోతం బయటపడింది. అప్పటికింకా రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. జీఎస్టీ అధికారులు ఈ నకిలీ వ్యవహారాలను రాష్ట్ర ఏసీబీకి ఉప్పందించారు. ఏసీబీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. సూత్రధారి తానే కనుక ఆయన మౌనం వహించారు. ఏసీబీకి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. మౌనంగా నోట్ ఫైళ్లతో సహా సంబంధిత డాక్యుమెంట్లను కాల్చేయాలని ఆదేశించారు. తదనంతరం రంగంలోకి దిగిన ఈడీ ఈ మనీల్యాండరింగ్ వ్యవహారాన్ని మొత్తం నిర్ధారించింది.

సీమెన్స్ కంపెనీకి ఇండియా విభాగం చీఫ్‌గా ఉన్న సుమన్ బోస్‌తో సహా డిజైన్‌టెక్ ఎంపీ వికాస్ కన్విల్కర్, మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది. ఈ సుమన్ బోస్ అసలు పేరు సౌమ్యాద్రి బోస్‌గానూ, డిజైన్‌టెక్ ద్వారా ఏపీతో కుదుర్చుకున్న ఒప్పందంలో సుమన్ బోస్‌గా సంతకం చేసినట్టుగానూ ఈడీ గుర్తించింది. దొంగ సంతకం దొంగ స్కీమ్‌కు రుజువు కదా! ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం ఈ కేసులో దర్యాప్తు చేయడానికి పూర్వమే కేంద్ర జీఎస్టీ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ ఈ స్కామ్‌ను పసిగట్టాయి. ఆ కారణంగా సీమెన్స్ ఇండియా ఎండీ సుమన్ బోస్ ఉద్యోగం కూడా ఊడింది. ఈ కేసు మొత్తంలో అన్నిటికంటే ప్రధానమైన అంశం – సీమెన్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)కి 2022, ఫిబ్రవరి మూడో తేదీ నాడు రాసిన లేఖ! ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో తాము ఎటువంటి ఒప్పందం చేసుకోలేదనీ, అసలు గ్రాంట్ ఇన్ ఎయిడ్ స్కీమ్ తమ దగ్గర ఏమీ లేదని ఆ లేఖలో కంపెనీ స్పష్టం చేసింది. కంపెనీ స్వయంగా ఇటువంటి స్కీమ్ లేదని చెబుతుంటే మన చినబాబు, పెదబాబు, యెల్లో మీడియా మాత్రం ఉందని దబాయిస్తున్నారు. శుక్రవారం నాడు ఢిల్లీలో ఒక జాతీయ మీడియా చానల్‌లో కూర్చొని లోకేశ్ ఇదే విషయాన్ని ప్రస్తావించాడు. ఉత్తర కుమారుడు యుద్ధానికి బయల్దేరితే జనించినంత ఆసక్తి చినబాబు మీడియా డిబేట్‌లపై జనించింది. కష్టంగా కొన్ని విషయాలు చెప్పాడాయన. అన్నీ టెక్నికల్ విషయాలే! గుజరాత్‌లో సీమెన్స్ కంపెనీ ఈ గ్రాంట్ ఇన్ ఎయిడ్ స్కీమ్‌ను అమలు చేసిందనీ, దాన్ని పరిశీలించాకనే తాము ఒప్పందం చేసుకున్నామనీ లోకేశ్ చెప్పాడు. గుజరాత్‌లో జరిగిన ఒప్పంద పత్రంపై సౌమ్యాద్రి బోస్ అని సంతకం చేసిన వ్యక్తి ఏపీ ఒప్పందంపై సుమన్ బోస్ అని చేశాడు. అక్రమ పథకానికి అక్రమ సంతకం, సక్రమ పథకానికి సక్రమ సంతకం అన్న మాట. చివరకు అతను కంపెనీ నుంచి వెళ్లిపోయాడు.

మామూలుగా తాను ఇంటర్వ్యూ చేసే వ్యక్తిని బెదరగొట్టే విధంగా విరుచుకుపడే ఆర్ణబ్ గోస్వామి చినబాబు విషయంలో కొంత మెతక వైఖరి ప్రదర్శించాడు. మొదటి ఒకటి రెండు ప్రశ్నలు కొంచెం గట్టిగా అడగ్గానే లోకేశ్ కంగారుపడ్డట్టు కనిపించాడు. దాంతో ఆర్ణబ్ కొంచెం నెమ్మదించాడు. 'లవకుశ' సినిమాలో 'ముక్కుపచ్చారని మునికుమారుల చంపకూడదని నే గొంకుచుంటి' అనే పద్యాన్ని చదువుతున్నప్పుడు ఎన్టీ రామారావు ముఖంలో కనిపించిన ఎక్స్‌ప్రెషన్స్ గోస్వామిలో కనిపించాయి. ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ తప్పు చేస్తే చైర్మన్ ఎలా బాధ్యుడవుతాడు అని లోకేశ్ ఎదురు ప్రశ్న వేశాడు. అంటే మేనేజర్ స్థాయిలో తప్పు జరిగినట్టు అంగీకరిస్తున్నారా అనే సరికి చినబాబు ఖంగుతిన్నారు. స్కామ్ జరిగితే ఆ డబ్బు ఎక్కడికి చేరిందో సీఐడీ నిరూపించాలి కదా, అలా నిరూపించలేదని ఆయన ఆఖరి బాణం వదిలారు.

నిరూపించకపోవడమేమిటి? సీఐడీ నిక్షేపంగా నిరూపిస్తున్నది. ఈడీ కూడా నిర్ధారిస్తున్నది. షెల్ కంపెనీల ద్వారా సింగపూర్, దుబాయ్‌లకు డబ్బు చేరిన తర్వాత కథలోకి యోగేశ్ గుప్తా ఎంట్రీ ఇస్తాడు. ఆయన హవాలా మార్గంలో దేశానికి తరలించి, మనోజ్ వాసుదేవ్ పార్థసానికి అందజేస్తారు. పార్థసాని హైదరాబాద్‌లో పెండ్యాల శ్రీనివాస్‌కు (చంద్రబాబు పీఏ) అందజేస్తారు. శ్రీనివాస్ ద్వారా ప్యాలెస్ డెన్‌కు ఆ డబ్బు చేరుతుంది. సరిగ్గా ఇవే పేర్లు, ఇదే మోడస్ ఆపరెండీని మనం ఐటీ శాఖ వెలుగులోకి తెచ్చిన స్కామ్‌లో కూడా చూశాము.

గడచిన మూడు దశాబ్దాలుగా ఎవరికీ దొరక్కుండా కళాత్మకంగా నెగ్గుకొస్తున్న 'స్కామింగ్'లో ఇప్పుడు తడబడట మేమిటని యెల్లో కూటమి విస్తుపోతున్నది. ఈ కేసులో అరెస్ట యిన దగ్గర్నుంచీ ఈ శిబిరం నుంచి సాంకేతిక అభ్యంతరాలే తప్ప దొంగతనం జరిగిందా లేదా అనే అసలు విషయం జోలికి వెళ్లడం లేదు. మచ్చుకు కొన్ని చూద్దాం. ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేదు గనుక స్కామ్‌తో తనకు సంబంధం లేదని బాబు వాదిస్తున్నారు. ఇదో వితండవాదం. నేరం జరిగినట్టు ఫిర్యాదందగానే అనుమానితుల పేర్లతో వేసేది ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్). దర్యాప్తు క్రమంలో అసలు నేరస్తుడు బయట పడొచ్చు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేదు గనుక అసలు నేరస్తుడిని వదిలేస్తారా?.. నవ్విపోతారు.

ఈ వ్యవహారంలో తన పాత్ర లేదనీ, ఎవరినీ ప్రభావితం చేయలేదనీ ఆయన చెప్పుకొస్తున్నారు. కానీ అడుగడుగునా ఈ వ్యవహారంలో ఆయన పాత్రను సీఐడీ దర్యాప్తు నిగ్గుదేల్చింది. ఏపీఎస్ఎస్‌డీసీని ఏర్పాటు చేయడం దగ్గర్నుంచి, నిబంధనలకు విరుద్ధంగా తన మనుషుల్ని దానిలో జొప్పించడం వరకు ఆయనదే ప్రధాన భూమిక.

అమరావతిలోని తాత్కాలిక సచివాలయం భవనం కాంట్రాక్టు ఇచ్చినందుకు గాను పల్లోంజీ సంస్థ చెల్లించిన 118 కోట్ల ముడుపులను (600 కోట్ల పనికి) ఇదే పద్ధతిలో తరలించినట్టు ఐటీ శాఖ కనిపెట్టింది. స్కిల్ స్కామ్‌లో విచారణ కోసం పై ముగ్గురికీ నోటీసులివ్వగానే వారు అందుబాటులో లేకుండా మాయమయ్యారు. యోగేశ్ గుప్తా కనిపించడం లేదు. మనోజ్ పార్థసాని దుబాయ్‌కీ, పెండ్యాల శ్రీనివాస్ అమెరికాకూ ఉడాయించారు. స్కామ్ డబ్బులు ఎక్కడికి వెళ్లాయో తెలుసుకోవాలన్న ఆసక్తి నిజంగానే లోకేశ్‌బాబుకు ఉంటే ఆ ముగ్గుర్నీ పిలిపించి సీఐడీకి అప్పగిస్తే సరిపోతుంది.

గడచిన మూడు దశాబ్దాలుగా ఎవరికీ దొరక్కుండా కళాత్మకంగా నెగ్గుకొస్తున్న 'స్కామింగ్'లో ఇప్పుడు తడబడట మేమిటని యెల్లో కూటమి విస్తుపోతున్నది. ఈ కేసులో అరెస్ట యిన దగ్గర్నుంచీ ఈ శిబిరం నుంచి సాంకేతిక అభ్యంతరాలే తప్ప దొంగతనం జరిగిందా లేదా అనే అసలు విషయం జోలికి వెళ్లడం లేదు. మచ్చుకు కొన్ని చూద్దాం. ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేదు గనుక స్కామ్‌తో తనకు సంబంధం లేదని బాబు వాదిస్తున్నారు. ఇదో వితండవాదం. నేరం జరిగినట్టు ఫిర్యాదు అందగానే అనుమానితుల పేర్లతో వేసేది ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్). దర్యాప్తు క్రమంలో అసలు నేరస్తుడు బయట పడొచ్చు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేదు గనుక అసలు నేరస్తుడిని వదిలేస్తారా?.. నవ్విపోతారు.


ఈ వ్యవహారంలో తన పాత్ర లేదనీ, ఎవరినీ ప్రభావితం చేయలేదనీ ఆయన చెప్పుకొస్తున్నారు. కానీ అడుగడుగునా ఈ వ్యవహారంలో ఆయన పాత్రను సీఐడీ దర్యాప్తు నిగ్గుదేల్చింది. ఏపీఎస్ఎస్‌డీసీని ఏర్పాటు చేయడం దగ్గర్నుంచి, నిబంధనలకు విరుద్ధంగా తన మనుషుల్ని దానిలో జొప్పించడం వరకు ఆయనదే ప్రధాన భూమిక. హడావిడిగా ప్రభుత్వ వాటాను వెంటపడి విడుదల చేయించిందే నాటి ముఖ్యమంత్రి. ఇందుకోసం సంబంధిత ఫైళ్లలో 13 చోట్ల ఆయన సంతకాలు చేసిన విషయాన్ని సీఐడీ రుజువు చేసింది. విద్యాశాఖతో సంబంధం లేకుండా నిధుల విడుదలకు ప్రత్యేక గ్రీన్‌ఛానల్‌ను కూడా ఆయన ఏర్పాటు చేశారు. అప్పుడు ఆర్థిక శాఖ కూడా ఆయన ఆధ్వర్యంలోనే ఉన్నది. ఇవన్నీ ఎవరు చెబితే చేశారు? అవినీతి నిరోధక చట్టం 17ఏ ప్రకారం గవర్నర్ ఆమోదం లేకుండా తనను అరెస్టు చేయడం కుదరదనీ, తన మీద ఐపీసీ 409 సెక్షన్‌పై కేసు బనాయించడం చెల్లదనీ వాదిస్తున్నారు. అంతే తప్ప స్కామ్ జరగలేదని వాదించడం లేదు. ఈ రెండు అంశాలపై ఏసీబీ కోర్టులో విస్తృతంగా వాదప్రతివాదాలు జరిగాయి. గౌరవ న్యాయస్థానం ఒక నిర్ణయం తీసుకున్నది. ఆయనలో వణుకు మొదలైందని సమాచారం. ఈ స్కామ్‌తోనే కేసులు ఆగవని, మరో అరడజన్ కేసుల్లో తాను ఇరుక్కోవడం ఖాయమని భావిస్తున్నారట! చట్టానికి దొరక్కుండా కొల్లగొట్టే తన కౌశలం ఎందుకిలా కొడిగట్టిందో అర్థంకావడం లేదు.

చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లిన తర్వాత జనసేనాని పవన్ కల్యాణ్‌తో సహా బాలకృష్ణ, లోకేశ్ వెళ్లి కలిశారు. ఆయనతో రాజకీయాలేవో మాట్లాడుకొని బయటకు వచ్చిన తర్వాత చేసిన వీరవిక్రమ ధీర గంభీర స్టేట్‌మెంట్ మాత్రం ఆశ్చర్యం కలిగించింది. ఆయన ప్రకటనలో రెండు ముఖ్యమైన అంశాలున్నాయి. మొదటిది – వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కలిసి పోటీ చేస్తాయి. రెండో అంశం – ఇకపై వైసీపీ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నామని చెప్పడం! వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసే పోటీ చేస్తాయని ఈ రాష్ట్ర జనాభాలో నూటికి తొంభైమందికి ఎప్పుడో తెలుసు. అంత ఆవేశంగా చెప్పవలసిన కొత్త విషయమేమున్నది ఇందులో! బహుశా జైల్లో చంద్రబాబు ఉపదేశించిన మంత్ర ప్రభావం వల్ల కావచ్చు. ఆయన మాత్రం చాలా ఆవేశపడ్డారు. యుద్ధం స్టోరీ కూడా పాతదే. పేద ప్రజల సాధికారత ఉద్యమం పైన పెత్తందార్ల తరఫున ప్రతిపక్ష శిబిరం ఎప్పటినుంచో యుద్ధం చేస్తున్నది. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన బోధన కోసం సాగుతున్న యత్నాలపైనా యుద్ధం ప్రకటించింది. మహిళల పేర్ల మీద ఇళ్లు కట్టించి ఇస్తుంటే యుద్ధ సైరన్ వినిపించింది. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తుంటే రణభేరి మోగించింది. పెత్తందార్లు యుద్ధం ఆపిందెప్పుడు?

vardhelli1959@gmail.com

విమోచన కాదు విద్రోహం!

సందర్భం



బొల్లిముంత సాంబశివరావు


తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని కొన్ని రాజకీయ పక్షాలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా చిత్రించుకుంటున్నాయి. కానీ అసలు చరిత్రలో జరిగింది వేరు.

నైజాం నవాబు ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎట్టి హక్కులు లేకుండా, వెట్టి చాకిరీ చేస్తూ, దారుణ దోపిడీకి గురౌతున్న సమయంలో 'ఆంధ్ర మహాసభ' ఏర్పడింది. క్రమంగా 'ఆంధ్ర మహాసభ' కమ్యూనిస్టుల నాయకత్వంలోకి వచ్చింది. వెట్టి చాకిరీ రద్దు, కౌలు తగ్గింపు, 'దున్నే వానికే భూమిపై హక్కు' వంటి డిమాండ్‌లను ముందుకు తెచ్చి నిజాం పాలనపై ఉద్యమించింది. సంఘంలోకి ప్రజలు పెద్ద ఎత్తున చేరారు. భూమి కోసం పోరు ప్రారంభమైంది. 'ఆంధ్ర మహాసభ' ప్రతి గ్రామానికీ విస్తరించింది. తన భూమి, పంటల రక్షణ కోసం చాకలి ఐలమ్మ ప్రదర్శించిన తెగువ భూపోరాట ప్రాధాన్యాన్ని ముందుకు తెచ్చింది.

జనగామ తాలూకా కలవెండి గ్రామంలో దేశ్ ముఖ్ విసునూరి రామచంద్రారెడ్డి గూండాలు జరిపిన కాల్పుల్లో దొడ్డి కొమురయ్య అమరత్వంతో పోరాటం కొత్త మలుపు తీసుకున్నది. దేశ్‌ముఖ్‌ల, జమీందార్ల దాడులను సాయుధంగా ప్రతిఘటన చేయాలని కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం తీసుకుంది. రైతాంగ ఉద్యమంపై నిజాం నవాబ్ ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. నిజాం రజాకార్లు ప్రజలపై పాశవిక దాడులు చేశారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఈ దాడులను తిప్పికొట్టేందుకు గెరిల్లా దళాలు ఏర్పడ్డాయి. పోరాటం ద్వారా పది లక్షల ఎకరాల భూములు ప్రజలు స్వాధీనపర్చుకుని సాగు చేశారు. వేలాది గ్రామాల్లో గ్రామ రాజ్యాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రజాశక్తికి భయపడి జమీందార్లు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు పట్టణాలకు పారిపోయారు.

నిజాం నిరంకుశ ప్రభుత్వం నిర్బంధం పెంచి ప్రజలను తీవ్ర చిత్రహింసలకు గురిచేసింది. ప్రజలను ఒకేచోట మందవేసి పాశవికంగా హింసించారు. అయినా పోరాటం ఆగలేదు. పోరాటాన్ని అడ్డుకునే శక్తి నిజాం ప్రభుత్వం కోల్పోయింది.

రైతాంగ సాయుధ పోరాటం నెహ్రూ ప్రభుత్వ వెన్నులో వణుకు పుట్టించింది. ఉద్యమం కొనసాగితే కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరిగి ఇతర ప్రాంతాల్లో కూడా ఉద్యమాలు ప్రారంభమౌతాయని నెహ్రూ ప్రభుత్వం భయపడింది. అందుకే 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ సంస్థానానికి సైన్యాలను పంపింది. నిజాం సైన్యాలు బూటకపు ప్రతిఘటన నాటకమాడాయి. రెండు రోజుల్లోనే నైజాం రాజు లొంగిపోయినట్లు ప్రకటించి, నెహ్రూ సైన్యాలకు స్వాగతం పలికాడు. దీన్ని గమనిస్తే ముందుగానే సైనిక చర్య గురించి నెహ్రూ ప్రభుత్వానికి, నైజాం నవాబుకూ మధ్య ఒప్పందం జరిగిందనేది వెల్లడవుతుంది. నిజాం నవాబును గద్దె దింపటానికే సైన్యం వస్తే, మరి నవాబును (రాజుని) అరెస్టు చేసి



సర్దార్ పటేల్ ముందు లొంగిపోతున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్

నిర్బంధించాలి కదా! కానీ అలా జరగలేదు. 'రాజ్య ప్రముఖ్'గా నిజాం రాజుని ప్రకటించి 1950 జనవరి 26 వరకు నైజాం ప్రాంతాన్ని అతని పాలనలోనే ఉంచి, నెహ్రూ ప్రభుత్వం 1950లో సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో విలీనం చేసింది.

ఈ క్రమంలో గ్రామాలకు సైన్యాలను పంపి ప్రజలు సాగు చేసుకుంటున్న భూములను జమీందార్లకు, భూస్వాములకు అప్ప గించింది. దీన్ని గమనిస్తే నైజాం నవాబును, జమీందార్లను, జాగీర్దారులను, భూస్వాములను రక్షించటానికే రైతాంగ సాయుధ పోరాటంపైకి మిలిటరీ దాడి అన్నది స్పష్టమవుతున్నది. అందుకు అనుగుణంగానే పెద్ద ఎత్తున నిజాం రాజ్యంలో సైన్యాన్ని దింపి రైతాంగ పోరాటంపై విరుచుకుపడింది. కాన్స న్ట్రేషన్ క్యాంపులు పెట్టి ప్రజలను తీవ్ర చిత్రహింసలకు గురి చేసింది. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించింది. నాయకులను, కార్యకర్తలను పట్టుకుని కాల్చి చంపింది. నెహ్రూ ప్రభుత్వం ఎంత నిర్బంధం ప్రయోగించినా రైతాంగ సాయుధ పోరాటం కొన సాగింది. పార్టీలో చోటు చేసుకున్న మితవాద, అతివాద ధోరణులు 1951 అక్టోబర్ 31న మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం విరమణకు కారణమయ్యాయి.

మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్మించింది కమ్యూనిస్టు పార్టీ. అందుకు అనేక త్యాగాలు చేసింది కమ్యూనిస్టు పార్టీనే! అందువలన ఆ పోరాట వారసులు కమ్యూనిస్టులే. ఇతరులు దాన్ని ఉచ్చరించటానికి కూడా హక్కు లేదు. అలాగే సెప్టెంబర్ 17న జరిగినది విమోచన కాదు, ప్రజలకు విద్రోహమని ప్రజలు గొంతు విప్పాలి. తెలంగాణ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని నినదించాలి.

వ్యాసకర్త ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు | 98859 83526

క్లుప్తంగా...

కాంగ్రెస్‌లో చేరిన తుమ్మల, జిట్టా



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను సన్మానిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు



జిట్టాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లాకు చెందిన మాజీమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నల్లగొండ జిల్లాకు చెందిన జిట్టా బాలకృష్ణారెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజ్‌కృష్ణ హోటల్‌లో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాల సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో తుమ్మల పార్టీలో చేరారు. ఆయనకు కండువా కప్పి ఖర్గే పార్టీలోకి ఆహ్వానించారు. జిట్టా బాలకృష్ణారెడ్డి మాత్రం టీపీసీసీ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని కోమటిరెడ్డి నివాసానికి వచ్చిన జిట్టా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం కూడా ఈ చేరికల పర్వం కొనసాగుతుందని, కొందరు మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు పార్టీలో చేరుతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

రాహుల్‌కు నందీశ్వరుడి ప్రతిమ ఇచ్చిన పొంగులేటి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారికి నందీశ్వరుడి ప్రతిమలను బహూకరించారు. కంచుతో ఈ ప్రతిమలను ప్రత్యేకంగా చేయించారు. ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఓ ప్రమాదంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కాలికి గాయమవగా దాని గురించి అడిగి తెలుసుకొని.. జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్న సోనియా

తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయి

మీడియాతో సీడబ్ల్యూసీ సభ్యుడు జైరాం రమేశ్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలు తెలంగాణ రాజకీయాలను మార్చబోతున్నాయని సీడబ్ల్యూసీ సభ్యుడు జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో గేమ్ చేంజ్ కాబోతోందని ఆయన చెప్పారు. సీడబ్ల్యూసీ సమావేశాల సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఉన్న మోదీకి, హైదరాబాద్‌లో ఉన్న కేసీఆర్‌కు తేడా ఏమీ లేదని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల్లాంటివని చెప్పారు. చిదంబరంతో కలిసి విలేకరులతో మాట్లాడిన సందర్భంగా.. 'ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రతిపక్ష రాజకీయ పార్టీల గురించి, ఇండియా కూటమి గురించి మాట్లాడటం ప్రధాని మోదీకి అలవాటు. కానీ మేం అలా మాట్లాడం. రాజకీయాలు మాట్లాడేందుకు రాజకీయ వేదికలను మాత్రమే ఉపయోగించుకుంటాం.' అని జైరాం రమేశ్ చెప్పారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో సంభవించిన ప్రకృతి విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించి ఆ రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు.

ఊమెన్ చాందీ సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి

సాక్షి, హైదరాబాద్: కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ మృతి పట్ల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం సంతాపం చెబుతూ తీర్మానం చేసింది. 53 ఏళ్లకు పైగా పుతుపల్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఒక మహోన్నతమైన ధీరుడుగా సీడబ్ల్యూసీ కొనియాడింది. తన జీవితమంతా ప్రజల సేవకే అంకితం చేశారని పేర్కొంది.

చైనా దురాక్రమణ పెరుగుతోంది

దాన్ని ఆపడానికి కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు

- రాజకీయ పరిస్థితులు, ఆర్థిక సంక్షోభం, భద్రతా వైఫల్యాలపై సీడబ్ల్యూసీలో చర్చించాం
- కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లలో ఓడినందుకు ఆటంకాలు సృష్టిస్తున్నారు
- సైనికాధికారులను ఉగ్రవాదులు చంపేస్తే జీ20 పేరుతో సంబురాలు చేసుకుంటారా?
- జమిలి ఎన్నికలకు ఐదు రాజ్యాంగ సవరణలు కావాలి
- సనాతన ధర్మం వివాదంలోకి మేం వెళ్లం.. ఇండియా అంటేనే భారత్
- ఇండియా కూటమిని సీడబ్ల్యూసీ బలపర్చింది... జోడో యాత్ర మళ్లీ చేయాలని సభ్యులు అడిగారు

విలేకరుల సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి చిదంబరం



సాక్షి, హైదరాబాద్: దేశ ఉత్తర సరిహద్దులోని భూభాగాన్ని చైనా దురాక్రమణ చేస్తోందని, దీన్ని ఆపడానికి భారత్ చర్యలు తీసుకోవట్లేదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం వ్యాఖ్యానించారు. 2020లో జూన్ 19న జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రధాని చెప్పిన మాటలే చైనా దురాక్రమణకు కారణమవుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాల సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో జైరాం రమేశ్, పవన్‌ఖేరాలతో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలోని రాజకీయ పరిస్థితులు, ఆర్థిక సంక్షోభం, భద్రతా వైఫల్యం గురించి సమావేశంలో చర్చించినట్టు చెప్పారు. దేశంలో రాజ్యాంగ, సమాఖ్య స్ఫూర్తికి సవాల్ ఏర్పడిందని, ఓ పద్ధతి ప్రకారం వ్యవస్థలను బలహీనపరుస్తున్నారని ధ్వజమెత్తారు.

అంశాల వారీగా చిదంబరం ఏం చెప్పారంటే..

➡ దేశంలో సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటోంది. రాష్ట్ర ప్రభుత్వాలను నిర్వీర్యం చేస్తూ... ఇవ్వాల్సిన నిధులను కూడా కేంద్రం ఇవ్వట్లేదు. ఉదాహరణకు కర్ణాటకలో ఎన్నికల సందర్భంగా అక్కడి ప్రజలకు ఉచిత బియ్యం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పుడు ఈ హామీని అమలు చేయడంలో భాగంగా డబ్బులు చెల్లిస్తామని చెప్పినా ఎఫ్‌సీఐ బియ్యం ఇవ్వడం లేదు. బియ్యం ఇవ్వొద్దని పైనుంచి ఆదేశాలిచ్చారు. హిమాచల్‌ప్రదేశ్‌లో వరదలు, కొండచరియలు విరిగిపడిన కారణంగా తీవ్ర నష్టం జరిగింది. చాలామంది ప్రాణాలు కోల్పోయారు. కానీ, విపత్తు సహాయం కింద కూడా కేంద్రం ఆ రాష్ట్రానికి నిధులు ఇవ్వట్లేదు. దీనికి కారణం అక్కడి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడమే.

➡ మే 5 నుంచి మణిపూర్ తగలబడుతోంది. అప్పటి నుంచి దాదాపు 157 రోజులుగా ప్రధాన మంత్రి చాలాసార్లు చాలా దేశాలకు వెళ్లివచ్చారు. ఏషియా సమిట్, జీ8 దేశాల సమావేశాలకు హాజరయ్యారు. కానీ, ఢిల్లీ నుంచి మణిపూర్ వెళ్లేందుకు రెండు గంటలు మాత్రమే పడుతుంది. అయినా అక్కడకు వెళ్లేందుకు సమయం దొరక్కపోవడం బాధ కలిగిస్తోంది.

➡ ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో అసత్యాలు చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు లేవు. తాజాగా ఉగ్రవాదులు అక్కడ సైన్యంపై దాడి చేసి కల్నల్, మేజర్, డీఎస్పీ, రైఫిల్‌మెన్‌ను హత్య చేశారు. ఆ సమయంలో కేబినెట్ సమావేశం నిర్వహించి జీ20 సమావేశాలు విజయవంతం చేశామని సంబురాలు చేసుకున్నారు.

➡ మణిపూర్, కశ్మీర్‌లో అంతర్గత భద్రతకు భంగం ఒకవైపు, చైనా ఆక్రమణ మరోవైపు. భారత ప్రధాని, చైనా అధ్యక్షుడు చర్చలు జరిపినా ఉపయోగం లేదు. చైనా ఇంచు కూడా వెనక్కు తగ్గలేదు. చైనా పూర్వ స్థితిలోనే ఉందని మొన్నటివరకు అనుకున్నాం. కానీ నానాటికీ చైనా ఆక్రమణ ప్రమాదకర స్థాయికి వెళుతోంది. మనం భూభాగాన్ని కోల్పోతున్నాం.

➡ వన్ నేషన్ వన్ ఎలక్షన్ అంటే రాజ్యాంగంపై దాడి చేయడమే. మేం దాన్ని తిరస్కరిస్తున్నాం. ఇది జరగాలంటే ఐదు రాజ్యాంగ సవరణలు జరగాలి. ఇలా చేసేందుకు తగిన సంఖ్యాబలం కావాలని బీజేపీకి కూడా తెలుసు. కానీ, ప్రజల దృష్టిని సమస్యల నుంచి మరల్చేందుకే ఇలాంటి చర్చను కేంద్రం తెరపైకి తెస్తోంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నియామక బిల్లుకు సవరణను ఈ సమావేశాల్లో పెడుతున్నారని తెలిసింది. ఎన్నికల కమిషన్ స్వతంత్రతను దెబ్బతీసే ఈ బిల్లును మేం వ్యతిరేకిస్తాం.

➡ రెండో విడత భారత్ జోడో యాత్ర తూర్పు నుంచి పశ్చిమ దిశగా జరగాలని సీడబ్ల్యూసీ సభ్యులు అడిగారు. దీన్ని సీడబ్ల్యూసీ పరిగణనలోకి తీసుకుంటుంది.

➡ సీడబ్ల్యూసీ సభ్యులందరూ ఇండియా కూటమి ఏర్పాటును స్వాగతించారు. సీట్ల సర్దుబాటు త్వరగా చేయాలని ఒకరిద్దరు సభ్యులు చెప్పారు. కానీ, ఆ సర్దుబాటు పని సీడబ్ల్యూసీది కాదు. 14 మంది సభ్యుల ఇండియా ఎగ్జిక్యూటివ్ కమిటీది.

➡ తెలంగాణలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఇక్కడ సమావేశాలు నిర్వహించడం వెనుక కచ్చితంగా రాజకీయ ప్రాధాన్యత ఉంటుంది. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల నాయకులందరూ సీడబ్ల్యూసీ సమావేశంలో మాట్లాడారు. వారి రాష్ట్రాల పరిస్థితుల గురించి చెప్పారు.

➡ సనాతన ధర్మంపై సీడబ్ల్యూసీలో ఎలాంటి చర్చ జరగలేదు. మేము సర్వధర్మ సంభావ్‌ను నమ్ముతాం. తాము మాట్లాడింది మతాల గురించి కాదని, కుల వ్యవస్థ, కులాల పేరుతో అణచివేత, మహిళలు, దళితుల అణచివేత గురించి మాట్లాడామని డీఎంకే వర్గాలు చెప్పాయి. మేం ఆ వివాదంలోకి వెళ్లం.

➡ ఇండియా అంటేనే భారత్. ఇండియా భారత్‌గా మారినందుకు మీ జీవితాల్లో, మీ పిల్లల జీవితాల్లో, మీ ఆర్థిక, ఆరోగ్య పరిస్థితుల్లో ఏమైనా మార్పులు వచ్చాయా? ఇవన్నీ తప్పుడు వివాదాలు. అంబేడ్కర్ చెప్పినట్టు ఇండియా అంటేనే భారత్. మేం దాన్నే నమ్ముతాం.

➡ గ్యాస్ ధరలు తగ్గించవచ్చు. క్రూడ్ ఆయిల్, అసోసియేటెడ్ గ్యాస్ ధరలు తగ్గినప్పుడు కూడా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించవచ్చు. కానీ ఈ ధరలు పెంచడం ద్వారా కేంద్రం లబ్ధిపొందింది. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తే ప్రజలకు ఉపశమనం కలుగుతుంది. అందుకే ఆ వాగ్దానాన్ని మేము ప్రజలకు ఇస్తున్నాం.

కూటమిగా.. దీటుగా..

▶ మొదటి పేజీ తరువాయి

చర్చించి తీర్మానాలు చేసింది.

సీడబ్ల్యూసీ నిర్ణయాలివీ...

1. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన ఆర్మీ, పోలీసు అధికారులకు సీడబ్ల్యూసీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. ఇలాంటి విషాద సమయంలో జాతి మొత్తం మౌనం పాటిస్తున్న తరుణంలో బీజేపీ, ప్రధానమంత్రి జీ–20 సమావేశాల విజయవంతం పేరుతో సంబురాలు చేసుకుని వారిని వారే అభినందించుకోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది.
2. ఏడాది కాలంగా సమర్థవంతంగా బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సీడబ్ల్యూసీ అభినందించింది. ఆయన స్ఫూర్తివంతమైన నాయకుడని, సామాజిక న్యాయం కోసం రాజీలేని గొంతుకను వినిపిస్తున్నారని కొనియాడింది.
3. దేశ ప్రజలను ఐక్యం చేసి జాతీయ రాజకీయాల్లో మార్పు తెచ్చేలా రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రారంభమై ఏడాది గడుస్తున్న సందర్భంగా సీడబ్ల్యూసీ హర్షం వ్యక్తం చేసింది. భారత్‌జోడో యాత్ర స్ఫూర్తిని పార్టీలోని అన్ని స్థాయిల్లో కొనసాగించాలని, యాత్ర ఉద్దేశాన్ని ప్రజల్లో కొనసాగించాలని తీర్మానించింది. రాహుల్ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం ప్రధాని చేపట్టిన రాజకీయ కక్షసాధింపు చర్య అని, మళ్లీ ఆయన సభ్యత్వం పునరుద్ధరణతో న్యాయం, ధర్మం గెలిచాయని పేర్కొంది.
4. మణిపూర్‌లో అధికార యంత్రాంగం కుప్పకూలి హింస కొనసాగడంపై సీడబ్ల్యూసీ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధాని మౌనం, నిర్లక్ష్యం, హోం మంత్రి వైఫల్యం, సీఎం మొండితనమే ఇంతటి దారుణానికి తెరతీసిందని ధ్వజమెత్తింది.
5. కుల, మత, ప్రాంతీయ తత్వాలపై పదేళ్ల మారటోరియం ప్రకటించాలని ప్రధాని తన మొదటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చెప్పినప్పటికీ సమాజంలో ఈ మూడు దురాచారాలు పేట్రేగిపోతున్నాయని సీడబ్ల్యూసీ అభిప్రాయపడింది.
6. పంటలకు మద్దతు ధరతోపాటు ఇతర అంశాలపై రైతులు, రైతుసంఘాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రధానికి సీడబ్ల్యూసీ మరోమారు గుర్తు చేసింది.
7. పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసరాల ధరల పట్ల సీడబ్ల్యూసీ ఆందోళన వ్యక్తం చేసింది. పదేళ్లకోసారి చేపట్టే జనగణనను 2021లో నిర్వహించకపోవడం సిగ్గుచేటని పేర్కొంది. వెంటనే కులగణన చేపట్టి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్ల గరిష్ట పరిమితిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.
8. కొత్త రాజ్యాంగ రూపకల్పన ప్రతిపాదనను సీడబ్ల్యూసీ తిరస్కరించింది. రాజ్యాంగ మౌలిక స్వరూపం మార్చాలనే ప్రయత్నాన్ని రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించింది. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను కాపాడేందుకు ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చింది.
9. ప్రజాస్వామ్య దేశంలో చట్టాలు రూపొందించే సమయంలో జరగాల్సిన చర్చ పార్లమెంటు సాక్షిగా కనుమరుగైందని సీడబ్ల్యూసీ మండిపడింది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిపేందుకు ఎన్నికల సంఘానికి ఉండాల్సిన స్వయంప్రతిపత్తి కోల్పోయేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన, ఇతర కమిషనర్ల నియామక బిల్లు ఉందని మండిపడింది. ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లు ప్రవేశపెట్టడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని, ఈ సమావేశాల్లోనే మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేసింది.
10. ప్రధానికి సన్నిహితుడైన ఆదానీ గ్రూపుపై వస్తున్న ఆరోపణలపై విచారించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది.
11. ఒకే దేశం–ఒకే ఎన్నిక (జమిలి ఎన్నికలు) విధానం దేశ సమాఖ్య వ్యవస్థపై తీవ్రమైన దాడిగా సీడబ్ల్యూసీ అభివర్ణించింది. రాష్ట్రాల హక్కులను హరించేలా కేంద్రం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని, విపత్తు సహాయ నిధులివ్వడంలోనూ వివక్ష పాటిస్తోందని ఆక్షేపించింది.
12. చైనాతో ఉన్న సరిహద్దు వివాదాలను వెంటనే పరిష్కరించుకోవాలని, దేశ భౌగోళిక సమగ్రతను దెబ్బతీసే ధోరణిలో ఎదురయ్యే అన్ని సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలని సూచించింది.
13. మతసామరస్యం, సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించే, యువత ఆకాంక్షలను నెరవేర్చి అంతర్జాతీయ సమాజం గర్వించేలా దేశాన్ని నిర్మించేందుకు కట్టుబడి ఉన్నట్టు సీడబ్ల్యూసీ ప్రకటించింది. కులం–మతం, ధనిక–పేద, యువకులు–వృద్ధులు లాంటి భేదాల్లేని జాతి నిర్మాణానికి కృషి చేస్తామని తీర్మానించింది.
14. ఇండియా కూటమి ఏర్పాటును సీడబ్ల్యూసీ స్వాగతించింది. ఈ కూటమి ఏర్పాటు ప్రధానితోపాటు బీజేపీకి భయాందోళనలు కలిగించిందని ఎద్దేవా చేసింది. ఇండియా కూటమిని ఒక సైద్ధాంతిక, ఎన్నికల విజయంగా తీర్చిదిద్దడం ద్వారా దేశంలో విభజన, విద్వేష రాజకీయాలకు చరమగీతం పాడాలని పేర్కొంది. సామాజిక అసమానతలను రూపుమాపి న్యాయాన్ని బలోపేతం చేయడంలో కూటమి కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించింది.

పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి..

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడంతో తొలిరోజు సీడబ్ల్యూసీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశంలో ఖర్గేతోపాటు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ప్రసంగించారు. ఈ సమావేశాలకు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతోపాటు పలువురు సభ్యులు హాజరయ్యారు. ఖర్గే అధ్యక్షతన భారత్‌జోడో ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్‌రంజన్ చౌదరి, సీడబ్ల్యూసీ సభ్యులు ఏకే ఆంటోని, పి.చిదంబరం, కేసీ వేణుగోపాల్, అంబికా సోని, దిగ్విజయ్‌సింగ్, జైరాంరమేశ్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు అశోక్‌గహ్లోత్, సిద్ధరామయ్య, భూపేశ్‌భగేల్‌తోపాటు సుఖ్వీందర్‌సింగ్ సుఖు, రాజీవ్‌శుక్లా, దామోదర రాజనర్సింహ, రఘువీరారెడ్డి యాదవ్, వంశీచందర్‌రెడ్డి, సుబ్బిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశాలకు ఆతిథ్యమిస్తున్న తెలంగాణ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. కాగా, త్వరలో ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో పార్టీ స్థితిగతులకు సంబంధించిన నివేదికలను ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు సీడబ్ల్యూసీ సమావేశంలో అందజేశారు. ఈ నివేదికలపై ఆదివారం కమిటీ చర్చించనుందని సమాచారం.

ప్రజా సమస్యలతోనే ముందుకెళ్లాలి

- సభలు, తీర్మానాలతో సరిపెడితే ఫలితం ఉండదు
- బీజేపీ విద్వేష రాజకీయాలపై ఫోకస్
- ప్రజల్లో స్పందన వచ్చింది..కర్ణాటక ఎన్నికలకు ఆరు నెలలు కసరత్తు చేశాం : రాహుల్‌గాంధీ

సాక్షి, హైదరాబాద్: సమస్యలే ఎజెండాగా ముందుకు వెళితేనే ప్రజలు ఆదరిస్తారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. సభలు, సమావేశాలు, తీర్మానాలు చేసి కూర్చుంటే ఫలితం రాదని వ్యాఖ్యానించినట్టు సమాచారం. సీడబ్ల్యూసీ సభ్యులను ఉద్దేశించి ఆయన శనివారం రాత్రి మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాలు ఏ విధంగా అణచివేతకు గురవుతున్నారో వారి సమస్యలను తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కేడర్ బేస్డ్ అన్న ఆలోచనతోనే ఉంటే కష్టమని, ప్రజామూవ్‌మెంట్‌తోనే వెళ్లాలని చెప్పారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా బీజేపీ విద్వేష రాజకీయాలను స్పష్టంగా చెప్పగలిగామని, విద్వేషంతో దేశాన్ని ఎలా ప్రమాదంలోకి నెడుతున్నారన్న అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా వారు ఆదరించారని రాహుల్‌గాంధీ తన అనుభవాలను వివరించారు. కర్ణాటక ఎన్నికలకు ఆరు నెలలుపాటు తీవ్రంగా శ్రమించినట్టు తెలిపారు. అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కాంగ్రెస్ పార్టీ ఎజెండాగా తీసుకున్నదని, ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, అధికారంలోకి వస్తే ఏఏ వర్గాలకు ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తామో స్పష్టం చేయడం, నాయకులు సమష్టిగా పనిచేయడం వల్ల విజయం సాధ్యమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడం ఖాయమని, ఇండియా కూటమి విజయం సాధిస్తుందని, అయితే విజయం సాధించడమే కాక, దేశానికి ఏం చేయాలన్న అంశంపై రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకుందామని ఆయన సూచించారు.

గెలుపే ధ్యేయంగా ముందుకు!

- రాష్ట్రంలో అధికారంలోకి రావాల్సిందే.. టీపీసీసీ నేతలతో సోనియా
- మళ్లీ సమయం ఇస్తానని హామీ.. రాహుల్, ప్రియాంకల సేవలకు గ్రీన్‌సిగ్నల్



అభివాదం చేస్తున్న రాహుల్, సోనియా. చిత్రంలో ప్రియాంక గాంధీ

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన పార్టీగా ఈసారి ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణలో అధికారాన్ని దక్కించుకోవాలని.. ఆ దిశగా తీవ్రంగా శ్రమించాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ రాష్ట్ర నాయకత్వానికి సూచించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు సానుకూలత కనిపిస్తోందని.. తెలంగాణలోనూ పరిస్థితి అనుకూలంగా ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో వచ్చే నాలుగు నెలల పాటు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అధికారమే లక్ష్యంగా ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించారు. తొలిరోజు సీడబ్ల్యూసీ సమావేశాల ప్రారంభానికి ముందు.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్, సీఎల్పీ నేత భట్టి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేలతో సోనియా కొద్దిసేపు మాట్లాడారు. తెలంగాణలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారి మధ్య ఎన్నికల కోణంలో చర్చ జరిగిందని.. తెలంగాణలో ఈసారి గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలని టీపీసీసీ నేతలకు సోనియా దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో గ్యారంటీ కార్డు స్కీమ్‌ల హామీ బాగా పనిచేసిందని.. ఆదివారం ఇక్కడి సభలో ప్రకటించబోయే గ్యారంటీ కార్డు స్కీమ్‌లను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్టు సమాచారం. హామీలివ్వడమే కాదు, అమలుకు కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందని ప్రజల్లో భరోసా కల్పించాలని.. కర్ణాటకలో ఇప్పటికే నాలుగు గ్యారంటీ కార్డు స్కీమ్‌ల అమలు, హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ విధానం పునరుద్ధరణ వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించినట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ కోసం తాను తగిన సమయం ఇస్తానని.. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో పాటు రాహుల్, ప్రియాంకల సేవలను వినియోగించుకోవాలని సూచించినట్టు సమాచారం.

రాష్ట్రమిచ్చాం.. ప్రగతి పథంలోకి తీసుకెళ్లాలి

పీసీసీ నేతలతో మాట్లాడిన సందర్భంగా సోనియాగాంధీ కీలక వ్యాఖ్యలు చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ''మనం తెలంగాణ ప్రజలకు వాగ్దానం చేశాం. ఆ వాగ్దానానికి అనుగుణంగా 2014లో తెలంగాణ ఏర్పాటు చేశాం. అలాంటి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతి, శ్రేయోపథంలోకి తీసుకెళ్లాలి. సీడబ్ల్యూసీ సమావేశాల సాక్షిగా తెలంగాణలో నూతన అధ్యాయం ప్రారంభం కావాలి. అభివృద్ధితోపాటు ఆత్మగౌరవంతో బతికేలా తెలంగాణను, దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి..'' అని సోనియా పేర్కొన్నారని వివరించాయి.

కుంభకోణాలపై బీఆర్ఎస్ చర్చకు సిద్ధమా?

- సాక్షాత్తు రాష్ట్ర రాజధానిలో పరిస్థితి అధ్వానం
- జోడోయాత్రతో సమస్యలపై చర్చ ప్రారంభమైంది
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మీడియాసెల్ చైర్మన్ పవన్ ఖేరా



సాక్షి,హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేసిన అవినీతి, కుంభకోణాలపై చర్చకు సిద్ధమా అని కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ సభ్యుడు, ఏఐసీసీ మీడియా ప్రచార విభాగం చైర్మన్ పవన్‌ఖేరా సవాల్ చేశారు. శనివారం సీడబ్ల్యూసీ సమావేశాల సందర్భంగా హోటల్ తాజ్‌దక్కన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సాక్షాత్తు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనే రోడ్ల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందంటే, మారుమూల ప్రాంతాల పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలైందని, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలు కూడా ప్రారంభమైందని గుర్తుచేశారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ సమర్థతపై మాట్లాడే సీఎం కుమార్తె కవిత ముందు తాను గత ఎన్నికల్లో ఓడిపోయిన అంశంపై ఆలోచించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేయని వాగ్దానాలపై దృష్టి సారించాలన్నారు. గౌతమ్ అదానీ గురించి ఎందుకు నోరు విప్పరని, తాము బీఆర్ఎస్ కుంభకోణాలు బయటపెడితే కనీసం మీడియా ముందు మొహం చూపించలేరని దుయ్యబట్టారు.

మనోభావాలు దెబ్బతింటున్నాయి

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వతీరుతో భారతసైన్యం మనోభావాలు దెబ్బతింటున్నాయని పవన్‌ఖేరా ఆందోళన వ్యకం చేశారు. ఒకవైపు చైనా భూభాగంలో మన సైన్యం ప్రాణాలు అర్పిస్తుంటే, ప్రధాని వేడుకల్లో మునగడం సిగ్గుచేటని విమర్శించారు. మోదీ కనీసం ట్వీట్ ద్వారా కూడా స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. భారత భూభాగాన్ని ఆక్రమించుకున్న చైనాకు క్లీన్‌చిట్ ఇవ్వడం సైనికుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతోంది

రాహుల్ జోడోయాత్ర తర్వాత కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతోందన్నారు. భారత జోడో యాత్రతో ప్రజాసమస్యలపై చర్చ ప్రారంభమైందని, కేంద్రంలోని బీజేపీ గందరగోళంలో పడిందని చెప్పారు. జోడోయాత్రతో భారత్ ఐక్యమవుతోంది..'ఇండియా' గెలుస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతాయని, సీడబ్ల్యూసీ సమావేశాల్లో కీలకమైన అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

'ఇండియా' కూటమి దూకుడు

- దేశ సమస్యల విషయంలో ఏకతాటిపై 27 పార్టీలు: ఖర్గే
- అందుకే విపక్షాలపై మోదీ ప్రభుత్వం ప్రతీకార చర్యలకు దిగుతోంది
- సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడమే పనిగా పెట్టుకుంది
- అంతర్గత సవాళ్లతో దేశం దిక్కుతోచని స్థితిలో చిక్కుకుంది
- సీడబ్ల్యూసీలో ప్రారంభోపన్యాసం చేసిన ఏఐసీసీ అధ్యక్షుడు



సీడబ్ల్యూసీ భేటీలో ఖర్గేతో ముచ్చటిస్తున్న సోనియా గాంధీ. చిత్రంలో అంబికా సోని

సాక్షి, హైదరాబాద్: దేశం ముందున్న మౌలిక సమస్యల విషయంలో 'ఇండియా' కూటమిలోని 27 పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన మూడు సమావేశాలూ విజయవంతం కావడంతో ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వంపై పోరులో కూటమి దూసుకుపోతోందన్నారు. ఈ పరిణామాలతో కలత చెందిన బీజేపీ ప్రభుత్వం విపక్ష పార్టీలపై ప్రతీకార చర్యలకు దిగిందని మండిపడ్డారు. పార్లమెంట్‌లో విపక్షాల గొంతునొక్కడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు.. కేంద్ర ప్రభుత్వ ఉద్దేశాలపై ఆందోళనలు రేకెత్తిస్తున్నాయన్నారు. శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. సీడబ్ల్యూసీకి కొత్తగా ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో అంతర్గత సవాళ్లతో దేశం దిక్కుతోచని స్థితిలో చిక్కుకుందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మణిపూర్ అల్లర్లు, పెరుగుతున్న సామాజిక అసమానతలు, దిగజారుతున్న రైతులు, కార్మికుల పరిస్థితులు వంటి మౌలిక సమస్యల పరిష్కారంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. లౌకిక, ప్రగతిశీల, ఆధునిక భారత దేశ ప్రతిష్టను ఈ ఘటనలు మంటగలిపేస్తున్నాయన్నారు.

దృష్టి మళ్లించడమే పని

ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే కేంద్రం ఆత్మనిర్భర్ భారత్, 5 ట్రిలియన్ ఎకానమీ, న్యూ ఇండియా 2022, అమ్రిత్‌కాల్, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ వంటి ఊకదంపుడు హామీలు ఇస్తోందని ఖర్గే ధ్వజమెత్తారు. దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రమాదంలో ఉందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకడంతో సామాన్య, పేదల బతుకులు కుదేలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధనిక, పేద వర్గాల మధ్య ఆర్థిక అసమానతలు పతాక స్థాయిలో పెరిగిపోయాయని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశం నిర్మించుకున్న ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థలను తమ మిత్రులైన పెట్టుబడిదారులకు మోదీ ప్రభుత్వం అప్పనంగా ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో చైనా ఆక్రమణల పట్ల కేంద్రం నిర్లక్ష్యం వహించడంతో దేశ భద్రత పెనుప్రమాదంలో పడిందన్నారు.

అంతర్గత చర్చలపై గోప్యత పాటించాలి

దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందని ఖర్గే పునరుద్ఘాటించారు. తొమ్మిదిన్నరేళ్లుగా ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ కీలక పాత్ర పోషిస్తోందని, సామాన్యుల ఆందోళనలు, సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పోరాడుతోందని స్పష్టం చేశారు. దేశ ప్రజల గొంతు వినిపించడం ప్రధాన ప్రతిపక్షంగా తమ బాధ్యత అన్నారు. పార్టీ జరిపే అంతర్గత చర్చల విషయంలో గోప్యతను పాటించాలని, బయటికి పొక్కకుండా జాగ్రత్తలు వహించాలని నేతలకు సూచించారు. త్వరలో జరగనున్న శాసనసభ, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఆదివారం జరిగే సమావేశంలో విస్తృతంగా మాట్లాడతానంటూ ఖర్గే తన ప్రసంగాన్ని ముగించారు.



శనివారం తిరుమల శ్రీవారిని హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి

అడ్డంగా దొరికిపోయి.. జడ్జిలపై నిందలా!

'కోర్టు తీర్పులపై రాజకీయాలు–వక్ర భాష్యాలు' సదస్సులో వక్తలు



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): 'అడ్డగోలుగా తప్పులు చేసి సాక్ష్యాధారాలతో అడ్డంగా దొరికిపోయి.. ఆ కేసుల్లో తీర్పు చెప్పిన జడ్జిలపై నిందలు వేస్తారా' అంటూ టీడీపీ నాయకులు, ఆ పార్టీ అనుకూల మీడియాను పలువురు వక్తలు ప్రశ్నించారు. విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో ఆంధ్రా అడ్వకేట్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో 'కోర్టు తీర్పులపై రాజకీయాలు–వక్ర భాష్యాలు' అనే అంశంపై శనివారం సదస్సు జరిగింది. ఫోరం కన్వీనర్ బి.అశోక్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో న్యాయవాదులు, న్యాయ నిపుణులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, మేధావులు పాల్గొన్నారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించిన నాటి నుంచి టీడీపీ నాయకులు, అనుకూల మీడియా న్యాయవ్యవస్థపై, జడ్జిలపై విమర్శలు చేయడాన్ని వక్తలు ఖండించారు. జడ్జిలపై వ్యక్తిత్వ హననం చేసేలా ఉన్న వ్యాఖ్యలను కోర్టులు సుమోటోగా తీసుకోవాలన్నారు. తీర్పులు తమకు అనుకూలంగా వస్తే ఒక విధంగా, వ్యతిరేకంగా వస్తే మరో విధంగా జడ్జిలపై నిందలు వేస్తూ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. కోర్టు సాక్ష్యాధారాలు చూస్తుందని, చంద్రబాబు కేసులో పూర్తి సాక్ష్యాధారాలు చూపినందు వల్లే కోర్టు ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. సదస్సు అనంతరం న్యాయవ్యవస్థపై నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన పాఠశాలల విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. సదస్సులో వివిధ సంఘాల ప్రతినిధులు ఎం శ్రీనివాసరెడ్డి, బడేజానీ, హృదయరాజు, ఎం.కోటేశ్వరరావు, వలిపర్తి బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ గాంధీతో కరచాలనం చేస్తున్న రఘువీరారెడ్డి. చిత్రంలో సుబ్బరామిరెడ్డి

సీడబ్ల్యూసీ సైడ్ లైట్స్

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల కోసం కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకా గాంధీలు ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. వారి వెంట ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఉన్నారు. వారికి విమానాశ్రయం వద్ద ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీనేత భట్టి విక్రమార్క తదితరులు ఘన స్వాగతం పలికారు.
- సోనియాగాంధీ, ప్రియాంక, ఖర్గేలు విమానాశ్రయంలో అరైవల్ లాంజ్ నుంచి బయటి వరకు ఎలక్ట్రిక్ వాహనంలో వచ్చారు.
- సమావేశాలు జరుగుతున్న హోటల్ తాజ్‌కృష్ణ వద్ద అతిథులకు తెలంగాణ సంప్రదాయ నృత్యాలు, కళా బృందాలతో స్వాగతం పలికారు. కళాకారులతోపాటు ఎమ్మెల్యే సీతక్క నృత్యం చేశారు.
- అతిథులకు తాజ్ కృష్ణతోపాటు తాజ్ డెక్కన్, తాజ్ బంజారా, హయత్ ప్యాలెస్ తదితర హోటళ్లలో బస ఏర్పాటు చేశారు.
- కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ ముఖ్యమంత్రులు సిద్ధరామయ్య, భూపేశ్ బఘేల్, అశోక్ గహ్లోత్, రాజస్తాన్ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్, పార్టీ కేంద్ర నేతలు చిదంబరం, వీరప్ప మొయిలీ తదితరులతోపాటు సుమారు 39 మంది సీడబ్ల్యూసీ సభ్యులు హాజరయ్యారు.
- హోటల్ తాజ్ కృష్ణలో మధ్యాహ్నం భోజనాల తర్వాత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీడబ్ల్యూసీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. రాత్రి వరకు భేటీ సాగింది.
- సీడబ్ల్యూసీ భేటీ నేపథ్యంలో కీలక నేతలకు స్వాగతం పలుకుతూ హైదరాబాద్‌లో పెద్దఎత్తున కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రాత్రి డిన్నర్ తర్వాత సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.
- శనివారం చిదంబరం పుట్టినరోజు కావడంతో సీడబ్ల్యూసీ సభ్యులందరూ శుభాకాంక్షలు తెలిపారు.
- రెండురోజులుగా ఎయిర్‌పోర్టులోనే స్వాగత కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులతో ఎయిర్‌పోర్టు కిక్కిరిసిపోయింది.

సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే

ప్రజా ధనం దోచేసిన వాళ్లను జైల్లో కాక మరెక్కడ పెట్టాలి? బాబు అవినీతిపై నిప్పులు చెరిగిన ఏపీ సీఎం జగన్

- రూ.371 కోట్ల ప్రజా ధనం ఎక్కడికి పోయింది?
- లేని కంపెనీ ఉన్నట్టు ఫేక్ అగ్రిమెంటుతో దోపిడీ
- అడ్డంగా దొరికినా అడ్డగోలు వాదనలు
- సాక్ష్యాధారాలతో కేంద్ర దర్యాప్తు సంస్థలకు దొరికినా బుకాయింపే
- బాబు దొంగతనాల్లో వారంతా వాటాదారులే
- అందుకే నిజాలు మాట్లాడటం లేదు
- చట్టం అందరికీ సమానమని చెప్పలేరు
- ప్రశ్నిస్తా అన్నవాడు ములాఖత్‌లో మిలాఖతై పొత్తు

ఇవాళ రూ.371 కోట్లు ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ ధనం ఎక్కడికి పోయింది? చంద్రబాబు నడిపిన కథలో చంద్రబాబును కాక మరెవరిని అరెస్టు చేయాలి? ఈ విషయంలో ఈ దొంగల ముఠా సభ్యులు నోరెత్తరు. ఎల్లో మీడియాకు ఇది కనిపించదు. కారణం దొంగ వాళ్ల వాడే కాబట్టి. వాటాలు పంచుతాడు కాబట్టి నోరు విప్పరు. పైగా నిస్సిగ్గుగా పేపర్లో ఎడిటోరియల్స్ రాస్తారు. మా బాబు లంచాలు తీసుకుంటే తప్పేంటని ఒకరు చెత్త పలుకులు రాస్తే.. మరొకరు బాబు అవినీతిని దాచడానికి అష్టకష్టాలు పడుతున్నారు. నేరుగా జైలుకు వెళ్లి ములాఖత్‌లో మిలాఖత్ చేసుకుని పొత్తు పెట్టుకునేవారు ఇంకొకరు. ఎలాంటి మనుషులున్నారో ఆలోచించండి. ప్రజల సొమ్ము, ఇంత అడ్డగోలుగా ఎలా దోచేశారు? ఎవరి జేబులోకి ఈ డబ్బులు పోయాయి? దోచేసిన వాళ్లను జైళ్లలో పెట్టకపోతే మరెక్కడ పెట్టాలి? అని ప్రశ్నించాల్సిన వారు ములాఖత్‌లో మిలాఖత్ అయిపోతే పరిస్థితి ఏమిటని ఆలోచన చేయండి. వీళ్లందరి కందకావరం ఏమిటంటే.. మాకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ- 5 అండగా ఉంది.. ఓ దత్తపుత్రుడి సపోర్టు ఉంది.. కాబట్టి మేం దోచేసి పంచుకున్నా కూడా ఎవరూ మాట్లాడరనే ధీమా వాళ్లకుంది. చంద్రబాబు నడిపిన అవినీతి స్కామ్‌లో బాబును కాక మరెవరిని అరెస్టు చేయాలి?

- సీఎం వైఎస్ జగన్



తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో కాపు నేస్తం చెక్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం జగన్

నిడదవోలు నుంచి సాక్షి ప్రతినిధి : 'స్కిల్ స్కామ్ సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే. ఫేక్ అగ్రిమెంట్‌తో ప్రభుత్వ ఖజానా దోచేశారు. సీమెన్స్ కంపెనీ మాకు సంబంధం లేదని చెప్పింది. ఎన్ని దొంగతనాలు చేసినా, ఎంత దోపిడీ చేసినా, ఎన్ని వెన్నుపోట్లు పొడిచినా చంద్రబాబునాయుడు అనే వ్యక్తిని రక్షించుకునేందుకు పలుకుబడి కలిగిన దొంగల ముఠా సభ్యులు ఉన్నారు. చంద్రబాబును వెనకేసుకు వచ్చిన వారంతా గజదొంగలే. రూ.371 కోట్ల ప్రజా ధనం దోచేసిన వాళ్లను జైల్లో కాకుండా మరెక్కడ పెట్టాలి? పవన్, ఎల్లో మీడియా.. బాబును వెనకేసుకు రావడానికి కారణం వాళ్లు కూడా దొంగల ముఠాలో వాటాదారులు కావడమే' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో కాపునేస్తం నిధుల విడుదల సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు అవినీతిని ఆయన తూర్పారబట్టారు. 'ప్రజలను వంచించి 45 ఏళ్లుగా దోపిడీనే రాజకీయంగా మార్చుకుని ఇటీవలే అవినీతి కేసులో సాక్ష్యాధారాలతో అరెస్టు అయిన ఒక మహానుభావుడి గురించి నాలుగు మాటలు చెబుతాను. చట్టం ఎవరికైనా ఒక్కటే. దురదృష్టమేమిటంటే ఎన్ని దొంగతనాలు చేసినా, ఎంత దోపిడీ చేసినా, ఎన్ని వెన్నుపోట్లు పొడిచినా చంద్రబాబునాయుడు అనే వ్యక్తిని రక్షించుకునేందుకు పలుకుబడి కలిగిన దొంగల ముఠా సభ్యులు రంగంలోకి దిగారు. ఒక మామూలు వ్యక్తి ఇదే తప్పు చేస్తే ఏ రకమైన శిక్ష పడుతుందో.. తప్పు చేస్తే అధికారంలో ఉన్న వాళ్లకు కూడా అదే శిక్ష పడాలని, చట్టం ఎవరికైనా ఒకటే అని చెప్పే వారే ఇంతకాలం లేరు. ఇప్పుడు చట్టం ఎవరికైనా ఒక్కటే అని చెప్పే గొంతుకలు గళం విప్పుతున్నాయి. ఇలా గళం విప్పడాన్ని ఈ దొంగల ముఠా సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు, తట్టుకోలేకపోతున్నారు' అని అన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఓటుకు కోట్లు గుర్తుండే ఉంటుంది..

- తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల కోసం కోట్లు ఇస్తూ చంద్రబాబు దొంగగా అడ్డంగా, నిలువుగా దొరికిన విషయం మీ అందరికీ గుర్తుండే ఉంటుంది. నల్లధనం ఇస్తూ ఆడియో, వీడియో టేపులతో అడ్డంగా దొరికారు. చివరికి ఆ ఆడియో టేపుల్లో ఉన్న వాయిస్ చంద్రబాబుదే అని ఫోరెన్సిక్ వాళ్లు సర్టిఫికెట్ ఇచ్చారు.
- తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులు ఇస్తూ దొరికినప్పుడు అది దోపిడీ సొమ్ము అని ప్రజలందరికీ అర్థం అయింది. అయినా కూడా బాబు చేసింది అసలు నేరమే కాదని వాదించడానికి.. 10 కోట్ల మంది ప్రజల కళ్లకు గంతలు కట్టడానికి ఆ దొంగతనాల్లో వాటాదారులు పది మంది వెంటనే సిద్ధం అయ్యారు. అరడజను ఎల్లో ఛానెళ్లు, రెండు ఎల్లో పత్రికలు రెడీగా నిలబడ్డాయి.
- కానీ నిజం నిర్భయంగా చెప్పడానికి ఈ పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న వారిలో ఏ ఒక్కరూ సిద్ధంగా లేరు. ఎందుకంటే బాబు దొంగతనాల్లో వీళ్లు కూడా వాటాదారులు కాబట్టి. ఇంత అడ్డగోలుగా నల్లధనం ఇస్తూ ఆడియో, వీడియో టేపుల సాక్షిగా దొరికినా, ఆ వాయిస్ చంద్రబాబుదే అని ఫోరెన్సిక్ వాళ్లు నిర్ధారించినా వారు నీతి, న్యాయం, ధర్మం వైపు నిలబడాలా? దొంగల వైపు నిలబడాలా? ఆలోచన చేయండి.

ఆధారాలు చూపిస్తున్నా బుకాయింపే

- లేని కంపెనీని ఉన్నట్టుగా ఒక ఫేక్ అగ్రిమెంటు సృష్టించి, ప్రభుత్వ నిబంధనలు అన్నింటినీ సాక్షాత్తూ చంద్రబాబే పక్కన పెట్టించారు. చివరకు ఆ సీమెన్స్ కంపెనీయే మాకు రూ. 371 కోట్ల డబ్బు ముట్టలేదని, ఆ అగ్రిమెంట్‌తో మాకు ఎలాంటి సంబంధం లేదని లిఖిత పూర్వకంగా చెప్పింది.
- సాక్ష్యాత్తు కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రూ. 371 కోట్ల స్కిల్ స్కాంలో ఆ ఫేక్ అగ్రిమెంట్ చేసిన దొంగలను ఇప్పటికే అరెస్టు చేసింది. ఈ స్కిల్ స్కామ్ సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే అని చెప్పేందుకు సాక్ష్యాలు, ఆధారాలు, నోట్ ఫైల్స్ ఉన్నప్పటికీ.. బాబు స్వయంగా ఈ ఫేక్ అగ్రిమెంట్ నిబంధనలన్నింటికీ విరుద్ధంగా అధికారులంతా డబ్బులు ఇవ్వొద్దని సలహా ఇచ్చినా.. వాటిని కూడా పక్కన పెట్టారు.
- ఏకంగా 13 సందర్భాల్లో ఒత్తిడి తీసుకొచ్చి మరీ సంతకాలు పెట్టారు. సీఐడీ వారు ఇవన్నీ స్వయంగా చూపిస్తున్నా, ఆ డబ్బును డొల్ల సూట్ కేసు కంపెనీలకు ఎలా మళ్లించారో వివరిస్తున్నా ఈ దొంగల ముఠా ఒప్పుకోవడం లేదు.
- దీంతో సంబంధం ఉన్న వ్యక్తులతో సెల్‌ఫోన్లలో చాట్‌లు, ఈ మెయిల్స్‌తో చంద్రబాబు పీఏ అడ్డగోలుగా దొరికిపోయారు. ఐటీ విచారణలో, ఐటీఏఆర్‌లో బాబు పీఏ ఇచ్చిన స్టేట్‌మెంట్ విషయాలను ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ వాళ్లు చూపించి బాబాకు నోటీసులు ఇస్తున్నారు. చివరకు కోర్టుల్లో సుమారు పది గంటలపాటు ఇరువైపులా వాదనలు జరిగాయి. ఆ వాదనలు విని సాక్ష్యాలు, ఆధారాలు చూసిన తర్వాతే కోర్టు చంద్రబాబును రిమాండ్‌కు పంపించింది.
- ఇంత బాహాటంగా, అడ్డగోలుగా దొరికినా కూడా ప్రశ్నిస్తా.. ప్రశ్నిస్తా.. అన్నవాడు ప్రశ్నించడు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5.. ఈ ఎల్లో మీడియా పత్రికలు, టీవీ చానెళ్లు నిజాన్ని చూపించరు. వినిపించరు. నోరెత్తరు. మాట్లాడరు. పైగా నిస్సిగ్గుగా ఆ పని సబబే అని సపోర్టు చేస్తారు. మనం ఎలాంటి ప్రపంచంలో బతుకుతున్నామన్నది ఆలోచించండి.

మీరే నా బలం

మీ బిడ్డ దేవుడి దయను, మిమ్మల్ని తప్ప ఇతరులెవరినీ నమ్ముకోలేదు. జరగబోయేది కురుక్షేత్ర యుద్ధం. ఈ యుద్ధంలో న్యాయం, ధర్మం మీ బిడ్డ పక్షాన ఉంది. అన్యాయం, మోసం, వెన్నుపోట్లు అటువైపు ఉన్నాయి. మీ అందరినీ కోరేది ఒక్కటే. మీ బిడ్డ ప్రభుత్వంలో మీ ఇంట్లో మీకు మంచి జరిగిందా? లేదా? అన్నది మాత్రమే కొలమానంగా తీసుకోండి. మీ ఇంట్లో మీకు మంచి జరిగి ఉంటేనే మీ బిడ్డకు మీరే సైనికులు కావాలని మిమ్మల్ని కోరుతున్నాను. పేదల గుండె చప్పుడుగా, సామాజిక న్యాయానికి చిరునామాగా మీ బిడ్డ ప్రభుత్వం పని చేసింది. రాబోయే రోజుల్లో కూడా దేవుడి దయ వల్ల ఇంకా మెరుగైన పాలన సాగించేలా మీరంతా ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటున్నాను.

చెప్పకుండా శైలజ దేశం దాటారు

- చందాదారుల ప్రయోజనాలు కాపాడేందుకే లుక్ అవుట్ నోటీసులు
- దర్యాప్తునకు ఆమె సహకరించడంలేదు
- విదేశాలకు వెళ్తున్నట్లు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు
- విచారణను తప్పించుకోవడానికే అమెరికా వెళ్లారు
- 'మార్గదర్శి' కేసులో తెలంగాణ హైకోర్టులో ఏపీ సీఐడీ కౌంటర్



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ది భారీ కుంభకోణమని, ఈ కేసులో వేలాది చందాదారుల ప్రయోజనాలు కాపాడటం తమ బాధ్యత అని ఏపీ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. ఇంత పెద్ద స్కాంలో నిందితులుగా ఉన్న రామోజీరావు(ఏ–1), శైలజ (ఏ–2) దర్యాప్తునకు ఏమాత్రం సహకరించడం లేదని తెలిపింది. మూడుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదని చెప్పింది. దర్యాప్తు అధికారులు అడిగిన డాక్యుమెంట్లు, రికార్డులు చూపించడం లేదని తెలిపింది. అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా శైలజ దేశం దాటి వెళ్లారని, అందుకే ఆమెపై లుక్ అవుట్ నోటీసులు (ఎల్‌వోసీ) జారీ చేయాలని కేంద్రాన్ని కోరామని వెల్లడించింది. దర్యాప్తు నుంచి తప్పించుకోవడానికే అమెరికా పర్యటనను సాకుగా ఎంచుకున్నారని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆ సంస్థ ఎండీ సీహెచ్ శైలజ వేర్వేరుగా దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్లపై జస్టిస్ కె.సురేందర్ విచారణ చేపట్టారు. ఈ పిటిషన్లలో ఏపీ సీఐడీ కౌంటర్లు దాఖలు చేసింది. అనంతరం వాదనలకు పిటిషనర్ల తరఫు న్యాయవాది రెండు వారాల సమయం కోరడంతో న్యాయమూర్తి విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు. కౌంటర్‌లో ఏపీ సీఐడీ వెల్లడించిన కీలక వివరాలు..

సొంత ప్రయోజనాల కోసం వేల కోట్లు మళ్లించారు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లోని 37 బ్రాంచ్‌ల్లో ఆ సంస్థ రూ.25 వేల నుంచి రూ.కోటి వరకు చిట్‌లు నడుపుతోంది. వీటిలో చందాదారులు పెద్దఎత్తున పెట్టుబడి పెట్టారు. మార్గదర్శి చైర్మన్ రామోజీరావు, ఎండీ శైలజ, బ్రాంచ్ మేనేజర్లు వసూలు చేసిన వేల కోట్ల రూపాయల్ని అక్రమ మార్గాల్లో సొంత సంస్థల్లోకి, మ్యూచువల్ ఫండ్స్‌లోకి మళ్లిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. చందాదారులకు చెల్లింపుల్లో విఫలమయ్యారు. ఇవన్నీ నేరపూరిత కుట్ర, విశ్వాస ఉల్లంఘన, మోసం కిందికే వస్తాయి. మార్గదర్శి ఎండీ శైలజపై సీఐడీ ఏడు క్రిమినల్ కేసులు నమోదు చేసింది. దర్యాప్తు కీలక దశలో ఉంది. ఈ కేసులో మరిన్ని వివరాలు, కీలక ఆధారాలు తెలుసుకోవడానికి శైలజ విచారణ ప్రధానం. దర్యాప్తు సంస్థ ముందు హాజరై ఆమె వివరాలు వెల్లడించాల్సి ఉంది. ఏప్రిల్ 6న విచారణలో ఆమె సహకరించలేదు. అంతేకాదు అధికారులు అడిగిన ఆర్థిక లావాదేవీల రికార్డులు, డాక్యుమెంట్లు తీసుకురాలేదు. ఆమెకు రాజకీయంగా ఉన్నత స్థాయి వ్యక్తులతో ఉన్న పరిచయాలతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ చట్టం నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. దేశం విడిచి పారిపోయే అవకాశం కూడా ఉంది. ఇదే జరిగితే చందాదారులకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. వేలాది చందాదారుల ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు శైలజను అదుపులోకి తీసుకుని ఏపీ పోలీసులకు అప్పగించాలని ఇమ్మిగ్రేషన్ అధికారులను కోరాల్సివచ్చింది.

సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద ఏప్రిల్ 27న విచారణకు హాజరుకావాలని ఏప్రిల్ 22న నోటీసులు జారీ చేశాం. కుటుంబ వ్యవహారాల్లో పాల్గొనాల్సి ఉన్నందున ఏప్రిల్ 27 నుంచి మూడు నాలుగు వారాలు హాజరుకాలేనని ఏప్రిల్ 23న సమాధానం ఇచ్చారు. అనంతరం మే 12న, మే 22న రెండు సార్లు నోటీసులు జారీ చేసినా ఆమె నిరాకరించారు. ఆమె ఇంట్లోనే విచారణ చేపడతామని చెప్పినా అంగీకరించలేదు. అధికారులకు ఇచ్చిన సమాధానంలో ఎక్కడా అమెరికా వెళ్తున్న విషయం చెప్పలేదు. ఆ సమాచారాన్ని ఉద్దేశ్యపూర్వకంగా దాచి ఉంచారు. విచారణలో సహకరించకపోవడం, నోటీసులకు సమాధానం ఇవ్వకపోవడం, సమాచారం లేకుండా దేశం దాటి వెళ్లడం.. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎల్‌ఓసీ జారీ చేయాల్సి వచ్చింది. శైలజ చర్యలు రిజర్వు బ్యాంకు చట్టాలకు విరుద్ధం. బ్రాంచిలలో సోదాల సందర్భంగా అధికారులు పలు ఎల్రక్టానిక్ ఎవిడెన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిపై శైలజ నుంచి వివరణ తీసుకోవడం అత్యంత కీలకం. ఇంత పెద్ద ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు సాగుతుంటే.. విదేశాలకు వెళ్లడానికి ఆమె చెప్పిన కారణం ఓ సాకు మాత్రమే. ఈ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించలేదు అని సీఐడీ కౌంటర్‌లో తెలిపింది.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నేడు

రేపు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం వైఎస్ జగన్

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకురార్పణ జరగనుంది. శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడు. శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను విష్వక్సేనుడు పర్యవేక్షించే కార్యక్రమమే అంకురార్పణ. వైఖానస ఆగమమోక్తంగా ఈ వేడుక నిర్వహించి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టడం సంప్రదాయం. ఇందులో భాగంగా నేటి సాయంకాల వేళలో విష్వక్సేనుడు నిర్ణీత పునీత ప్రదేశంలో 'భూమి పూజ'(మృత్సంగ్రహణం)తో మట్టిని సేకరించి ఛత్ర చామర మంగళవాయిద్యాలతో ఊరేగుతూ ఆలయానికి చేరుకుంటారు. యాగశాలలో మట్టితో నింపిన తొమ్మిది పాళికలలో (మూకుళ్లు)– శాలి, వ్రహి, యవ, ముద్గ, మాష, ప్రియంగు మొదలగు నవ ధాన్యాలతో అంకురార్పణం (బీజావాపం) చేస్తారు. సోమవారం ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చక స్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్నాయి.

దేశం చూపంతా హైదరాబాద్ వైపే!

- సీడబ్ల్యూసీ సమావేశాల్లో చర్చలు, తీసుకునే నిర్ణయాలపై జాతీయ రాజకీయ వర్గాల్లో ఆసక్తి
- ప్రధాన మీడియాతోపాటు సోషల్ మీడియాలోనూ ప్రాధాన్యత

సాక్షి, హైదరాబాద్: గతంలో ఎన్నడూ లేనివిధంగా సీడబ్ల్యూసీ సమావేశాలకు వేదికైన హైదరాబాద్ పైనే దేశం చూపంతా కేంద్రీకృతమైంది. శనివారం సీడబ్ల్యూసీ సమావేశాలు ప్రారంభమవడం, వీటిలో పాల్గొనేందుకు జాతీయ కాంగ్రెస్ కీలక నేతలంతా రావడం, కీలక అంశాలపై చర్చిస్తుండటంతో.. దేశంలోని రాజకీయ వర్గాలన్నీ ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఈ నెల 18వ తేదీ నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు మొదలవుతుండటంతోపాటు ఇండియా కూటమిలో సీట్ల సర్దుబాటు, త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై సీడబ్ల్యూసీ సమావేశాల వేదికగా ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో ఇండియా కూటమి సమావేశాల్లో కాంగ్రెస్ అనుసరించే వైఖరి ఏమిటనేది సీడబ్ల్యూసీ సమావేశాల్లోనే ఖరారు చేసే అవకాశం ఉండటం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు ఎప్పుడూ ఢిల్లీ వేదికగా జరిగే సీడబ్ల్యూసీ సమావేశాలు.. ఇలా దక్షిణాదిలో నిర్వహిస్తుండటంపైనా ఆసక్తి నెలకొంది. త్వరలో ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఉండటంతో.. ఇక్కడ అధికారమే లక్ష్యంగా వ్యూహరచన జరుగుతోందన్న చర్చ కూడా జరుగుతోంది. మొత్తమ్మీద జాతీయ మీడియాతోపాటు సామాజిక మాధ్యమాల్లోనూ హైదరాబాద్ వేదికగా జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాలే ఫోకస్‌గా నిలవడం గమనార్హం.

'బ్యాలెట్' రూట్‌లో.. ఆరు గ్యారంటీలు!

- మహాలక్ష్మి, చేయూత, అంబేడ్కర్ అభయ హస్తం, యువ వికాసం, రైతు భరోసా పేర్లతో ప్రకటన!
- పెన్షన్ రూ.4 వేలు.. రైతులకు 2 లక్షల రుణమాఫీ.. రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్..
- 2 లక్షల ఉద్యోగాల భర్తీ.. ఎస్సీ, ఎస్టీలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం హామీలు
- వీటితోపాటు మరో గ్యారంటీ కార్డు పథకం కూడా..



తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి సభ కోసం ఏర్పాటు చేసిన భారీ స్వాగత ద్వారం

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రంగం సిద్ధం చేసింది. బ్యాలెట్ రూట్‌లో ఆరు గ్యారంటీ హామీలను ఇవ్వనుంది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో జరగనున్న కాంగ్రెస్ 'విజయభేరి' సభా వేదికగా అగ్రనేత సోనియాగాంధీ ఈ గ్యారంటీ కార్డు స్కీమ్‌లను ప్రకటించనున్నారు. ఈ హామీలేమిటనే దానిపై టీపీసీసీ వర్గాలు గోప్యత పాటిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. 'మహాలక్ష్మి, చేయూత, అంబేడ్కర్ అభయ హస్తం, యువ వికాసం, రైతు భరోసా'తోపాటు మరో గ్యారంటీ కార్డు స్కీమ్‌ను వెల్లడించనున్నారు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న మహిళలకు నెలకు రూ.3వేల నగదు సాయం.. చేయూత పథకం కింద నెలకు రూ.4 వేల సామాజిక పింఛన్లు.. అభయ హస్తం పేరుతో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల చొప్పున ఆర్థిక సాయం.. యువ వికాసం కింద 2 లక్షల ఉద్యోగాల భర్తీ.. రైతు భరోసా పేరుతో ఏటా రైతులకు రూ.15వేల పెట్టుబడి సాయం వంటి హామీలను ఇవ్వనున్నట్టు తెలిసింది. వీటితో పాటు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, రూ.2లక్షల రైతు రుణమాఫీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగులకు విద్యా సాయం, బీసీ కులవృత్తులకు ఆర్థిక చేయూత వంటి హామీలనూ ఇవ్వనున్నట్టు సమాచారం. నిజానికి ఈ నెల 17న పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ భావించింది. కానీ గ్యారంటీ కార్డు స్కీమ్‌లపై ఫోకస్ చేసి, వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న ఆలోచనతో.. ఆరు గ్యారంటీలకు పరిమితమవుతున్నామని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. త్వరలోనే పూర్తిస్థాయి ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తామని అంటున్నాయి.

నేటి కాంగ్రెస్ షెడ్యూల్ ఇదీ..

రెండో రోజు ఆదివారం ఉదయం 10:30 గంటలకు సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశం ప్రారంభం కానుంది. సీడబ్ల్యూసీ సభ్యులు, శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులతోపాటు అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు ఇందులో పాల్గొంటారు. సాయంత్రం 4:45 గంటల వరకు ఈ సమావేశం జరుగుతుంది. అనంతరం సీడబ్ల్యూసీకి హాజరైన నాయకులంతా తుక్కుగూడలో జరిగే విజయభేరి బహిరంగ సభకు బయల్దేరుతారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ఏడున్నర గంటల వరకు సభ జరుగుతుంది. సభ ముగిశాక జాతీయ, వివిధ రాష్ట్రాల నాయకులు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమకు కేటాయించిన చోటికి వెళతారు. నేతలు ఆయా నియోజకవర్గాల్లోనే రాత్రి బస చేస్తారు. సోమవారం నియోజకవర్గాల వారీగా కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేయడంతోపాటు ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ గ్యారంటీ కార్డు స్కీమ్‌ల గురించి ప్రచారం చేస్తారు.

మూడు వేదికలు.. భారీగా ఏర్పాట్లు

తుక్కుగూడ బహిరంగ సభ కోసం కాంగ్రెస్ పార్టీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సభా స్థలిలో మూడు వేదికలు సిద్ధం చేశారు. ప్రధాన వేదికపై సోనియా, రాహుల్, ప్రియాంకతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు సుఖ్వీందర్‌సింగ్ సుఖు, సిద్ధరామయ్య, అశోక్ గెహ్లాట్, భూపేష్ భగేల్‌తోపాటు 84 మంది సీడబ్ల్యూసీ సభ్యులు, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కూర్చోనున్నారు. కుడివైపున ఏర్పాటు చేసిన రెండో వేదికపై మాజీ కేంద్ర మంత్రులు, మాజీ సీఎంలు, పీసీసీ చీఫ్‌లు ఆసీనులవుతారు. ఎడమవైపు ఏర్పాటు చేసిన మూడో వేదికను డీసీసీలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కళాకారులకు కేటాయించారు. మొత్తంగా మూడు వేదికలపై కలిపి 320 మందికిపైగా ఉంటారు.


- సభలో సోనియా గాంధీ, రాహుల్, ఖర్గేతో పాటు టీపీసీసీ చీఫ్ రేవంత్, భట్టి విక్రమార్క ఐదుగురు మాత్రమే ప్రసంగించనున్నారు.
- సభకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి సుమారు ఐదు లక్షల మందికిపైగా తరలించాలని నిర్ణయించారు. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా నేతలకు జనసమీకరణ టార్గెట్లు పెట్టారు.
- తుక్కుగూడకు వచ్చి పోయే నాలుగు ప్రధాన రహదారుల వెంట స్వాగత తోరణాలు, భారీ కటౌట్లు, హోర్డింగ్‌లతో నింపేశారు. సభకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ కోసం ఇటు ఫ్యాబ్‌సిటీ నుంచి అటు ఓఆర్ఆర్ వెంట ఖాళీగా స్థలాలను సిద్ధం చేశారు.
- కాంగ్రెస్ అగ్రనేతలు, సీఎంలు హాజరవుతుండటంతో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 27 మంది సీఐలు, 61 మంది మంది ఎస్సైలు, 600 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించనున్నారు.
- సాయంత్రం ఐదు గంటలకు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్ నుంచి ర్యాలీగా బయలుదేరే ముఖ్య నేతల వాహనాలు శంషాబాద్, ఓఆర్ఆర్ మీదుగా తుక్కుగూడకు చేరుకుంటాయి.

ఒకే వేదికపై ముగ్గురు గాంధీలు

రాష్ట్ర కాంగ్రెస్ చరిత్రలో తొలిసారిగా ఆ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ముగ్గురూ ఒకే వేదికపై కనిపించనున్నారు. ఢిల్లీ వేదికగా జరిగే పార్టీ సమావేశాలు, టెన్ జన్‌పథ్‌లో జరిగే కార్యక్రమాలకు మాత్రమే ఈ ముగ్గురు కలసి హాజరవుతారని.. ఢిల్లీ వెలుపల ఒకే కార్యక్రమంలో, అదీ ఓ బహిరంగ సభలో పాల్గొంటుండటం అరుదైన ఘటన అని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఆదివారం సాయంత్రం తుక్కుగూడ సభలో ఈ ముగ్గురితోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, ఇతర జాతీయ నాయకత్వమంతా పాల్గొంటుండటం గమనార్హం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ఆదివారం 17-9-2023



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00


సంపుటి: 16
సంచిక: 178

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL









దక్షిణ తెలంగాణ వరదాయిని పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును
ప్రారంభించిన గౌరవ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు గారికి

హృదయపూర్వక వందనాలు

ఓ అపర భగీరథుడా..! ఓ అపూర్వ దార్శనికుడా..!!
సారూ..! మానవత్వానికి మరో రూపమైన కేసీయారూ..!!
కరువు కాటకాలతో గోసెల్లదీసిన
పాలమూరు పొలాల గలుమకాడికి శ్రీశైల గంగను రప్పిస్తున్నవు
గలగల పారే కృష్ణమ్మను మా పొలమెల్లా పారిస్తున్నవు
దుబ్బలేసిన చెలుక భూముల దూప తీర్చుతున్నవు
ఎండిపోయిన సేతానాలను పండుగ చేస్తున్నవు
దేశంబోయిన సోరసోర
పిలగాండ్లను మల్లా ఉన్నఊరికి చేరుస్తున్నవు
తాళంపడ్డ ఇండ్లకు మళ్లా తోరణాలు కడుతున్నవు
మొరంతేలిన వాకిల్లల్ల మల్లా ముగ్గులేయిస్తున్నవు
వరి గొలుసుల చేన్లతో వలసలను ఆపుతున్నవు
గుడ్డాలల్ల పచ్చి గడ్డి మేతమేసిన మా పసులు గూడా
నీ పాదాలకు దండం పెడుతున్నయి
ఓ అపర భగీరథుడా..! ఓ అపూర్వ దార్శనికుడా..!!

పాలమూరును మల్లా పాలుగారే జీవగడ్డగా మారుస్తున్నవు
మా చెరువు కట్టలమీద పాలపిట్టలు ఎగురుతున్నయి
మా చెరువు నీల్లల్ల చేప పిల్లలు మెరుస్తున్నయి
తుంగగడ్డిల బుడుబుంగలు మురుస్తున్నయి
దేశదేశాల కూలీలంతా పాలమూరుకొచ్చి నాట్లేస్తున్నరు
పాలమూరు నుంచి వలసలు బందయి,
పాలమూరుకే వలసలు షురువయినయి
సారూ.. కేసీయారూ..!

పట్టుబట్టినవు - ఒట్టుబెట్టినవు - ప్రతిపక్షాల కుట్రలు మట్టుబెట్టినవు
పాలమూరు ప్రాజెక్టు గట్టినవు
పల్లములోనా పారే కృష్ణను మిట్టమీదికి పట్టుకొచ్చినవు
నీళ్లు మలిపినవు.. మా బతుకులు నిలిపినవు
అచ్చంపేట ఎత్తిపోతల మంజూరు చేసి
లక్ష ఎకరాలు - మూడు పంటలతో
మురిసిపోయే వరమిచ్చినవు..

సారూ.. కేసీయారూ..!
నువ్వు ఇంటింటి దీపమైనవు..!! బంగారు పంటల రూపమైనవు..!



ఒకనాటి వలస కూలీ గువ్వల రాములు కొడుకు..
డా॥ గువ్వల బాలరాజు
B.Com, L.L.M, Ph.d
ప్రభుత్వ విప్
అచ్చంపేట, శాసనసభ్యుడు



సాక్షి ఫ్యామిలీ II
హైదరాబాద్
ఆదివారం ॥ 17-9-2023

వైరల్




పిల్లలూ తల్లులూ చల్లని వారే!



దృశ్యం:1

ప్రియాంక చోప్రా తన కూతురు మాల్తీ మేరీ జోనాస్ కోసం ఇంట్లో 'ప్లే డేట్' నిర్వహించింది. ఈ ఆటల కార్యక్రమానికి ప్రీతీ జింటా పిల్లలు జే, గియాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'ఇన్‌క్రెడిబుల్ వీకెండ్' కాప్షన్‌తో ప్రియాంక ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ పిల్లల ఆటల ఫొటోలు నెటిజనులను ఆకట్టుకున్నాయి.

'మంచి ఐడియా దొరికింది. మా చిన్నారి కోసం ఇలాంటి కార్యక్రమం త్వరలో మా ఇంట్లో ఏర్పాటు చేయనున్నాను' అని ఒక నెటిజన్ స్పందించారు.

దృశ్యం: 2

అమ్మ గురించి చెప్పడానికి ఎన్నో మాటలు అక్కర్లేదు. 'అమ్మా' అనే పిలుపులోనే ఎన్నో వినిపిస్తాయి.

తల్లి ఒమ్న కురియన్ పుట్టిన రోజు సందర్భంగా 'హ్యాపీ బర్త్ డే మై ఎవ్రీ థింగ్' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో శుభాకాంక్షలు తెలియజేసింది నయనతార. తన సర్వస్వం అయిన తల్లి గురించి ఎన్నో సందర్భాల్లో నయన్ చెప్పింది.

ఇటీవలే ఇన్‌స్టాలోకి అడుగు పెట్టింది. తన కుమారులు ఉయిర్, ఉలాగ్‌లతో ఉన్న ఫస్ట్ పోస్ట్ 2.6 మిలియన్‌ల లైక్‌లను దక్కించుకుంది.



ఔరా అనిపించిన అండర్ వాటర్ డ్యాన్సర్

మన దేశ ఫస్ట్ అండర్‌వాటర్ డ్యాన్సర్ జయదీప్ గోహిల్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన స్టన్నింగ్ డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. మైకేల్ జాక్సన్ ఫేమస్ 'మూన్‌వాక్' స్టెప్పులు నీటి గర్భంలో వేసి తన పెర్‌ఫార్మెన్స్‌తో నెటిజనులు 'ఔరా' అనుకునేలా చేశాడు. 'ది ఇన్వెంటర్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో 3.6 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది. 'వీఎఫ్‌ఎక్స్' ఉపయోగించి సృష్టించిన వీడియో ఇది అని కొందరు యూజర్‌లు మొదట భ్రమ పడి, ఆ తరువాత నిజం తెలుసుకొని అబ్బురపడ్డారు.




సంగీత మమకారం

క్షణం తీరిక లేని పనుల్లో అభిరుచులు చిన్నబోతుంటాయి. ఎందుకంటే సమయాభావం వల్ల వాటి జోలికి వెళ్లం. అయితే పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన అభిరుచుల విషయంలో రాజీ పడదు.

సమయం చేసుకొని, చూసుకొని వాటికి న్యాయం చేస్తుంది.

దీదీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ప్రసంగించే వక్త మాత్రమే కాదు బ్యాడ్మింటన్ ప్లేయర్ కూడా. చక్కగా ఆడుతుంది. కవిత్వం రాస్తుంది. పాటలు పాడుతుంది. బొమ్మలు గీస్తుంది. ఆమె మానసిక బలానికి ఈ సృజనాత్మక శక్తులే కారణం కావచ్చు.

అధికార పర్యటనలో భాగంగా ఇటీవల స్పెయిన్‌కు వెళ్లిన మమతా బెనర్జీ, ఒకవైపు సమావేశాలలో పాల్గొంటూనే మరోవైపు తనలోని ఆర్టిస్ట్‌ను అధికారులకు పరిచయం చేసింది. పియానోపై రవీంద్రుడి సంగీతాన్ని వినిపించింది. అంతకుముందు మాడ్రీడ్ వీధుల్లో అకార్డియన్‌పై 'హమ్ హోంగే' గీతాన్ని ప్లే చేసింది. ఈ వీడియోలు ఇంటర్నెట్‌లో సందడి చేస్తున్నాయి.

పెళ్లినాటి ప్రమాణాలు



'పెళ్లినాటి ప్రమాణాలు పెళ్లయిన మరుసటి రోజే కనిపించవు' అనే చమత్కారం మాట ఎలా ఉన్నా నవ వధువు సుచీత ముఖర్జీ మాత్రం పెళ్లినాటి ప్రమాణాల విషయంలో పక్కాగా ఉంది. పెళ్లిమండపంలో ఆహ్వానితుల సమక్షంలో చాంతాడంత పొడవు ఉన్న పెళ్లి ప్రమాణాల లిస్ట్ చదవడం మొదలు పెట్టింది.

'ఇవి నెరవేర్చడం అంత సులువేమీ కాదు' అని చదవడం మొదలు పెట్టింది.

అవి విని పెళ్లికి వచ్చిన వాళ్ల నవ్వులే నవ్వులు.

చివరికి వరుడు కూడా నవ్వు ఆపుకోలేకపోయాడు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 17.5 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది.

'ఈ వీడియో సరదాగా చేశారో, సీరియస్‌గా చేశారో తెలియదుగానీ పెళ్లి మండపంలో ఇలా చదవడం ఒక ట్రెండ్‌గా మారనుంది' అంటూ నెటిజనులు స్పందించారు.

కేశ సంపన్నుడు



ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సిదక్‌దీప్ సింగ్ చాహల్ 'లాంగెస్ట్ హెయిర్ మేల్ టీనేజర్'గా గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాడు. అతడి జుట్టు పొడవు నాలుగు అడుగుల మూడు అంగుళాలు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ (జీ డబ్ల్యూ ఆర్) ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన సింగ్ వీడియో వైరల్ అయింది.

సిదక్ దీప్‌సింగ్ తన తలవెంట్రుకలను శుభ్రపరుచుకోవడానికి కనీసం 20 నిమిషాలు, అవి ఆరడానికి గంట సమయం పడుతుంది.

'నీలాగే మాకు కూడా ఇంత జుట్టు ఉంటే ఎంత బాగుణ్ను' అని ఎవరో ఒకరు అంటున్నప్పుడల్లా సిదక్ దీప్‌సింగ్‌కు సంతోషంగా, గర్వంగా అనిపిస్తుంది.

భుజాల వరకు వేలాడుతున్న వెంట్రుకలను చూసి చిన్నప్పుడు స్నేహితులు సింగ్‌ను ఆటపట్టించేవారు. అవి భరించలేక తనకు హెయిర్ కటింగ్ చేయించమని అమ్మానాన్నలకు చెప్పాడు. అయితే వారు అదేమీ సీరియస్‌గా తీసుకోలేదు. అలా అడగడం అదే మొదటి సారి చివరిసారి. ఇప్పుడు మాత్రం తన కేశసంపదను చూసి గర్విస్తుంటాడు. 'తెల్లారి లేచింది మొదలు నా జుట్టుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయం మీద మాత్రమే నేను దృష్టి పెట్టను. చదువుకుంటాను, వ్యాయామం చేస్తాను. వీడియో గేమ్స్ ఆడతాను' నవ్వుతూ అంటాడు సిదక్ దీప్‌సింగ్.



30 అడుగుల అభిమానం



'జవాన్'తో మరో పెద్ద విజయాన్ని అందుకున్నాడు షారుక్‌ఖాన్. అభిమానులు ఖుషీ ఖుషీగా ఉన్నారు.


కోల్‌కత్తాకు చెందిన షారుక్‌ఖాన్ అభిమాని, చిత్రకారుడు ప్రీతమ్ బెనర్జీ మార్బుల్ స్టోన్ చిప్స్, పెయింట్ బ్రష్‌ను ఉపయోగిస్తూ 30 అడుగుల షారుక్ పోట్రాయిన్ రూపొందించాడు.

ఈ స్టన్నింగ్ పోర్ట్రయిట్ డ్రోన్ షాట్ అదిరిపోయింది.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ మేకింగ్ వీడియో చూసిన నెటిజనులు 'వావ్' అంటున్నారు.

'ట్రిబ్యూట్ టూ ది కింగ్‌ఖాన్. ఇది నా హృదయంలో నుంచి వచ్చిన కళారూపం. నా అభిమాన హీరో దీన్ని త్వరలోనే చూడాలనుకుంటున్నాను' అంటూ రాశాడు బెనర్జీ.

హెల్త్



అల్జైమర్స్ డిమెన్షియా, వాస్క్యులార్ డిమెన్షియా!!

వయసు పెరుగుతున్న కొద్దీ మతిమరపు వస్తుండటం సహజం. మతిమరపును ఇంగ్లిష్‌లో 'డిమెన్షియా' అంటారు. డిమెన్షియాకు కారణాల్లో అత్యంత సాధారణమైంది 'అల్జైమర్స్' అయితే... దానితో పోలిస్తే... దానికంటే కొద్దిగా అరుదైనది వాస్క్యులార్ డిమెన్షియా. ఈ సందర్భంగా మతిమరపునకు కారణమయ్యే అల్జైమర్స్ డిమెన్షియా, వాస్క్యులార్ డిమెన్షియా లపై అవగాహన కోసం ఈ కథనం.

డిమెన్షియా, అల్జైమర్స్‌ని ఓ వ్యాధిగా కాకుండా ఓ సిండ్రోమ్‌గా చెప్పవచ్చు. అంటే... నిర్దిష్టంగా ఓ వ్యాధి లక్షణంతో కాకుండా... అనేక లక్షణాల సమాహారంతో కనిపించే ఆరోగ్య సమస్యను సిండ్రోమ్ అనవచ్చు. డిమెన్షియా ఉన్నప్పుడు అది కొత్త అంశాల్ని నేర్చుకునేందుకు దోహదపడే (కాగ్నిటివ్) నైపుణ్యాల్లోని జ్ఞాపకశక్తి (మెమరీ) పైనా, తార్కికంగా ఆలోచించే సామర్థ్యం (రీజనింగ్)పైనా ప్రతికూలంగా ప్రభావం చూపుతుంది.

అల్జైమర్స్ విషయానికి వస్తే ఇది కూడా డిమెన్షియాలో ఒక రకం. అందుకే దీన్ని అల్జైమర్స్ డిమెన్షియా (ఏడీ) అనవచ్చు. గతంతో పోలిస్తే ఇప్పుడిది చాలా సాధారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా కోవిడ్ తర్వాత నలుగురితో కలవకపోవడం, ఒంటరితనం, మానసిక ఒత్తిడి లాంటి అంశాల కారణంగా అల్జైమర్స్ పెరిగింది.

అల్జైమర్స్ డిమెన్షియా కొన్ని నెలలు మొదలుకొని ఏళ్ల వ్యవధిలో క్రమంగా పెరుగుతూ పోతుంటుంది. ఒకసారి అల్జైమర్స్ మొదలయ్యాక బాధితుల్ని మునపటిలా అయ్యేలా చికిత్స సాధ్యం కాదు. కాకపోతే దీనిలో మరపు అన్నది మొదట్లో తాజా తాజా విషయాలు మొదలుకొని... క్రమంగా పాత విషయాల్ని మరచిపోతుంటారు. తాము ఎంతోకాలంగా నివాసమున్న ప్రదేశాల్నీ, కాలాన్నీ (అది పగలా, రాత్రా అన్నదానితో సహా) మరచిపోతారు. ప్రశ్నలకు సమాధానాలివ్వలేకపోవడం, కుటుంబ సభ్యుల్ని అడిగిన ప్రశ్నల్నే మళ్లీ మళ్లీ అడగడం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం, ప్రవర్తనలో మార్పు రావడం... చివరకు సొంత కుటుంబ సభ్యుల్ని సైతం గుర్తుపట్టలేనంతగా మరచిపోతారు.

మతిమరపులకు **'వాస్క్యులార్ డిమెన్షియా'** అనేది 'అల్జైమర్స్ డిమెన్షియా' కంటే రెండో అతి ముఖ్యమైన కారణం. మెదడుకు క్రమంగా రక్త సరఫరా తగ్గిపోవడం వల్ల వస్తుంది కాబట్టి దీన్ని 'వాస్క్యులార్ డిమెన్షియా'గా చెబుతారు. ఇది కొందరిలో అకస్మాత్తుగా కనిపిస్తుంది. ఫలితంగా అభ్యాస, అధ్యయన, నేర్చుకునే ప్రక్రియలు... ఇలా ఇవన్నీ మరుస్తూపోవడం వల్ల పరిస్థితి అకస్మాత్తుగా దిగజారిపోతుంది.

మతిమరుపు, అల్జైమర్స్ తెచ్చి పెట్టే అంశాల్లో కొన్ని...

జన్యుపరమైనవి : మతిమరపులో జన్యుపరమైన అంశాలు కీలకమైన భూమిక పోషిస్తాయి. కొందరి కుటుంబాల్లో వంశపారంపర్యంగా కనిపిస్తుంటాయి. ఏపీఓఈ 4 ఎల్లీల్ వంటి కొన్ని నిర్దిష్టమైన జన్యువులు ఈ ముప్పులను పెంచుతాయి.

వయసు : పెరిగే వయసు మతిమరపును తెచ్చిపెట్టే అల్జైమర్స్, వాస్క్యులార్ డిమెన్షియాలకు ప్రధానమైన రిస్క్ ఫ్యాక్టర్. పైగా ఇది నిరోధించలేని అంశం.

జీవనశైలి (లైఫ్ స్టైల్) : ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించని వాళ్లలో అంటే... ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకపోవడం, కొవ్వులు, చక్కెరలు ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం, పొగ, ఆల్కహాల్ అలవాట్ల వంటి అనారోగ్యకరమైన జీవనశైలి ఉన్నవారిలో ఈ ముప్పులు ఎక్కువ.

దేహంలోని ఇతర సమస్యలు : దీర్ఘకాలికంగా ఉండే డయాబెటిస్, హైబీపీ, గుండెజబ్బులు మెదడు పనితీరుపై ప్రతికూలం ప్రభావం చూపి, పరోక్షంగా అల్జైమర్స్, వాస్క్యులార్ అల్జైమర్స్‌కూ, గురకను కల్పించే స్లీప్ ఆప్నియాకు కారణమవుతాయి.


వాతావరణ అంశాలు : వాతావరణ కాలుష్యాలూ, విష పూరిత వ్యర్థాలూ చాలావరకు మతిమరపునకు కారణమవుతాయి. అందుకే వీలైనంత వరకు పరిశుభ్రమైన ప్రదేశాలూ, కాలుష్యాలు లేని వాతావరణాలూ వీటి నివారణకు చాలావరకు తోడ్పడతాయి.

ఆహారం : పోషకాలన్నీ ఉండే సమతులాహారం తీసుకోవడం మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ముఖ్యంగా భారతీయ వంటల్లో ఉపయోగించే పసుపు, మెడిటేరియన్ డైట్ (ఆల్మండ్స్, వాల్‌నట్, డార్క్ చాక్లెట్స్, ఆలివ్ ఆయిల్, క్రాన్‌బెర్రీ) వంటివి మతిమరపు నివారణకు తోడ్పడతాయి.

చికిత్స : అల్జైమర్స్ డిమెన్షియానూ, వాస్క్యులార్ డిమెన్షియానూ పూర్తిగా తగ్గించే మందులు లేకపోయినప్పటికీ... వాటి పురోగతిని ఆలస్యం చేయడానికి మందులు అందుబాటులో ఉన్నాయి. లక్షణాల తీవ్రత ఆధారంగా డోనెపెజిల్, రివాస్టిగ్మిన్, మెమాంటిన్, గ్యాలంటమైన్ వంటి మందులు ఇవ్వాల్సి ఉంటుంది.

'లెకానిమ్యాబ్' అనే సరికొత్త మందును ఈ ఏడాదే ఎఫ్‌డీఏ ఆమోదించింది. పైవన్నీ నోటిద్వారా తీసుకునే మందులు కాగా... లెకానిమ్యాబ్‌ను రెండో వారాలకు ఒకసారి సూది మందు రూపంలో ఇస్తారు.

నివారణ... పై అంశాలలో పెరిగే వయసు, జన్యుపరమైన అంశాలు నిరోధించలేనివి. ఇవి మినహా మిగతా రిస్క్ ఫ్యాక్టర్స్‌ను ప్రయత్నపూర్వకంగా అదుపులో ఉంచడం ద్వారా వీటిని చాలావరకు నివారించవచ్చు. ఈ కింది అంశాలు నివారణకు చాలావరకు తోడ్పడతాయి.



వ్యాయామం : దేహాన్ని చురుగ్గా ఉంచే వ్యాయామాలు చేయాలి. ఫలితంగా మెదడుకు రక్తప్రసరణ పెరిగి, న్యూరాన్లూ వాటి న్యూరల్ కనెక్షన్లు, జీవక్రియల కోసం మెదడు స్రవించే రసాయనాలన్నీ ఆరోగ్యకరంగా ఉంటాయి. దాంతో జ్ఞాపకశక్తి మెరుగవుతుంది.


మెదడుకు మేత : కొత్త భాషలు నేర్చుకోవడం, పుస్తక పఠనం, పజిల్స్ సాధించడం, మెదడుకు మేత కల్పించే పొడుపుకథలు, ఉల్లాసంగా ఉంచే హాబీలు, మానసిక వ్యాయామాలు మెదడును ఆరోగ్యంగా ఉంచి మతిమరపు నివారణకు తోడ్పడతాయి.

దీర్ఘకాలిక వ్యాధుల అదుపు : డయాబెటిస్, హైబీపీ వంటి వ్యాధులను అదుపులో పెట్టుకోవాలి.

నలుగురిలో ఒకరిగా : వేడుకలు, పుట్టిన రోజులూ, పెళ్లిళ్ల వంటి ఫంక్షన్లలో పదిమందినీ కలవడం వంటివి మతిమరపును దూరం చేస్తుంది.

రివర్సిబుల్ డిమెన్షియా..

అదృష్టవశాత్తూ ఇప్పుడు కొన్ని రకాల డిమెన్షియాలను పూర్తిగా నయం చేయడం సాధ్యమవుతోంది. అవి... బీ1, బీ6, బీ12 విటమిన్‌ల లోపాలతో వచ్చిన మతిమరపులూ, రక్తంలో కొన్ని లవణాల సమతుల్యత కోల్పోవడం వల్ల, మెదడులో అతిగా నీరు ఉండటం (హైడ్రో కెఫలస్), కొన్ని రకాల బ్రెయిన్ ట్యూమర్స్, బ్రెయిన్ ఇన్ఫెక్షన్స్, కొన్ని భారలోహాలు, కొన్ని రకాల మందుల కారణంగా వచ్చిన మతిమరపులను ఇప్పుడు పూర్తిగా నయం చేయవచ్చు.



డా॥ బి. చంద్రశేఖర్ రెడ్డి
సీనియర్ న్యూరో ఫిజీషియన్.

చిన్నారుల్లో బ్రాంకియొలైటిస్ వస్తే...?



చిన్నారుల ఊపిరితిత్తులకు గాలిని తీసుకెళ్లే చిన్న గాలిగొట్టాల్ని బ్రాంకియోల్స్ అంటారు. ఇన్ఫెక్షన్లు లేదా ఇతర కారణాలతో వీటిల్లో వాపు వస్తే దాన్ని బ్రాంకియొలైటిస్‌గా చెప్పవచ్చు. సాధారణంగా ఇది నెలల వయసుగల పిల్లలు మొదలుకొని రెండేళ్ల వరకు చాలా తరచుగా కనిపిస్తుంది.

పిల్లల్లో బ్రాంకియొలైటిస్‌కు చాలా కారణాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రధాన గాలిగొట్టం (ట్రాకియా) లేదా నోరు, ముక్కు, గొంతుల్లో వచ్చే ఇన్ఫెక్షన్లు కిందికి వ్యాపించడం వల్ల ఈ సమస్య రావచ్చు. వైరస్‌లలో రెస్పిరేటరీ సిన్సీషియల్ వైరస్, రైనో వైరస్, ఎడినో వైరస్, ఇన్‌ఫ్లుయెంజా, కరోనా లాంటి వైరస్‌లు, కొన్నిసార్లు కొన్ని రకాల బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు కూడా బ్రాంకియొలైటిస్‌కు కారణం కావచ్చు.

ముప్పు ఎవరిలో ఎక్కువ?

- నెలలు నిండకముందే పుట్టిన చిన్నారులు
- తల్లిపాలపై పెరగని పిల్లల్లో
- ఇంతకుముందే ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పిల్లలు
- డే కేర్ సెంటర్‌లోని పిల్లలు... మొదలైనవారిలో.

నిర్ధారణ...
- ఛాతీ ఎక్స్-రే
- కొన్ని రకాల రక్తపరీక్షలు
- ముక్కు, గొంతు నుంచి సేకరించిన స్వాబ్‌ను పరీక్షించడం ద్వారా వైరలా లేక బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షనా అన్నది చాలావరకు నిర్ధారణ చేయవచ్చు.

నివారణ:
- పిల్లలు తమ చేతుల్ని తరచూ శుభ్రంగా కడుక్కునేలా చూడటం
- పరిసరాల్ని శుభ్రంగా ఉంచుకోవడం
- అవసరాన్ని బట్టి కొందరికి ఫ్లూ టీకాలు ఇప్పించడం
- చల్లగాలికి ఎక్స్‌పోజ్ కాకుండా చూడటం
- చల్లటి పదార్థాలు, కూల్‌డ్రింక్స్ తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

లక్షణాలు...

బ్రాంకియొలైటిస్ లక్షణాలు దాదాపు ఓ వారం పాటు పిల్లలను బాధిస్తాయి. ఇవి ఫ్లూ లక్షణాలను పోలి ఉంటాయి. కొన్నిసార్లు తీవ్రమైన దగ్గుతో శ్వాస సరిగా అందక పిల్లలు బాధపడుతుంటారు.

సాధారణంగా కనిపించే లక్షణాలివి...
- దగ్గు, పిల్లికూతలు
- ముక్కు కారడం
- ఊపిరి సాఫీగా అందకపోవడం
- పిల్లలు ఛాతీ పట్టేసినట్లుగా బాధపడటం
- జ్వరం
- ఆకలి తగ్గడం
- చిరాకు / చికాకు
- కొన్నిసార్లు వాంతులు కావడం
- ఆరు నెలల కంటే తక్కువ వయసున్న పిల్లలు పాలు సరిగా తాగలేకపోవడం, ఎక్కువగా ఏడవటం లాంటివి.

చికిత్స: చాలావరకు వైరల్ ఇన్ఫెక్షన్‌లే బ్రాంకియొలైటిస్‌కి కారణం కాబట్టి లక్షణాల ఆధారంగా సపోర్టివ్ ట్రీట్‌మెంట్ ఇస్తారు. అంటే... తగినన్ని నీళ్లు తాగించడం, కాస్త పెద్ద పిల్లలైతే ద్రవాహారాలు ఇవ్వడం, పాలు పట్టే ముందర వారి నోరు, ముక్కుల్లో ఉండే చిక్కటి స్రావాలను 'బల్బ్ సిరంజ్'తో బయటకు తొలగించడం, నిద్రపోతున్నప్పుడు బాగా శ్వాస అందేలా తలను కాస్త ఎత్తుగా ఉంచడం, జ్వరం ఉంటే టెంపరేచర్ తగ్గించే మందులు, యాంటిహిస్టమైన్స్, కాఫ్ సిరప్, నెబ్యులైజేషన్ వంటివి కొంతవరకు ఉపయోగపడతాయి. బ్లడ్ రిపోర్టులు, ఎక్స్-రే బట్టి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు మాత్రమే యాంటీబయాటిక్స్ ఇస్తారు.

పిల్లలు బాగా డల్‌గా ఉండటం, పాలు, ఆహారం తీసుకోవడం బాగా తగ్గడం, పిల్లలకు ఊపిరి అందనప్పుడు / తమంతట తామే శ్వాస తీసుకోలేనప్పుడు ఇది కాస్త ప్రమాదకరమైన పరిస్థితి అని గ్రహించి, వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అక్కడ డాక్టర్లు వారికి...
- రక్తనాళం ద్వారా ఫ్లూయిడ్స్ ఎక్కించడం
- ఆక్సిజన్ అందకపోతే ఆక్సిజన్ పైప్‌తో ఆక్సిజన్ అందించడం
- పిల్లల ఊపిరితిత్తుల్లో, ముక్కులోని చిక్కటి స్రావాలను (సక్షన్ ద్వారా) బయటకు పంపడం వంటి ప్రక్రియలతో చికిత్స అందిస్తారు. ఆక్సిజన్ అందకపోతే వెంటిలేటర్ మీద ఉంచాల్సి వస్తుంది.



డా॥ సత్యనారాయణ కావలి
కన్సల్టెంట్ పీడియాట్రీషియన్.

చీలమండ నొప్పి తగ్గాలంటే...



మడమ, దాని పరిసరాల్లో వచ్చే నొప్పిని చీలమండ నొప్పి (యాంకిల్ పెయిన్) అంటారు. వయసు పెరుగుతున్న కొద్దీ ఎముకలు బలహీనంగా మారడం మొదలుకొని దేహంలో పెరిగిన యూరిక్ యాసిడ్ చీలమండ కీళ్లలో స్ఫటికాలుగా మారి ఒరుసుకుపోవడం వరకు అనేక కారణాల వల్ల ఈ నొప్పి రావచ్చు. ఇది తగ్గడానికి ఈ కింది సూచనలు పాటించడం మంచిది. అవి...
- పాదాలకు నప్పేలా పాదరక్షలు వేసుసుకోవడంతో పాటు అవి మెత్తగా ఉండటం మంచిది. హైహీల్స్ మంచిది కాదు.
- క్రేప్‌బ్యాండ్ చుట్టడం వల్ల నొప్పి తగ్గుతుంది
- ఊబకాయం వల్ల దేహం బరువు చీలమండపై పడి నొప్పి పెరుగుతుంది. బరువు తగ్గించుకోవడం మేలు చేసే అంశం.
- వాపు ఉన్నప్పుడు... పడుకునే సమయంలో కాలి కింద తలగడ ఉంచి, చీలమండ మిగతా శరీర భాగం కంటే కాస్త పైకి ఉండేలా ఆ తలగడను అమర్చాలి.
- వాపు దగ్గర ఐస్ ప్యాక్ పెట్టాలి.
- నడిచేటప్పుడు మడమ మీద బరువు పడకుండా చూసుకోవాలి. ఈ జాగ్రత్తల తర్వాతా నొప్పి తగ్గకపోతే డాక్టర్‌ను కలిసి తగిన చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023

శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కళాకారుల సందడి



ఖైరతాబాద్ మహాగణపతికి 75 అడుగుల భారీ కండువా



ఖైరతాబాద్: మహాగణపతికి భారీ కండువా, జంధ్యం, గరిక మాలతో పాటు దేవతామూర్తులకు సమర్పించే పట్టు వస్త్రాలకు ఖైరతాబాద్ పద్మశాలి సంఘం సభ్యులు శనివారం పూజలు నిర్వహించారు. శ్రీ దశమహా విద్యా గణపతిగా కొలువుదీరిన మహాగణపతికి సోమవారం వినాయక చవితి రోజున ఉదయం 7 గంటలకు 75 అడుగుల కండువా, జంధ్యం, గరికమాలను సమర్పిస్తున్నట్లు అధ్యక్షుడు కడారి శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు గుర్రం కొండయ్య తెలిపారు. మహాగణపతికి ఇరువైపులా కొలువుదీరిన వీరభద్ర స్వామి, నరసింహస్వామి, సరస్వతీదేవి, వారాహి దేవతామూర్తులకు పట్టు వస్త్రాలను అందజేయనున్నట్లు తెలిపారు.

నిమజ్జనానికి భారీ వాహనాలు

- 2 వేల వాహనాలు ఏర్పాటు చేసేందుకు ఆర్టీఏ చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: వినాయక ఉత్సవాల అనంతరం విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లపై భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఇటీవల ఆర్టీఏ అధికారులతో సమావేశమయ్యారు. విగ్రహాలను నిమజ్జనానికి తరలించేందుకు వాహనాలను అందజేయాలని కోరారు. ఈ మేరకు రవాణా అధికారులు ప్రస్తుతం వాహనాల సేకరణపై దృష్టి సారించారు. వివిధ ప్రాంతాల్లోని మండపాల నిర్వాహకుల డిమాండ్ మేరకు అవసరమైన వాహనాలను ఇవ్వనున్నట్లు హైదరాబాద్ జేటీసీ పాండురంగ్ నాయక్ తెలిపారు.ఈ మేరకు 2000 వాహనాలను అందుబాటులో ఉండేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జనానికి సొంతంగా వాహనాలను సమకూర్చుకోలేని నిర్వాహకులకు రవాణా శాఖ వాహనాలను సేకరించి ఇస్తోంది. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో వాహనాల వివరాలను అందుబాటులో ఉంచనున్నారు.

వాకర్లకు మట్టి గణపతుల పంపిణీ



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని జలగం వెంగళ్‌రావు పార్కులో శనివారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను కమిషనర్ రోనాల్డ్ రాస్, జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రేతో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇక్కడి వాకర్లకు మట్టి గణేష్ ప్రతిమలను అందజేశారు.

ముగ్గురు ఇన్‌స్పెక్టర్లపై వేటు

- 22 ఠాణాలకు తాత్కాలికంగా డీఐలు
- ఉత్తర్వులు జారీ చేసిన నగర కొత్వాల్

సాక్షి, సిటీబ్యూరో: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న ముగ్గురు ఇన్‌స్పెక్టర్లపై కొత్వాల్ సీవీ ఆనంద్ వేటు వేశారు. వీరిని లూప్‌లైన్లకు పంపిన ఆయన ఆ స్థానాల్లో కొత్తగా ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్ ఇచ్చారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రాతిపదికన బదిలీలను గత నెల 31కే పూర్తి చేశారు. అయితే డీసీపీలు అందించిన నివేదికల ఆధారంగా గణేష్ ఉత్సవాలు, నిమజ్జనాన్ని ప్రశాంతంగా పూర్తి చేయడానికే ఈ చర్యలు తీసుకున్నారు. మరోపక్క మిలాద్ ఉన్ నబీ నేపథ్యంలో నగర కమిషనరేట్‌లోని 22 ఠాణాలకు తాత్కాలిక ప్రాతిపదికన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లను (డీఐ) ఇతర విభాగాల నుంచి నియమించారు. ప్రస్తుత అవసరాలు, పండగల నేపథ్యంలో 20 మంది ఎస్సైలను బదిలీ చేశారు. సైదాబాద్, హుస్సేనిఆలం, మీర్‌చౌక్ ఠాణాలకు ఇన్‌స్పెక్టర్లుగా పని చేస్తున్న ఎం.రవి, సీహెచ్ నాగేశ్వర్‌రెడ్డి, ఎస్.ఆనంద్ పని తీరు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వీరిని కొత్వాల్ బదిలీ చేశారు. ఆ స్థానాల్లో సీతారాములు, సీహెచ్ నాగేశ్వర్‌రెడ్డి, ఆర్.రఘునాథ్‌లను నియమించారు. నగర కమిషనరేట్‌లో రిపోర్ట్ చేసి, వెయిటింగ్‌లో ఉన్న మరో 11 మంది ఇన్‌స్పెక్టర్లకు వివిధ చోట్ల పోస్టింగ్ ఇచ్చారు. మరో 20 మంది సబ్–ఇన్‌స్పెక్టర్లకు ప్రస్తుతం ఉన్న విభాగాల నుంచి బదిలీ చేసి ఆయా ఠాణాల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అవసరం లేని ఠాణాల్లో ఉన్న డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ) పోస్టుల్ని తొలగించారు. గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ఒకేసారి రావడంతో క్షేత్రస్థాయిలో ఇన్‌స్పెక్టర్లకు ప్రాధాన్యం పెరిగింది. దీంతో అవసరం ఉన్న 22 పోలీసుస్టేషన్లకు తాత్కాలిక ప్రాతిపదిన డీఐలను నియమిస్తూ కొత్వాల్ నిర్ణయం తీసుకున్నారు.

హాట్ డే!

ఇప్పటికే నగరంలో సీడబ్ల్యూసీ సమావేశాలు


- నేడు పబ్లిక్ గార్డెన్స్‌లో సమైక్యతా దినోత్సవం
- పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన వేడుకలు
- పాల్గొననున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- అప్రమత్తమైన హైదరాబాద్ పోలీసు అధికారులు
- పరేడ్ గ్రౌండ్స్, పబ్లిక్ గార్డెన్స్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు
- యూపీఎస్సీ పరీక్షకు వచ్చే వారికి ప్రత్యేక అనుమతులు



పరేడ్ గ్రౌండ్‌లో డప్పు వాయిస్తున్న కళాకారిణి



మాసబ్‌ట్యాంక్ హాకీ గ్రౌండ్‌లో ఎంఐఎం సభ ఏర్పాట్లు



సాక్షి, సిటీబ్యూరో: అత్యంత కీలక రోజుగా మారిన 'సెప్టెంబర్ 17' నేపథ్యంలో నగర పోలీసు విభాగం అత్యంత అప్రమత్తమైంది. ఇప్పటికే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల నేపథ్యంలో శనివారం నుంచి ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకలతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిటీలోనే ఉన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలో జరిగే కార్యక్రమానికి వీరు హాజరవుతారు. మరోపక్క తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం నేపథ్యంలో పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమానికి ప్రముఖులు హాజరవుతారు. ఆదివారం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే తెలంగాణ విమోచన దినోత్సవంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల నేపథ్యంలో పోలీసు విభాగం గతానికి భిన్నంగా పటిష్ఠ బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తోంది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అటు పరేడ్ గ్రౌండ్, ఇటు పబ్లిక్ గార్డెన్స్ కేంద్రంగా ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తీసుకుంటున్న చర్యలను నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్, నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌ను శనివారం నాటికే పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ప్రత్యేక బాంబు నిర్వీర్య బృందాలతో అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తున్నారు. శాంతి భద్రతల విభాగంతో పాటు టాస్క్‌ఫోర్స్, సిటీ సెక్యూరిటీ వింగ్, సీఏఆర్ విభాగాలు, సాయుధ బలగాలు బందోబస్తులో పాల్గొంటున్నాయి. మొత్తమ్మీద దాదాపు 2500 మంది సిబ్బందిని రెండు చోట్ల మోహరిస్తున్నారు. ట్రాఫిక్ మళ్లింపులు దృష్టిలో పెట్టుకుని నగర వాసులు సహకరించాలని, నాంపల్లి, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లు, జేబీఎస్‌లకు వెళ్లే ప్రయాణికులు నిర్ణీత సమయానికి కంటే ముందే బయలుదేరాలని పోలీసులు కోరుతున్నారు.

ట్రాఫిక్ మళ్లింపులు ఇలా..

పబ్లిక్ గార్డెన్స్ కేంద్రంగా ..

- ఎంజే మార్కెట్ నుంచి పబ్లిక్ గార్డెన్స్ వైపు వచ్చే వాహనాలను తాజ్ ఐలాండ్ నుంచి ఏక్ మినార్ వైపు మళ్లిస్తారు.
- నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి పబ్లిక్ గార్డెన్స్ వైపు వచ్చే వాహనాలను ఛాపెల్ రోడ్ టీ జంక్షన్ నుంచి మళ్లిస్తారు.
- నిరంకారి నుంచి ఓల్డ్ సైఫాబాద్ పీఎస్ వైపు వచ్చే వాహనాలను టెలిఫోన్ భవన్ వైపు పంపిస్తారు.
- బషీర్‌బాగ్ జంక్షన్, ఇక్బాల్ మినార్, ఏఆర్ పెట్రోల్ పంప్, ఆదర్శ్ నగర్‌ల వైపు నుంచి పబ్లిక్ గార్డెన్స్ వైపు వచ్చే వాహనాలను వివిధ మార్గాల్లో పంపిస్తారు.

పరేడ్ గ్రౌండ్స్ కేంద్రంగా..

- ప్లాజా ఎక్స్ రోడ్ నుంచి ఎస్‌బీఐ చౌరస్తా మధ్య మార్గాన్ని పూర్తిగా మూసేస్తారు. వైఎంసీఏ ఫ్లైఓవర్ పై నుంచి మాత్రమే ట్రాఫిక్ అనుమతిస్తారు.
- బోయిన్‌పల్లి–తాడ్‌బండ్ వైపు నుంచి వచ్చే వాహనాలను సీటీఓ వైపు మళ్లిస్తారు. కార్ఖానా–జేబీఎస్ వైపు నుంచి వచ్చే వాహనాలను స్వీకార్ ఉపకార్ నుంచి టివోలీ వైపు పంపిస్తారు.
- ఆర్పీ రోడ్ నుంచి ఎస్బీహెచ్ చౌరస్తా వైపు వచ్చే ట్రాఫిక్ ప్యాట్నీ నుంచి ప్యారడైజ్ లేదా క్లాక్ టవర్ వైపు మళ్లాల్సి ఉంటుంది.

హాల్ టికెట్లు చూపించాలి...

ఆదివారం నగరం వివిధ ప్రాంతాల్లో కేంద్రాల్లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష జరగనుంది. ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉన్న చోట్లా ఈ పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు చూపించిన వారిని బారికేడింగ్ పాయింట్లు దాటి ముందుకు పంపాలని ఆదేశించారు.



పరేడ్ గ్రౌండ్‌లో విమోచన దినోత్సవ సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి, ఈటల, డీకే అరుణ



పరేడ్‌గ్రౌండ్‌లో గిరిజన మహిళా కళాకారులు

సిటీలో సీడబ్ల్యూసీ సందడి

- తరలి వచ్చిన కేంద్ర కాంగ్రెస్ నాయకత్వం
- నేతలకు ఘనస్వాగతం పలికిన శ్రేణులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సీడబ్ల్యూసీ భేటీతో కాంగ్రెస్ శ్రేణుల్లో సందడి నెలకొంది. శనివారం నగరానికి పార్టీ కేంద్ర నాయకత్వం కదిలి వచ్చింది. సుదీర్ఘ కాలం తర్వాత సీడబ్ల్యూసీ భేటీ ఆతిథ్యానికి అవకాశం దక్కడంతో నగరం కాంగ్రెస్ జెండాలమయంగా మారింది. అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్, ప్రియాంక గాంధీ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులు సిద్ధరామయ్య, భూపేశ్ బగేల్, అశోక్ గెహ్లోత్, ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్, పార్టీ కేంద్ర నేతలు చిదంబరం, వీరప్ప మొయిలీ తదితరులకు పీసీసీ నేతలు ఘన స్వాగతం పలికారు. బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్‌కృష్ణ వేదికగా శనివారం మధ్యాహ్నం తర్వాత సీడబ్ల్యూసీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. పార్టీ అతిరథ మహారథులకు స్వాగతం పలుకుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్న ఆశావహులు పోటాపోటీగా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు కటౌట్లు ఏర్పాటు చేశారు.

కళా నృత్యాలతో..

సీడబ్ల్యూసీ సమావేశాలకు వచ్చిన అగ్రనేతలకు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ వద్ద తెలంగాణ సంప్రదాయ నృత్యాలు, కళా బృందాలతో పీసీసీ ఘన స్వాగతం పలికింది. కళాకారులతో పాటు ఎమ్మెల్యే సీతక్క నృత్యం చేశారు. సీడబ్ల్యూసీ భేటీకి హాజరైన అతిథులకు తాజ్‌కృష్ణతో పాటు తాజ్ డెక్కన్, తాజ్ బంజారా, హయత్ ప్లేస్ తదితర హోటళ్లలో బస ఏర్పాట్లు చేశారు. ఆదివారం కూడా సీడబ్ల్యూసీ భేటీ కొనసాగనుంది.

పోస్టర్.. వార్..

- హస్తం పార్టీని 'కరప్ట్ వర్కింగ్ కమిటీ'గా అభివర్ణన
- తెలంగాణకు వస్తున్న అమిత్‌షా రాష్ట్రానికి ఏమైనా ఇస్తారా? అంటూ ప్రశ్నలు
- బీఆర్ఎస్ నేతల పనే? అంటూ గుసగుసలు..



సాక్షి, సిటీబ్యూరో: ఓవైపు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలు, భారీ బహిరంగసభ.. మరోవైపు బీజేపీ హైదరాబాద్ విమోచన సభ కోసం రెండు పార్టీల జాతీయ నేతలు నగరానికి వస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని వాటికి వ్యతిరేకంగా ఆయా ప్రాంతాల్లో పోస్టర్లు వెలిశాయి. కాంగ్రెస్‌ది అవినీతి కోసం జరుగుతున్న వర్కింగ్ కమిటీ సమావేశమని, అవినీతికి పాల్పడే కాంగ్రెస్‌తో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నట్లుగా 'కరప్ట్ వర్కింగ్ కమిటీ', బివేర్ ఆఫ్ స్కాంగ్రెస్ స్కామర్స్ అని రాశారు. కాంగ్రెస్‌లోని దాదాపు పాతికమంది నేతలు ఆయా స్కామ్‌లలో ఉన్నట్లుగా పేర్కొంటూ వారి ఫొటోలు, పక్కన వారు పాల్పడ్డారన్నట్లుగా ఆయా స్కామ్‌ల పేర్లు రాశారు. మరోవైపు రెండు పార్టీలు తెలంగాణకు ఏమీ చేయలేదని, సీఎం కేసీఆర్ వివిధ కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

సంధించిన ప్రశ్నలు ఇవీ..

- 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎస్సీ వర్గీకరణ చేయలేదు. ఇప్పుడు కూడా ఎస్సీ డిక్లరేషన్ పేరుతో అలాగే మోసగిస్తారా?
- పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇస్తామన్న సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు జాతీయ హోదా ఇవ్వడంలో ఎందుకు విఫలమయ్యారు?
- తెలంగాణలో మా ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. 2016 వృద్ధాప్య పెన్షన్లు ఇస్తుంటే, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మీరు ఇస్తున్న పెన్షన్లు ఎంత?
- మీ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రైతులకు వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలు అంటున్నారు దానికి మీరు ఒప్పుకుంటున్నారా?
- గోవా లిబరేషన్ డేకు రూ. 300 కోట్లు ఇచ్చిన మోదీ సర్కార్ తెలంగాణ నేషనల్ ఇంటిగ్రేషన్‌డేకు ఒక్కరూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదు? తెలంగాణకు వస్తున్న అమిత్ షా రాష్ట్రానికి మీరేమైనా ప్రకటిస్తారా ?
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి నగరానికి వచ్చే మార్గంలో, తాజ్‌కృష్ణ పరిసరాల్లోని బంజారాహిల్స్, పంజగుట్ట తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. బీజేపీకి వ్యతిరేకంగా కేంద్ర మంత్రి అమిత్‌షాను ప్రశ్నిస్తున్నట్లుగా ఉన్న బ్యానర్లు పరేడ్‌గ్రౌండ్, బేగంపేట ప్రాంతాల్లో దర్శనమిచ్చాయి. అమిత్‌షాను ప్రశ్నించే పోస్టర్లను ఎవరు వేశారో వివరాల్లేవు.
- కాగా.. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగానూ కొన్ని చోట్ల పోస్టర్లు వెలిశాయి. కేసీఆర్ ఫొటోలతో డీల్స్ కుదురును 30 శాతం కమిషన్‌తో అంటూ.. 'స్కామ్ 2023' సినిమా మంచి అనుభవం కోసం 3డీ (30 శాతం) గ్లాస్ కళ్లజోడు వాడండి అన్నట్లు పేర్కొంటూ కళ్లజోడుతో ఉన్న కేసీఆర్ ఫొటోలతో ఈ పోస్టర్లు వెలిశాయి. బుక్‌మై షో స్థానే బుక్‌మై సీఎం అంటూ ముద్రించారు.



కర్రలు తొలిగే.. గణపతి వెలిగే..

ఖైరతాబాద్ మహా గణపతి భక్తులకు దర్శనమిచ్చేందుకు సిద్ధమయ్యాడు. శనివారం రాత్రి మహాగణపతి విగ్రహం నుంచి కర్రలను తీసివేసినట్లు గణేష్ ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు.

తుక్కుగూడ పిక్కటిల్లేలా..

కాంగ్రెస్ విజయ భేరి నేడే

- వంద ఎకరాల్లో సభ ఏర్పాటు
- సుమారు పది లక్షల మందితో..
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీపీసీసీ నేతలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ వేదికగా ఆదివారం సాయంత్రం నిర్వహించతలపెట్టిన కాంగ్రెస్ విజయభేరి సభకు సర్వం సిద్ధమైంది. ఫ్యాబ్‌సిటీ సమీపంలోని వంద ఎకరాల విస్తీర్ణంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ సహా యువనేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ సహా సీడబ్ల్యూసీ ముఖ్యులు, అన్ని రాష్ట్రాలకు చెందిన పీసీసీ అధ్యక్షులు, డీసీసీలు, అనుబంధ సంఘాల నేతలు హాజరు కానుండటంతో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఈ సభను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నియోజకవర్గాల వారీగా భారీగా జన సమీకరణ చేయాలని నేతలకు టార్గెట్లు ఇచ్చింది. ఇందు కోసం 300 బస్సులను కూడా సిద్ధం చేసింది.

రెయిన్ ప్రూఫ్ టెంట్లు..

భారీ వర్షానికి సైతం నేతలు తడవకుండా ఉండేందుకు రెయిన్ ప్రూఫ్ టెంట్లను వేశారు. నేతల ప్రసంగాలు స్పష్టంగా విన్పించేందుకు సభాస్థలికి నాలుగు వైపులా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం చుట్టూ పెద్ద సంఖ్యలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. స్వాగత తోరణాలు, భారీ కటౌట్లు, ఫ్లెక్సీల ఏర్పాటులో ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలు పోటీపడ్డారు. సీడబ్ల్యూసీ ముఖ్య నేతల కోసం ప్రధాన వేదికను కేటాయించారు. పీసీసీలు, మాజీ మంత్రులు, ఎంపీల కోసం ఒకటి.. డీసీసీలు, అనుబంధ సంఘాల నేతలు, కళాకారుల కోసం మరో స్టేజీని కేటాయించారు. ఈ మూడు వేదికలపై సుమారు 250 మంది ఆసీనులు కానున్నారు. సభకు వచ్చే ముఖ్య నేతల వాహనాలను ప్రధాన వేదిక వెనుక భాగంలోనే పార్కింగ్ చేయించనున్నారు. ఇతర నేతలు, కార్యకర్తల వాహనాల కోసం సర్వీసు రోడ్డుతో పాటు ఆ ప్రాంగణానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలను కేటాయించారు.

భారీ బందోబస్తు..

తుక్కుగూడకు వచ్చి వెళ్లే నాలుగు ప్రధాన రహదారులపై భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 27 మంది సీఐలు, 61 మంది మంది ఎస్ఐలు, 600 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించనున్నారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు తాజ్‌కృష్ణ హోటల్ నుంచి బయలుదేరే ముఖ్య నేతల వాహనాలు శంషాబాద్ నుంచి ఓఆర్ఆర్ మీదుగా తుక్కుగూడకు చేరుకుంటాయి. అటు నుంచి ర్యాలీగా ప్రధాన వేదిక వెనుకభాగంలోని ఫ్యాబ్‌సిటీ నుంచి సభా ప్రాంగణానికి అనుమతించనున్నారు. మిగిలిన వాహనాలను ప్రధాన రహదారి నుంచి అనుమతిస్తారు.



తుక్కుగూడ ప్రధాన రహదారిపై వెలసిన కాంగ్రెస్ ఫ్లెక్సీలు

ఆధునిక హంగులతో ఆర్టీసీ నర్సింగ్ కళాశాల

తార్నాక ఆసుపత్రి ప్రాంగణంలో ప్రారంభించిన చైర్మన్, ఎండీ



సాక్షి, సిటీబ్యూరో: అత్యాధునిక హంగులతో నిర్మించిన ఆర్టీసీ నర్సింగ్ కళాశాల నూతన భవనాన్ని సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్‌లు శనివారం ప్రారంభించారు. తార్నాక ఆసుపత్రిలో సుమారు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్ల వ్యయంతో ఈ నాలుగంతస్తుల భవన సముదాయాన్ని సంస్థ నిర్మించారు. అనంతరం తరగతి గదులు, లేబొరేటరీలను పరిశీలించారు. నూతన భవనంలో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ..సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తార్నాక ఆస్పత్రికి అనుబంధంగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి వైద్య రంగంలో మంచి భవిష్యత్ ఉందని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నర్సింగ్ కోర్సులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు త్రిష, అమూల్యలను ఆయన ఘనంగా సన్మానించారు. త్రిషకు రూ.10 వేలు, అమూల్యకు రూ.7 వేల నగదు పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.రవీందర్, తార్నాక ఆసుపత్రి సలహాదారు, ఓఎస్డీ సైదిరెడ్డి, ఈడీ కృష్ణకాంత్, జాయింట్ డైరెక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, సీఈఈ రాంప్రసాద్, సీఎఫ్ఎం విజయపుష్ప, తార్నాక ఆస్పత్రి సూపరింటెండెంట్ శైలజా కృష్ణమూర్తి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర తులసి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవం

సాక్షి, మేడ్చల్ జిల్లా: జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో జాతీయ పతాకాన్ని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ, ఫ్యాక్టరీలు, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థులు,వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

27 కేసులు..13 మార్లు జైలు

- తీరు మారని మహ్మద్ అక్రమ్
- మరోమారు సౌత్‌జోన్ క్రైం పోలీసులకు పట్టుబడ్డ నిందితుడు

హిమాయత్‌నగర్: ఒకటి కాదు రెండు కాదు..ఏకంగా 26 కేసుల్లో నిందితుడిగా ఉండి..ఇప్పటికే 12 మార్లు జైలు శిక్షకు గురైన ఫలక్‌నుమా వాసి మహ్మద్ అక్రమ్ (23) ఎట్టకేలకు సౌత్‌జోన్ క్రైం టీం, సీసీఎస్ పోలీసులకు పట్టుబడ్డాడు. అక్రమ్ నుంచి రూ.3 లక్షల ఖరీదైన బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు శనివారం రిమాండ్‌కు పంపారు. మహ్మద్ అక్రమ్ చిన్నతనం నుంచే బైక్ దొంగతనాలకు అలవాటుపడ్డాడు. ఇతనిపై తొలిసారి కుల్సుంపురా పీఎస్‌లో బైక్ చోరీ కేసు నమోదైంది. ఆ తర్వాత తాజాగా లంగర్‌హౌజ్ పీఎస్‌లో నమోదైన కేసులతో సంఖ్య 27కు చేరింది. 13వ సారి జైలుపాలయ్యాడు. ఇటీవల హుమాయన్‌నగర్, మైలార్‌దేవులపల్లి, లంగర్‌హౌజ్ పీఎస్‌లలో రూ.లక్ష ఖరీదు చేసే మూడు బైక్‌లను చోరీ చేశాడు. పోలీసులు పట్టుకోవడానికి వెళ్లిన ప్రతిసారీ బ్లేడుతో చేయి కోసుకోవడం, ఆత్మహత్యాయత్నాలకు పాల్పడటం చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతుంటాడు. సీసీఎస్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో సౌత్‌జోన్ క్రైమ్ టీం ఇన్‌స్పెక్టర్ వి.ఆనంద్‌కిషోర్ చాకచక్యంగా అక్రమ్‌ను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సివిల్ సర్వీసెస్ పరీక్ష కేంద్రాల పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష జరుగుతున్న కోఠి ఉమెన్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని శనివారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. అక్కడ చేసిన ఏర్పాట్లను కళాశాల ప్రిన్సిపాల్‌ని అడిగి తెలుసుకున్నారు. పరీక్ష జరుగుతున్న ప్రతి హాల్‌కు వెళ్లి పరిశీలించారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించి అనుమతించాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాణి, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, పరీక్ష కేంద్రం కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

ఈఎస్ఐసీ ఆసుపత్రిలో రోగి సహాయకురాలిపై లైంగిక దాడి

అమీర్‌పేట: సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కళాశాల బోధన ఆసుపత్రిలో రోగికి సహాయకురాలిగా వచ్చిన యువతిపై లైంగికదాడి జరిగింది. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం..కర్నాటకకు చెందిన ఓ కుటుంబం ఆర్‌సీ పురంలో ఉంటోంది. 19 ఏళ్ల వయసున్న యువతి సోదరుడు అనారోగ్యంతో ఈఎస్ఐసీ మెడికల్ కళాశాల బోధన ఆసుపత్రిలో చేరాడు. ఇతనికి సహాయకురాలిగా వచ్చిన యువతి శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో భోజనం చేసేందుకు 5వ అంతస్తులోని వార్డు నుండి కింద ఉన్న క్యాంటిన్‌కు వచ్చింది. అదే సమయంలో ఆస్పత్రిలో పనిచే ఓ సెక్యూరిటీ గార్డు ఆమెతో మాటలు కలిపి.. క్యాంటీన్‌లో పనిచేసే షాదాబ్ (33)ను పరిచయం చేశాడు. భోజనం చేశాక యువతి లిఫ్ట్‌లో వెళ్తుండగా షాదాబ్ ఆమెతోపాటే వచ్చి రెండో ఫ్లోర్‌కు ఆమెను తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి..పక్కనే ఉన్న ల్యాబ్‌లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. భయభ్రాంతులకు గురైన యువతి సోదరుడికి ఫోన్ చేయడంతో కిందకు వచ్చి ఆమెను తీసుకుని వార్డుకు వెళ్లి..అతడి బెడ్ పక్కనే ఉన్న మహిళకు జరిగిన విషయాన్ని తెలిపారు. ఆమె వార్డులోని డ్యూటీ సిస్టర్‌కు తెలుపగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి..వైద్యపరీక్షల నిమిత్తం యువతిని ఆసుపత్రికి తరలించారు. యువతిని భరోసా కేంద్రానికి పంపామని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన షాదాబ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

సోషల్ మీడియాపై పోలీస్ నిఘా!

- వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు
- వరుస పండుగలు, ఎన్నికల నేపథ్యంలో అలర్ట్
- ఐఎంఈఐ నంబరు, ఐపీ అడ్రస్ ఆధారంగా గుర్తింపు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో పాలక, ప్రతిపక్ష పార్టీల సమావేశాలతో ఎన్నికల వాతావరణం నెలకొంది. దీనికి తోడు గణేశ్ నవరాత్రులు, నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ, దసరా, దీపావళి ఇలా వరుస పండుగలు వస్తున్నాయి. దీంతో గ్రేటర్ పోలీసులు అలర్ట్ అయ్యారు. సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే పోస్టులపై పోలీసు యంత్రాంగం దృష్టి పెట్టింది. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, స్నాప్‌చాట్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై నిఘా పెట్టారు. సైబర్ పెట్రోలింగ్, హైదరాబాద్‌లో సోషల్ మీడియా యాక్షన్, స్క్వాడ్ ఆఫ్ హైదరాబాద్ (స్మాష్) పేరిట రంగంలోకి దిగారు.

- సామాజిక మాధ్యమాలతో రెప్పపాటులోనే ప్రపంచం నలువైపులా భావోద్వేగాలను రెచ్చగొట్టే పరిస్థితి వచ్చింది. ఇది శాంతి భద్రతల సమస్యకు కారణమవుతోంది.
- సామాజిక మాధ్యమాలలో ఎవరైనా అశ్లీల, అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టులు, విద్వేష ప్రసంగాలు, వందతులు, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను పెడితే వాటిపై ఫిర్యాదులు వచ్చి.. చర్యలు తీసుకునేలోపే అనర్థం జరుగుతోంది.
- దీన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులు సైబర్ పెట్రోలింగ్, స్మాష్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక టూల్ సహాయంతో పోలీసులు వీటిని గుర్తిస్తారు.
- సాధారణ రోజుల్లో 4–5 వేల సామాజిక ఖాతాలను పరిశీలిస్తే.. ఇలాంటి కీలకమైన సమయాల్లో రోజుకు 10 వేలకు పైగా సోషల్ అకౌంట్లను విశ్లేషిస్తుంటారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంశాలను గుర్తించగానే పోలీసు విభాగాలన్నీ అప్రమత్తమవుతారు. ఆ పోస్టు చేసిన వ్యక్తి లేదా సంస్థలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించి, వీరిపై ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేస్తారు.
- వదంతులు వ్యాప్తి చేసే వారి ఫోన్ ఐఎంఈఐ నంబర్లు, ఐపీ అడ్రస్‌ల ఆధారంగా క్రియేటర్లను పోలీసులు గుర్తిస్తారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

కిడ్నాప్ నిందితురాలి గుర్తింపు

దొరకని 'నిలోఫర్' బాలుడి ఆచూకీ

సాక్షి, సిటీబ్యూరో: గత గురువారం నిలోఫర్ ఆసుపత్రిలో గుర్తు తెలియని మహిళ ఆరు నెలల చిన్నారిని కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటన జరిగి రెండు రోజులు గడుస్తున్నా, నిందితురాలి రాకపోకలు పసిగట్టినా బిడ్డ ఆచూకీ మాత్రం ఇంకా లభ్యం కాలేదు. బాలుని కిడ్నాప్‌కు కొన్ని గంటల ముందు ఒట్టిచేతుల్తో ఆసుపత్రి లోపలికి నిందితురాలు వస్తున్నట్టు , తిరిగి చేతుల్లో చిన్నారితో వేగంగా నడుస్తూ వెళ్లడం కూడా సీసీ కెమెరా ద్వారా చిన్నారి తల్లి కూడా నిందితురాల్ని గుర్తించింది. అనంతరం ఎమ్మెల్యే ఫిరోజ్ ఖాన్ ఇంటి మీదుగా చిన్నారిని ఎత్తుకుని నడుచుకుంటూ వెళ్లినట్టు కూడా గుర్తించారని సమాచారం. కాగా బిడ్డని ఎత్తుకెళ్లాలనే ముందస్తు ప్లాన్‌తోనే ఆగంతక మహిళ నిలోఫర్ ఆసుపత్రిలోకి ప్రవేశించినట్టు తేలింది. ఎమర్జెన్సీ వార్డులో ఉన్న తన నాలుగేళ్ల కుమారుడి కోసం రెండో బిడ్డని చంకనెత్తుకుని వచ్చిన తల్లి ఫరీదాని పరిచయం చేసుకుని తన కొడుకు పక్క వార్డులో చికిత్స పొందుతున్నాడని నమ్మబలికింది. అలా కాసేపు ఆ ఆగంతక మహిళ ఫరీదాతో చనువుగా సంభాషించడంతో ఫరీదా బయటకు వెళ్లినప్పుడు ఆ మహిళ చిన్నారిని ఎత్తుకున్నా చుట్టుపక్కల వాళ్లు అనుమానించలేదు. సెల్‌ఫోన్‌ను చూపిస్తూ చిన్నారిని ఆడిస్తూన్నట్టు నటిస్తూ ఆగంతక మహిళ అక్కడ నుంచి నిష్క్రమించిందని ప్రత్యక్ష సాక్షులు మాటల్ని బట్టి తెలుస్తోంది. కాగా ఆసుపత్రిలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదనే వార్తలు అవాస్తవమని నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉషారాణి తెలిపారు. ఐసీయూ బిల్డింగ్ మొత్తం కెమెరాలు ఉన్నాయని, అవన్నీ పనిచేస్తున్నాయని చెప్పారు. వాటి ద్వారానే నిందితురాలని గుర్తించగలిగామన్నారు.

నేడు మజ్లిస్ సమైక్యత సభ

సాక్షి, సిటీబ్యూరో: భారతదేశంలో హైదరాబాద్ స్టేట్ విలీనమైన సెప్టెంబర్ 17 రోజును జాతీయ సమైక్యత దినోత్సవం పేరుతో మజ్లిస్ పార్టీ ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. నాంపల్లిలోని దర్గా యూసఫియన్ నుంచి మాసబ్ ట్యాంక్ వరకు భారీ బైక్‌ర్యాలీ చేపట్టి అనంతరం అక్కడి హాకీ స్టేడియంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకల సభలో పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా మజ్లిస్ పార్టీ పెద్ద ఎత్తున కటౌట్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. సభకు సైతం పెద్ద ఎత్తున జనాన్ని సమీకరిస్తోంది.

క్లుప్తంగా...

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సారంగి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువ రచయిత ఖాజ ఆఫ్రిది రచించిన మిరాబ్ పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ..యువ సాహిత్య, రచయితలు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సినీ దర్శకుడు వేణు, కవులు యాకూబ్, స్కైబాబ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత మెర్సీ మార్గరేట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆంథోని సగయరాజ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో సెయింట్‌జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నియో ఫెస్టా పేరిట ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని పెట్టుకుని లక్ష్య సాధనకై పాటుపడాలని సూచించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.మారెడ్డి, కళాశాల బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'విమోచన దినాన్ని ఘనంగా నిర్వహిస్తాం'



దేవర శ్రీనివాస్

గోల్కొండ: అధికార దాహంతో సీఎం కేసీఆర్ తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం ఆయన గుడిమల్కాపూర్‌లో మాట్లాడుతూ.. తెలంగాణలో తొమ్మిది ఏళ్ల క్రితం మళ్లీ నిజాం నిరంకుశ పాలన ప్రారంభమైందని.. పక్కా నిజాం లాగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. నేడు జరగనున్న విమోచనదినోత్సవానికి కార్వాన్ నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీగా తరలి వెళ్తున్నట్లు ఆయన అన్నారు.

దూది కార్ఖానాలో చెలరేగిన మంటలు



డబీర్‌పురా: దూది కార్ఖానాలో షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగిన ఘటన శనివారం రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రెయిన్‌బజార్ పీఎస్ పరిధిలో శనివారం తెల్లవారుజామున యాకుత్‌పురా షౌకత్ జంగ్ దేవిడిలోని దూది కార్ఖానాలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. నిర్వాహకులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ తేదీని ప్రకటించాలి



బషీర్‌బాగ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ వస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ఏ తేదీన ప్రవేశపెడతారో స్పష్టంగా ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు, నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని కోరుతూ శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తాలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ తమ సమావేశంలో ఎస్సీవర్గీకరణకు అనుకూలం తీర్మానం చేయాలని కోరారు. మహిళా, బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో పెట్టాలని ప్రధానమంత్రిని కోరిన సీఎం కేసీఆర్ ఎస్సీ వర్గీకరణ బిల్లుమీద ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ తీరు మాదిగ జాతికి చేసిన ద్రోహమేనని ధ్వజమెత్తారు. అనంతరం ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో మాదిగ కళామండలి అధ్యక్షుడు అశోక్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ, రాష్ట్ర, నగరానికి చెందిన ఇనుముల నర్సయ్య మాదిగ, కొమ్ముశేఖర్ మాదిగ, పూజలోల్ల రవి మాదిగ, డప్పు మల్లికార్జున్ మాదిగ, గణేష్ మాదిగ, మహేష్ మాదిగ, సుజాత మాదిగ, రాము మాదిగ, శ్యామ్‌రావు మాదిగ, కుమ్మరి సత్యనారాయణ మాదిగ, శివ మాదిగలతో పాటు అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్



టోలిచౌకిలోని తన కార్యాలయంలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావడానికి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో 'ప్రజా దర్బార్' నిర్వహించారు. ఈ సందర్భంగా కార్వాన్, గుడిమల్కాపూర్, టోలిచౌకి తదితర ప్రాంతాల నుంచి పలువురు ఆయన దగ్గరకు వచ్చి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన వారి విన్నతులను స్వీకరించి మాట్లాడారు. మజ్లిస్ పార్టీ ప్రజల పార్టీ అని ప్రజా సమస్యల పరిష్కారానికి తమ పార్టీ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని అన్నారు. నేడు కార్వాన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగని బస్తీ గానీ, కాలనీ గానీ లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

హెచ్‌సీడబ్ల్యూఆర్ సదస్సుకు సయ్యద్ షాహబాజ్ అహ్మద్



ఉపాధ్యాయులతో సయ్యద్ షాహబాజ్ అహ్మద్

గోల్కొండ: రిపబ్లిక్ ఆఫ్ కొరియాలో జరగనున్న అవెన్లీ కల్చర్, వారల్డ్ పీస్, రిస్టోరేషన్ ఆఫ్ లైట్ సదస్సుకు గోల్కొండ ది రైజింగ్ స్టార్ నేషనల్ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ షాహబాజ్ అహ్మద్ ఎంపికయ్యారు. ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు రిపబ్లిక్ ఆఫ్ కొరియాలోని సియోల్‌లో ఈ సదస్సు జరగనుంది. ప్రపంచ శాంతి, మతసామరస్యం తదితర వాటిపై రెండు దశాబ్దాలుగా తాము విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీనిని గుర్తించిన హెచ్‌సీడబ్ల్యూఆర్ వారు తమకు ఆహ్వానం పంపారని ఆయన అన్నారు. హెచ్‌సీడబ్ల్యూఆర్ ప్రతినిధులు ప్రతి సంవత్సరం రెండు దఫాలుగా తమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతారని ఆయన అన్నారు. సియోల్‌లో వరల్డ్ అలయన్స్ రిలిజియన్స్ పీస్ సదస్సుకు తాను ప్రత్యేక అతిథిగా హాజరవుతున్నానని ఆయన తెలిపారు.

దోస్త్‌లో క్రీడాకారులకు రెండు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



లింబాద్రికి వినతి పత్రాన్ని అందజేస్తున్న శాగంటి రాజేష్

నాంపల్లి: రాష్ట్ర విద్యా వ్యవస్థలో క్రీడాకారులకు రెండు శాతం రిజర్వేషన్ల పద్ధతిని అమలు చేయాలని స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి రాజేష్ విజ్ఞప్తి చేశారు. శనివారం రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కలిసి ఆరు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాగంటి రాజేష్ మాట్లాడుతూ..క్రీడా కోటాను అమలు చేకపోవడం వల్ల క్రీడాకారులకు తీరని అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. రెండు శాతం కోటాను అమలు చేయకపోతే క్రీడాకారులకు విద్య అందని ఫలంగా మారుతుందని తెలిపారు. దోస్త్‌లో రెండు శాతం స్పోర్ట్స్ రిజర్వేషన్ ప్రకారం క్రీడాకారులకు అన్ని డిగ్రీ కోర్సులలో సీట్లను మంజూరు చేయాలని కోరారు. చైర్మన్ లింబాద్రి సానుకూలంగా స్పందించినట్లు రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేతలు వెంకటేష్, సురేష్, గణేష్, ప్రవీణ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



జియాగూడ: తాగునీటి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వాటర్‌వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు డీజీఎం శ్రీనివాసరావు అన్నారు. జియాగూడలోని సంజయనగర్ వాల్మీకినగర్‌లో నూతన ఏయిర్‌వాల్ డ్రింక్ వాటర్ పైప్‌లైన్ మరమ్మతులను చేపట్టగా ఆయన స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జియాగూడ సెక్షన్ పరిధిలో ఎలాంటి లీకేజీలు ఉన్నా, తాగునీరు కలుషితంగా సరఫరా అవుతున్నా.. తక్షణమే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జియాగూడ వాటర్‌వర్క్స్ సిబ్బంది దుర్గాప్రసాద్, డివిజన్ బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు బగిడి రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.

విమర్శ, పరిశోధన రంగాల్లో స్త్రీల ప్రాతినిధ్యం పెరగాలి



మాట్లాడుతున్న ఆచార్య మృణాళిని

చార్మినార్: స్త్రీలు సృజన ప్రక్రియలతో పాటు విమర్శ రంగంలోకి వచ్చినప్పుడే సాహిత్యానికి సమగ్రత లభిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ ఆచార్య సి.మృణాళిని అన్నారు. అన్వేషి స్త్రీల పరిశోధన సంస్థ, ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా నిర్వహించిన స్త్రీల రచనలు–విభిన్న దృక్పథాలు, సమాలోచన రెండు రోజుల జాతీయ సదస్సులో మృణాళిని తన కీలకోపన్యాసంలో రాజకీయ, ఆర్థిక, నాటక, కళా, మీడియా రంగాలలో స్త్రీలు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. విమర్శ, పరిశోధన రంగాలలో స్త్రీలు చేస్తున్న కృషిపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ సాహితీవేత్త ఓల్గా, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కోయి కోటేశ్వర్ రావు, డాక్టర్ జె.నీరజా, డాక్టర్ ఉమామహేశ్వరితో పాటు ఆచార్య కాత్యాయని విద్మహే, ఆచార్య మధుజ్యోతి, ఆచార్య ఎం.ఎం.వినోదిని, ఆచార్య త్రివేణి పాల్గొన్నారు.

పుప్పాల అనిల్‌కుమార్‌కు అవార్డు ప్రదానం



అవార్డును అందజేస్తున్న డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తదితరులు

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పుప్పాల అనిల్‌కుమార్‌కు విశ్వేశ్వరయ్య స్మారక అవార్డు 2023 ప్రదానం చేశారు. తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ ఈ వార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రొఫెసర్ రాంచంద్ర, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్‌లతో పాటు డాక్టర్ మహ్మద్ అక్బర్ అలీ, ప్రముఖ విద్యావేత్త జక్కుల విజ్ఞత, రామకృష్ణ శాస్త్రి, శ్యామ్‌రావు ముదిరాజ్ డాక్టర్ పుప్పాల అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

గోల్కొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని గోల్కొండ జగదాంబిక మహంకాళీ వృత్తి పనివారి సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. శనివారం గోల్కొండ రిసాలబజార్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహంకాళీ ఆలయ పూజారి బి.సురేష్‌చారి తదితరులున్నారు.





జియాగూడ: తెలంగాణ సాగునీటి చరిత్రలో చారిత్రక ఘట్టం అని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. శనివారం సీఎం కేసీఆర్ ప్రారంభించిన పాలమూరు, రంగారెడ్డి జిల్లా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్యక్రమానికి కార్వాన్ నియోజకవర్గం నుంచి మిత్ర కృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అభిషేక్ మిత్ర, మోహన్, ఉమేష్, సందీప్‌లాల్, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన నగర కాంగ్రెస్ యువనాయకులు



నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు ఒగ్గి శ్రీధర్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గానికి చెందిన నగర కాంగ్రెస్ యువనాయకులు ఒగ్గి శ్రీధర్‌తో పాటు తెలుకుంట్ల సతీష్‌గుప్తా, ముఖేష్, కృష్ణాచారి, సంత్ బీఆర్ఎస్‌లో చేరారు. గోషామహల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నందకిశోర్ వ్యాస్ బిలాల్ వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఒగ్గి శ్రీధర్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ..నగర కాంగ్రెస్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకులకు గుర్తింపు లేదన్నారు. గోషామహల్‌లో కాంగ్రెస్ పార్టీలో 20 ఏళ్లకు పైగా ఉన్నా పార్టీ నాయకులు తమను పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ చేపడుతున్న ప్రగతి, అభివృద్ధిని చూసి తాము బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ..పలు పార్టీల వారు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

మానవ తప్పిదాలే పర్యావరణానికి ముప్పు



సోమేశ్వర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్

చార్మినార్: మానవ తప్పిదాలే పర్యావరణానికి ముప్పని ఉస్మానియా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర ఆచార్యులు పోలా సోమేశ్వర్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవన విధానంలోని మార్పులే వాతావరణ కాలుష్యానికి కారణమని.. రిఫ్రిరేటర్లు, ఎయిర్ కండీషనర్ల విపరీత వాడకంతో ఓజోన్ పొర క్షీణించి చర్మ కేన్సర్, కంటి శుక్లాల కేసులు పెరుగుతున్నాయన్నారు. నీటి శుద్ధీకరణ, పర్యావరణ సంరక్షణ, కాంతి ఉత్ప్రేరణ, నానో, అర్ధవాహకాలు, వ్యర్థం నుంచి ఉపయోగితమైన పదార్థాన్ని తయారు చేయడం వంటి అంశాలపై ఉపన్యాసించారు. అనంతరం విద్యార్థులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ యాదయ్య, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ దయానంద్, వసంత, బూసి అనిల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి



మండప నిర్వాహకులతో బోనాల శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. శనివారం సిద్ధంబర్ బజార్‌లోని బహేతీ భవన్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోషామహల్ నియోజకవర్గం మండప నిర్వాహకుల సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అభిషేక్ సింగ్, శక్తి సింగ్, ఆశీష్ వ్యాస్, వెంకటేష్ గౌడ్, జశ్వంత్, రాజేష్ సింగ్, అరుణ్ సింగ్, పవన్ షిండే, రమేష్ వ్యాకర్, రాహుల్, అనిరుద్ ఆగర్వాల్, సంతోష్ వర్మ, వగరమ్ పాల్గొన్నారు.



రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థినుల సత్తా



విద్యార్థినులను అభినందిస్తున్న విద్యావేత్తలు

విజయనగర్‌కాలనీ: నేషనల్ రెజ్లింగ్ పోటీల్లో విజయనగర్‌కాలనీ నారాయణ ఈ–టెక్నో పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. 8వ తరగతి విద్యార్థిని టి.వైష్ణవి, 9వ తరగతి విద్యార్థిని అలంక్రిత యాదవ్ ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు హరియాణాలో జరిగిన నేషనల్ సబ్ జూనియర్ రెజ్లింగ్ పోటీల్లో గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ నౌసీర్ ఖాతూన్ రెజ్లర్లకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. విద్యావేత్తలు మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడా రంగంలో నైపుణ్యాన్ని సంపాదించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ.నవీన్‌కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్

బహదూర్‌పురా: అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బహదూర్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా నవాబ్‌సాబ్‌కుంట ప్రాంతానికి చెందిన షేక్ ఆజం (35) కొంతకాలంగా గంజాయిని సేకరించి అవసరమైన వారికి విక్రయిస్తున్నాడు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బహదూర్‌పురా పోలీసులతో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో షేక్ ఆజంను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 980 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం బహదూర్‌పురా పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు షేక్ ఆజంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

జీఎన్ఐటీఎస్‌లో ఇంజినీర్స్ డే



వేడుకల్లో జీఎన్ఐటీఎస్ అధ్యాపకులు, విద్యార్థులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ ఛాప్టర్ ఆధ్వర్యంలో ఏఐఅండ్‌హూమన్ ఇంటలిజెన్స్ అనే సంకేతిక అంశంపై ఈ సందర్భంగా చర్చ గోష్టి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్టూడెంట్ యాక్టివిటీ చైర్మన్ సాయికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధ, మానవ మేధస్సులపై ఆయన విద్యార్థులకు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృత్రిమ మేధకు సరైన విధంగా ఉపయోగించుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, ఐఈఈఈ మెంటార్ డాక్టర్ మల్లారెడ్డి, బ్రాంచ్ కౌన్సిలర్ డాక్టర్ హిమబిందు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ పద్మజ, వందన, ప్రణతి పాల్గొన్నారు.

గోషామహల్‌లో భారీ ప్రదర్శన

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు భారీ ప్రదర్శన చేపట్టారు. గోషామహల్ నుంచి బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, నగర గ్రంథాలయ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, బీఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, శైలేష్ కురుమ, శ్రీనివాస్‌యాదవ్, హజర్ అన్వర్, టింకు, శివరాజ్ సింగ్, బల్‌దీప్ సింగ్, ధినేష్ సింగ్‌లో పాటు పలువురు నాయకులు భారీ ఎత్తున కార్లతో ర్యాలీ నిర్వహించారు. నగరం నుంచి కొల్లాపూర్‌కు వెళ్లిన సీఎం కేసీఆర్‌తో పాటు ర్యాలీలో పాల్గొన్నారు. వీరితో పాటు బషీర్‌బాగ్, గన్‌ఫౌండ్రీ నుంచి గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌గుప్తా, మమతా గుప్తా ఆధ్వర్యంలో భారీ కార్లతో కేసీఆర్ ర్యాలీతో కలిసి కొల్లాపూర్‌కు తరలివెళ్లారు.

గన్‌ఫౌండ్రీ నుంచి..

గోషామహల్ నియోజకవర్గం గన్‌ఫౌండ్రీ నుంచి బీఆర్ఎస్ నాయకులు మమతా గుప్తా, సంతోష్ గుప్తాలు భారీ ర్యాలీ నిర్వహించారు.



భారీ ప్రదర్శనతో కొల్లాపూర్‌కు తరలిన నందకిశోర్ వ్యాస్ బిలాల్, గడ్డం శ్రీనివాస్ యాదవ్



ర్యాలీలో మమతా గుప్తా, సంతోష్ గుప్తా

రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేతలు



సంతోష్‌నగర్: రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా శనివారం జోరాబీ దర్గా, కుమ్మర్‌వాడీ, సంతోష్ నగర్ ప్రాంతాల్లోని ఆక్రమణలను జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో సిబ్బందితో జేసీబీతో కూల్చివేతలను చేపట్టారు. కూల్చివేతల సందర్భంగా సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పూసపాటి శివచంద్ర ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

సీతారామ్‌బాగ్‌లో భారత భాగ్య సమృద్ధి యజ్ఞం



యజ్ఞం వేడుకల ప్రచారాన్ని ప్రారంభించిన మాధవిలత కొంపెల్ల తదితరులు

అబిడ్స్: సీతారామ్‌బాగ్‌లో అక్టోబర్ 15వ తేదీ నుంచి 45 రోజుల పాటు భారత భాగ్య సమృద్ధి యజ్ఞం వేడుకలు నిర్వహిస్తున్నట్లు యాగ నిర్వాహకులు లతామా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ మాధవిలత కొంపెల్ల వెల్లడించారు. శనివారం సీతారామ్‌బాగ్ జగనాథమఠ్‌లో శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ వ్రతధర జీయర్ స్వామీజీకి యజ్ఞ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మాధవిలత మాట్లాడుతూ..సీతారామ్‌బాగ్‌లో 45 రోజుల పాటు అక్టోబర్ 15వ తేదీ నుంచి నవంబర్ 27వ తేదీ వరకు యజ్ఞ కార్యక్రమం చేపడుతామన్నారు. ప్రతిరోజూ పెద్ద ఎత్తున యజ్ఞాలు నిర్వహిస్తామన్నారు. 36 రకాల వైదిక విధులు, 12 రకాల కళ్యాణాలు, పలు రకాల హోమాలు చేస్తామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రమోద్‌కుమార్, శ్రద్ధానంద్, యమన్ సింగ్, ఎం.కృష్ణ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య


భార్గవ్ ప్రసాద్

పట్‌పల్లి(అందోల్): పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్న కుమారుడిని తండ్రి మందలించగా మనస్తాపం చెందిన ఆ కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లాలో శనివారం వెలుగులోకి వచ్చింది. అందోల్ మండలం అక్సాన్‌పల్లి గ్రామానికి చెందిన జంబుల భార్గవ్ ప్రసాద్ (14) పుల్కల్ మండలంలోని సింగూర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. 20 రోజుల క్రితం హాస్టల్‌లో భోజనం బాగోలేదని ఇంటికొచ్చాడు. తిరిగి వెళ్లకపోవడంతో ఈనెల 11న తండ్రి జంబులకుమార్ కుమారుడిని మందలించగా అదేరోజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇటు స్కూల్‌కు వెళ్లలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బంధువు లు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈనెల 12న జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, కుమార్ ఇంటి వెనుక ముళ్ల పొదల్లో నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్తులు అక్కడికి వెళ్లి పరిశీలించగా ప్రసాద్ చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. కాగా, మృతదేహం కుళ్లిపోయి ఉండటాన్ని గమనించారు. పోలీసులకు, కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ప్రసాద్ మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యువకుడి వేధింపులతో బాలిక ఆత్మహత్య

- ప్రేమించాలంటూ వెంట పడటంతో ఆవేదన
- ఖమ్మం జిల్లాలో ఘటన

కారేపల్లి (ఖమ్మంజిల్లా) : ప్రేమించాలంటూ ఓ యువకుడు వెంటబడి వేధిస్తుండటంతో తట్టుకోలేక బాలిక భయపడి ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రాజలింగాలకు చెందిన మేకల నవీన్, కారేపల్లి మండలం చీమలపాడుకు చెందిన ఓ బాలిక వెంట పడుతున్నాడు. తనను ప్రేమించాలంటూ వేధిస్తుండటంతో ఆమె తల్లిదండ్రులకు చెప్పగా యువకు డిని మందలించి వదిలేశారు. అయినా తీరు మార్చుకోని ఆ యువకుడు శుక్రవారం సాయంత్రం బాలిక తల్లిదండ్రులు లేని సమయం చూసి ఇంట్లోకి చొరబడి తనను ప్రేమించాల్సిందేనని బెదిరించడంతో భయపడిన బాలిక ఇంట్లోనే పురుగుమందు తాగింది. స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక శనివారం మృతి చెందింది. ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ తెలిపారు.

అరబిక్ క్లాసుల ముసుగులో ఉగ్ర పాఠాలు!

చెన్నైకు చెందిన ఐసిస్ ఉగ్రవాది వ్యవహారమిది

- కొన్నాళ్లు హైదరాబాద్‌లోనూ నివాసం
- ఇటీవలే విదేశాలకు పారిపోయిన ఆ కీలక సూత్రధారి
- దర్యాప్తులో గుర్తించిన జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు
- నగరంలోని సానుభూతిపరుల ఇళ్లలో ముమ్మర సోదాలు
- పలు పుస్తకాలతో పాటు డిజిటల్ పరికరాలు స్వాధీనం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ–తమిళనాడుల్లో ఉన్న కొన్ని కేంద్రాలు అరబిక్ క్లాసుల ముసుగులో ఉగ్రవాద పాఠాలు బోధిస్తూ, యువతను ఐసిస్ వైపు ఆకర్షిస్తున్నాయా? ఔననే అంటున్నాయి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) వర్గాలు. ఇలా ప్రేరేపించిన నేపథ్యంలోనే 2022 అక్టోబర్ 23 కోయంబత్తూరులోని సంగమేశ్వర దేవాలయం వద్ద కారు బాంబు పేలుడు జరిగిందని స్పష్టం చేస్తోంది. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న చెన్నై ఎన్‌ఐఏ యూనిట్ శనివారం హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో సోదాలు చేసింది. హైదరాబాద్–తమిళనాడుల్లో మొత్తం 31 చోట్ల తనిఖీలు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ సోదాల్లో ఉగ్రవాద సంబంధిత పుస్తకాలు, పత్రాలతో పాటు ఫోన్లు, ల్యాప్‌టాప్స్, హార్డ్ డిస్క్‌లు వంటి డిజిటల్ పరికరాలు, రూ.60 లక్షల నగదు, 18,200 అమెరికన్ డాలర్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ పుస్తకాలు, పత్రాలు అరబిక్‌తో పాటు తెలుగు, తమిళం భాషల్లో ఉన్నట్లు అధికారులు వివరించారు. యువతను ఐఎస్‌ఐఎస్ వైపు ఆకర్షించడానికి కొందరు ఉగ్రవాదులు ప్రాంతాల వారీగా అధ్యయన కేంద్రాలు, అరబిక్ బోధన కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎన్‌ఐఏ గుర్తించింది. వాట్సాప్, టెలిగ్రామ్‌లో ఏర్పాటు చేసిన గ్రూపుల ద్వారా తమ భావజాలాన్ని ఐసిస్ విస్తరిస్తోందని ఎన్‌ఐఏ గుర్తించింది. చెన్నైకి చెందిన ఉగ్రవాది ఈ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించారు. కొన్ని రోజులపాటు హైదరాబాద్‌లోనూ నివసించిన ఇతగాడు అల్ ఫుర్ఖాన్ పేరుతో ఓ పబ్లికేషన్స్ నిర్వహించాడు. ఇందులో తెలుగు, తమిళం, అరబిక్ భాషల్లో ఉగ్రవాద సాహిత్యం, భావజాలాన్ని వ్యాప్తి చేసే మెటీరియల్ ముద్రించాడు. ఐసిస్ మీడియా వింగ్ పేరు కూడా అల్ ఫుర్ఖానే కావడం గమనార్హం. ఇతగాడు ఇటీవలే విదేశాలకు పారిపోయాడని నిఘా వర్గాలు గుర్తించాయి.

ఐదుగురి ఇళ్లపై ఏకకాలంలో దాడులు..

ఈ చెన్నై వాసి నగరంలో నివసించిన కాలంలో సైదాబాద్ పరిధిలోని సపోటాబాద్‌కు చెందిన హసన్, రాజేంద్రనగర్ పరిధిలోని అత్తాపూర్‌కు చెందిన అమీర్, యూసుఫ్‌గూడ, బోరబండ ప్రాంతాలకు చెందిన నూరుల్లా, జాహెద్‌లతో పాటు గోల్కొండ పరిధిలోని షేక్‌పేటకు చెందిన జబ్బార్‌తో సన్నిహితంగా మెలిగాడు. వీరితో పాటు మరికొందరు ఉగ్రవాద సానుభూతిపరులతో సోషల్ మీడియా గ్రూపులు నిర్వహించాడు. తాను ముద్రించిన పుస్తకాలను అందించడంతో పాటు వివిధ అంశాలకు సంబంధించిన సాఫ్ట్‌కాపీలను షేర్ చేశాడు. కోయంబత్తూరు బాంబు పేలుడు కేసులో కీలక నిందితుడిగా ఉన్న కేరళ వాసి మహ్మద్ అజారుద్దీన్‌ను ఈనెల 1న ఎన్‌ఐఏ అరెస్టు చేసింది. ఇతడి నుంచీ ఎన్‌ఐఏ అధికారులు అల్ ఫుర్ఖాన్ ద్వారా ముద్రితమైన సాహిత్యం, పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. ఆ పుస్తకాలపై హైదరాబాద్‌లో ముద్రితమైనట్లు చిరునామా ఉంది. దీంతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి నగరానికి చెందిన ఐదుగురి వ్యవహారం ఎన్‌ఐఏ దృష్టికి వెళ్ళింది. దీంతో శనివారం నగరానికి చేరుకున్న ఎన్‌ఐఏ చెన్నై యూనిట్‌కు చెందిన ప్రత్యేక బృందం ఐదుగురి ఇళ్లపై ఏకకాలంలో దాడి చేసి సోదాలు నిర్వహించింది. అల్ ఫుర్ఖాన్ పబ్లిషర్స్ ద్వారా ముద్రితమైన పుస్తకాలు, ఇతర పత్రాలతో పాటు సెల్‌ఫోన్లు, హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నారు. హసన్, అమీర్, నూరుల్లా, జాహెద్, జబ్బార్‌లకు సీఆర్పీసీ 41–ఏ కింద నోటీసులు జారీ చేశారు.

కన్నబిడ్డలనే కాల్వలోకి తోసి...

- కల్లు తాగొద్దని భర్త మందలించాడని.. ఓ తల్లి ఘాతుకం
- ముగ్గురు కుమార్తెల మృతి.. దొరకని కుమారుని ఆచూకీ


మహాలక్ష్మి, సాత్విక, మార్కండేయ, మంజుల


తల్లి లలిత

బిజినేపల్లి: కల్లు తాగొద్దని భర్త హెచ్చరించాడన్న కోపంతో ఓ తల్లి ముక్కుపచ్చలారని తన నలుగురు చిన్నారులను కాల్వలో విసిరేసింది. ఈ ఉదంతం శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఎర్రకుంటతండాలో చోటుచేసుకుంది. మండలంలోని లట్టుపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రకుంట తండాకు చెందిన లలిత మంగనూర్‌కు చెందిన శరబందను ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి కూతుళ్లు మహాలక్ష్మి (7), సాత్విక (5), మంజుల (3)తోపాటు 7 నెలల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో లలిత కొన్నాళ్లుగా మందు కల్లును తాగుతుండటంతో పలుమార్లు భర్త శరబంద మందలించాడు. దీంతో భర్త తరచూ మందలిస్తున్నాడని లలిత శనివారం బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. పోలీసులు శరబందను స్టేషన్‌కు రావాలని ఫోన్ చేసి పిలిచారు. మధ్యాహ్నం కావడంతో పిల్లలకు ఏమైనా తినిపించుకు వస్తానని చెప్పి వెళ్లిన లలిత.. పోలీస్‌స్టేషన్ సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలోకి చిన్నారులతో కలిసి దిగింది. అటుగా వెళ్తున్న కొందరు ఆమెను గమనిస్తుండగానే నలుగురు చిన్నారులను కాల్వలోకి విసిరేసింది. వెంటనే వారు బిజినేపల్లి పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించి కాల్వలోకి దిగారు. పోలీసులు సైతం కాల్వ వద్దకు వచ్చి గాలించగా.. నీటి ఉధృతికి చిన్నారులు కిలోమీటరు మేర కొట్టుకుపోయారు. చివరికి ముగ్గురు కుమార్తెల మృతదేహాలు లభించగా.. బాలుడు మార్కండేయ ఆచూకీ లభించలేదు. అప్పటికే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చిన్నారులను కాల్వలో విసిరేసిన తల్లిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న భర్త శరబంద సైతం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. చిన్నారుల మృతదేహాలను పోలీసులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

30 మంది విద్యార్థినులకు అస్వస్థత

- అల్పాహారం తిని వాంతులు చేసుకున్న బాలికలు
- పులిహోరాలో పురుగులు వచ్చాయని వెల్లడి
- మంచాల బీసీ బాలికల వసతి గృహంలో ఘటన


మంచాల ఆస్పత్రిలో విద్యార్థినులు


మంచాల: హాస్టల్‌లో వడ్డించిన అల్పాహారం తిని 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బీసీ బాలికల వసతి గృహంలో మొత్తం 94 మంది విద్యార్థినులు ఉన్నారు. శనివారం ఉదయం వీరికి అల్పాహారంగా పులిహోర పెట్టారు. అందులో పురుగులు వచ్చాయని విద్యార్థినులు చెబుతున్నారు. అల్పాహారం తిన్నవారిలో ఒకరి తర్వాత ఒకరు తలనొప్పి, కడుపు నొప్పి సమస్యలతో ఇబ్బంది పడ్డారు. పదుల సంఖ్యలో పిల్లలు అస్వస్థతకు గురికావడంతో వారిని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గంట వ్యవధిలోనే 30 మందికి పైగా విద్యార్థినులు వాంతులు చేసుకుని, కాళ్లు, చేతులు లాగుతున్నాయని వాపోయారు. వారికి ఆస్పత్రి వైద్యుడు శ్రావణ్ కుమార్‌రెడ్డి చికిత్స చేశారు. కాగా, తీవ్ర అస్వస్థతకు గురైన కె.అనిత (7వ తరగతి), కె.అఖిల (8), వి.వైష్ణవి (5), ఎం.శిరీష (5), పి.అక్షర (3), ఎం.పూజ (7), ఆర్.త్రిష (10), ఎం.శ్రీనిధి (4వ తరగతి)ని మెరుగైన వైద్యం కోసం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఇందులో నలుగురిని వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యార్థుల విషయంలో వార్డెన్‌తో పాటు హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివిధ సంఘాల నాయకులు ఆరోపించారు.

క్షుణ్ణంగా పరిశీలించాకే.. మైనారిటీ సర్టిఫికెట్

సాక్షి, హైదరాబాద్: పోటీ పరీక్షల్లో కౌన్సెలింగ్ సమయంలో విద్యార్థులకు మైనారిటీ హోదా సర్టిఫికెట్ జారీకి ముందు అభ్యర్థులు సమర్పించిన వివరాలను, దరఖాస్తు కారణాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మైనారిటీ సంక్షేమ శాఖ విజ్ఞప్తి మేరకు రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ ఈ మేరకు విద్యార్థులకు ఇచ్చే మైనారిటీ సర్టిఫికెట్ నమూనా కూడా జీవోతో పాటు శనివారం జారీ చేశారు. ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బుద్దిస్ట్, జొరాస్ట్రియన్స్‌కు ఈ మైనారిటీ సర్టిఫికెట్ జారీ చేసేటప్పుడు విద్యార్థులు దేనికోసం ఈ సర్టిఫికెట్ కావాలంటున్నారో లిఖితపూర్వకంగా రాయించుకోవాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ సర్టిఫికెట్ ఇచ్చే సమయంలో తహసీల్దార్‌లు ఆ కుల గ్రూపును పేర్కొనడం, ఎస్సెస్సీ లేదా బదిలీ సర్టిఫికెట్‌లో వారి జాతీయత, మతం, నీట్, ఎంసెట్ లేదా జాతీయ, రాష్ట్ర పోటీ పరీక్షలకు హాజరైన అడ్మిట్ కార్డు, ఆధార్ కార్డు/రేషన్ కార్డు తీసుకుని పరిశీలించాకే జారీ చేయాలని ఆదేశించారు.

రంగారెడ్డి జిల్లా టీచర్ల పదోన్నతులపై... ఈ నెల 19 వరకు స్టే

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా టీచర్ల పదోన్నతులపై ఈ నెల 19 వరకు హైకోర్టు స్టే విధించింది. ప్రాథమిక సీనియారిటీ జాబితా ఆధారంగా పదోన్నతులు ఇవ్వడాన్ని తప్పుబడుతూ.. డీఈవో, డీఎస్‌ఈతో పాటు పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. అధికారులు ఇతర జిల్లాలకు చెందిన టీచర్లను కూడా రంగారెడ్డి జిల్లాకు కేటాయిస్తున్నారని, ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు, నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ టి.శ్రీనివాస్‌రెడ్డి సహా పలువురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. జీవో 317 ద్వారా ఇతర జిల్లాల టీచర్లను రంగారెడ్డి జిల్లాకు కేటాయించారని, కేడర్‌ను మించిపోతే ఈ జిల్లాకు చెందిన తాము నష్టపోతామని వారు పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై జస్టిస్ పి.మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అధికారులు తాత్కాలిక సీనియారిటీ జాబితాను సిద్ధం చేసి బదిలీలు చేపడుతున్నారు. దీనిపై పిటిషనర్ల అభ్యంతరాలకు కూడా అవకాశం ఇవ్వలేదని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. అయితే తుది సీనియారిటీ జాబితాను జారీ చేయకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం లేదని, పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు పదోన్నతులు ఇవ్వడం లేదని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. లంచ్‌మోషన్‌లో పిటిషన్ వచ్చినందున వివరాలు తెలుసుకోవడానికి ఈనెల 19 వరకు సమయం కావాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను 19కి వాయిదా వేస్తూ, అప్పటివరకు బదిలీలు, పదోన్నతులు నిలిపివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేసింది.

నగర వార్తలు

గణేష్ మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు చేపట్టండి

- జెన్‌కో చైర్మన్, ఎండీ రఘుమారెడ్డి

లక్డీకాపూల్: గణేష్ మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలని జెన్‌కో చైర్మన్, ఎండీ జి.రఘుమారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా, భద్రతాపరంగా విద్యుత్ శాఖ చేపట్టిన పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ... ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే గణేష్ నవరాత్రి ఉత్సవాలు 11 రోజుల పాటు నిర్వహిస్తారన్నారు. సామాన్య ప్రజలు, భక్తులు, మండప నిర్వాహకులు మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలని కోరారు. గణేష్ మండపాల వద్ద పాటించాల్సిన పలు విద్యుత్ భద్రతా జాగ్రత్తలను సూచించారు. మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం సామాన్యులు స్తంభాలు ఎక్కరాదన్నారు. సంస్థ సిబ్బంది ద్వారానే విద్యుత్ కనెక్షన్ పొందాలని స్పష్టం చేశారు. ఐఎస్‌ఐ మార్క్ కలిగిన ప్రామాణిక విద్యుత్ వైర్లను మాత్రమే వాడాలని.. ఈ విషయంలో ఎలాంటి జాయింట్ వైర్లు వాడకూడదని సూచించారు.

నేడు అక్కినేని శతజయంతి వేడుకలు

లక్డీకాపూల్: అక్కినేని ఫౌండేషన్ అఫ్ అమెరికా ఆధ్వర్యంలో ఈ నెల 17న రవీంద్రభారతిలో అక్కినేని శతజయంతి వేడుకలను నిర్వహించనున్నట్టు అక్కినేని ఫౌండేషన్ అఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్, అధ్యక్షుడు మురళి వెన్నం, కార్యదర్శి రవి కొండబోలు తెలిపారు. లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ, రామాచారి నిర్వహణలో 'అక్కినేని ఆణిముత్యాలు' సంగీత విభావరి, వివిధ రంగాలలో లబ్ధప్రతిష్టులకు అక్కినేని అంతర్జాతీయ పురస్కారాల ప్రదానం జరుగుతుందన్నారు. తమిళనాడు పూర్వ గవర్నర్ పి.ఎస్.రామమోహన్‌రావు, భారత పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, మాజీ ఎంపీ టి.సుబ్బరామిరెడ్డిలకు అక్కినేని అంతర్జాతీయ జీవిత సాఫల్య పురస్కారాలను అందజేస్తామన్నారు. విద్యారత్న, వైద్యరత్న, సినీరత్న, సేవారత్న, వినూత్నరత్న, రంగస్థల రత్న, వ్యాపార రత్న, యువ రత్న పురస్కారాలను ఎన్నో దశాబ్దాలుగా సాంస్కృతిక కళా రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న సాంస్కృతిక సంస్థలకు అక్కినేని అంతర్జాతీయ ప్రత్యేక పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. శతజయంతి వేడుకల్లో నటుడు మురళీమోహన్, అక్కినేని కుటుంబ సభ్యులు, అక్కినేని ఫౌండేషన్ అఫ్ అమెరికా, కార్యదర్శి రవి కొండబోలు, బోర్డు సభ్యులు ధామా భక్తవత్సలు, శారద ఆకునూరి పాల్గొంటారన్నారు.

రోడ్లు జామ్!


మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ జామ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అనేక ప్రాంతాల్లో శనివారం తీవ్రమైన ట్రాఫిక్ జామ్స్ ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల వాహనశ్రేణులు నత్తలతో పోటీపడుతూ నడిచాయి. కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సమావేశాలు జరుగుతున్న తాజ్‌కృష్ణ హోటల్ కేంద్రంగా వాహన చోదకులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. ఇక్కడికి ప్రముఖుల రాకపోకలతో పాటు రహదారిపై అడ్డదిడ్డంగా కట్టిన స్వాగత తోరణాలు, ఫ్లెక్సీల కారణంగా బంజారాహిల్స్ రోడ్ నెం.1తో పాటు దానికి అనుబంధంగా ఉన్న రోడ్లలో వాహనాలు చాలా సేపు ఆగిపోయాయి. తాజ్‌కృష్ణ వద్ద ఏర్పాటు చేసి సాంస్కృతిక ప్రదర్శనలు సైతం ఈ జామ్స్‌కు కారణమయ్యాయి. మరోపక్క సోమవారం వినాయక చవితి నేపథ్యంలో నగరంలోని అనేక ప్రాంతాల్లో గణేష్ మండపాలు ఏర్పాటయ్యాయి. వీటిలోని కొన్నింటిలో కొలువు తీర్చడానికి భారీ గణపయ్య విగ్రహాలను నిర్వాహకులు తరలిస్తున్నారు. ఈ వాహనాలు చాలా నెమ్మదిగా వెళ్లడం, కొన్ని చోట్ల ఇనుప బారికేడ్లు, కమాన్‌లు, మెట్రో స్టేషన్ల వద్ద ఈ విగ్రహాలు ఇరుక్కుపోవడంతో ఆయా మార్గాల్లో ట్రాఫిక్ జామ్స్ ఏర్పడ్డాయి. ప్రధానంగా ఇన్నర్ రింగ్ రోడ్‌తో పాటు అబిడ్స్, ధూల్‌పేట చుట్టుపక్కల ఈ పరిస్థితులు కనిపించాయి. ఆదివారం జరగనున్న వివిధ కార్యక్రమాలతో పాటు గణేష్ విగ్రహాల తరలింపుతో మరి కొన్ని ట్రాఫిక్ ఇబ్బందులు తప్పవని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నగర వాసులకు వీలున్నంత వరకు ఇబ్బందులు తగ్గించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

21న రెండో విడత 'డబుల్' ఇళ్ల పంపిణీ

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సాక్షి, సిటీబ్యూరో: రెండో విడత ఎంపికైన లబ్ధిదారులకు ఈ నెల 21వ తేదీన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆయా ప్రాంతాల్లో మంత్రులు, తదితర ప్రజాప్రతినిధులు పంపిణీ చేయనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.

ఎవరు.. ఎక్కడ.. ఎందరికి...

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్‌లో మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు 2100 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తారు.
- మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని మాన్‌సాన్ పల్లిలో విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి 700 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తారు.
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని అట్టిగూడలో భూగర్భ గనుల శాఖ మంత్రి మహేందర్ రెడ్డి 432 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తారు
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని తట్టి అన్నారంలో హోంమంత్రి మహమూద్ అలీ 1268 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తారు
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని తిమ్మాయిగూడలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి 600 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తారు.
- పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని కొల్లూరు–2లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు 4800 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తారు.
- మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని జవహర్‌నగర్–3లో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి 1200 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తారు.
- ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లిలో పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ 1000 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తారు.
- మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని ప్రతాప సింగారంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ 1100 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తారు.

30 నుంచి తెలంగాణ, కేరళ హెరిటేజ్ ఫెస్టివల్

పంజగుట్ట: భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ, కేరళ రాష్ట్రాల ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రవీంద్ర భారతిలో 'కేరళ, తెలంగాణ కల్చరల్ హెరిటేజ్ ఫెస్టివల్' నిర్వహించనున్నట్లు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మలయాళీ అసోసియేషన్ అధ్యక్షుడు లిబి బెంజ్‌మెన్, కార్యక్రమ చైర్మన్ జనార్దన్‌లతో కలిసి కార్యక్రమ బ్రోచర్‌ను, లోగోను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... తెలంగాణలో ఐదున్నర లక్షల మంది మళయాలీలు ఉన్నారని వారు ముఖ్యంగా విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో ఎంతో సేవ అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణ, కేరళ సాంస్కృతిక ప్రదర్శనలు, నాట్యం, నాటకాలు, మంచి సినిమాలు ఉంటాయని మూడు రోజులపాటు మినీ కేరళను రవీంద్రభారతిలో చూడవచ్చన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్, కేరళ మంత్రులు సాజీ చెరియన్, అహ్మద్ దేవర్‌కొర్వీ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో దేవరాజ్, ప్రదీప్, రిసా, మణి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి


పత్రాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ కరుణాకర్‌రెడ్డి తదితరులు

బంజారాహిల్స్: తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ దశాబ్ది విజయోత్సవాలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ చైర్మన్ వి.కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఇందిరానగర్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో నేతలతో కలిసి ఆయన దశాబ్ది విజయోత్సవాల పోస్టర్‌ను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సారథి స్టూడియోలో ఆదివారం నిర్వహించబోయే ఈ దశాబ్ది ఉత్సవాలకు రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తోపాటు నిర్మాత దిల్‌రాజు, పలువురు సినీ తారలు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌కు అనుబంధంగా ఉన్న 24 క్రాఫ్ట్స్‌కు చెందిన సినీ కళాకారులు, కార్మికులు కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. విజయోత్సవాల్లో తెలంగాణ సినీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు తెలుగు సినీ ఇండస్ట్రీలో రాణిస్తున్న పలువురు తెలంగాణ సినీ కళాకారులను సత్కరించుకుంటామని తెలిపారు. ఫెడరేషన్ కార్యదర్శి హెచ్.మూర్తి, కోశాధికారి వజినేపల్లి ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణను పరిశీలించిన కర్నాటక డిప్యూటీ సీఎం



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో అమలవుతున్న ఘనవ్యర్థాల నిర్వహణ, చెత్త నుంచి విద్యుత్ తయారీ తదితర అంశాలను గురించి కర్నాటక రాష్ట్ర డిప్యూటీ సీఎం డి.కె.శివకుమార్ అధికారులు, ప్లాంట్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆయా అంశాల్లో బెస్ట్‌ప్రాక్టీసెస్‌ను పరిశీలించేందుకు వచ్చిన బృహత్ బెంగళూరు మహానగరపాలిక (బీబీఎంపీ) ఉన్నతాధికారులతోపాటు శివకుమార్ జవహర్‌నగర్‌లో చెత్త ప్రాసెసింగ్ పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం జగద్గిరిగుట్టలోని గార్బేజ్ సెకండరీ కలెక్షన్ అండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు. నగరంలో సమగ్ర చెత్త నిర్వహణ బాగుందని ఆయన కితాబిచ్చారు. బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ నేతృత్వంలో నగరానికి వచ్చిన అధికారుల బృందంలో డిప్యూటీ సీఎం సెక్రటరీ రాజేంద్ర చోలన్, ఘనవ్యర్థాల నిర్వహణ స్పెషల్ కమిషనర్ డాక్టర్ హరీష్‌కుమార్, డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ శ్రీధర్, ఘనవ్యర్థాల నిర్వహణ చీఫ్ జనరల్ మేనేజర్ బసవరాజ్ ఆర్ కబాడే, డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులున్నారు. బీబీఎంపీ అధికారుల బృందాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ హయత్‌ప్యాలెస్‌లో కలిసి స్వాగతం పలికారు. జీహెచ్‌ఎంసీలో ఘనవ్యర్థాల నిర్వహణ, చెత్త నుంచి విద్యుత్ తయారీ తదితర అంశాల గురించి అడిషనల్ కమిషనర్ (పారిశుద్ధ్యం) ఉపేందర్‌రెడ్డి, ఎస్‌ఈ కోటేశ్వరరావు, ఈఈ శ్రీనివాసరెడ్డి బీబీఎంపీ అధికారులకు వివరించారు. జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ పనితీరు గురించి జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి వారికి వివరించారు.

బీసీలపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొసలి కన్నీరు

- కేంద్రానికి లేఖలు రాయడం కాదు, బీసీలకు బీఫాంలు ఇవ్వాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


సీఎం కేసీఆర్ ప్రధాని మోదీకి రాసిన లేఖను చూపుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ముషీరాబాద్: తెలంగాణ ప్రభుత్వం బీసీలపై మొసలి కన్నీరు కారుస్తోందని, త్వరలో జరగబోయే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలలో బీసీ బిల్లు పెట్టాలంటూ సీఎం కేసీఆర్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాయడం పచ్చిబూటకం అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. పదేళ్లగా 60 శాతం ఉన్న బీసీలకు కేవలం మూడే మంత్రి పదవులు ఇచ్చారని, 5 శాతం ఉన్న రెడ్లకు 9 మంత్రి పదవులు, 1 శాతం ఉన్న వెలమలకు ముఖ్యమంత్రి పదవితోపాటు నాలుగు మంత్రి పదవులు కట్టబెట్టి బీసీలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. సీఎంవో కార్యాలయంలో ఒక్క బీసీ సామాజికవర్గానికి చెందిన ఐఏఎస్ అధికారులు లేకపోవడం బీసీల పట్ల కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తేటతెల్లం అవుతుందన్నారు. అవకాశం ఉన్నచోట బీసీలకు న్యాయం చేయకుండా మొండిచెయ్యి చూపించి కేంద్రానికి బీసీల పట్ల ప్రేమ ఉన్నట్లు లేఖ రాయడం బీసీలను మోసం చేయడమేనని అన్నారు. శనివారం దోమలగూడలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ బీసీ ఐక్య కులాల వేదిక చైర్మన్ కుందారం గణేషాచారితో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ లేఖలు రాయడం కాదని బీసీలకు జనాభా దామాషా ప్రకారం వచ్చే ఎన్నికల్లో బీఫాంలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 130 బీసీ కులాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం గుర్తింపునివ్వడం లేదని అన్నారు. 10 సంవత్సరాలలో సీఎం కేసీఆర్ ప్రధాని మోదీని 24 సార్లు కలిసారని, ఏనాడూ బీసీ సమస్యలపై, బీసీ బిల్లుపై చర్చించలేదన్నారు. బీసీ సమస్యలపై అఖిల పక్షాన్ని సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వం వద్దకు ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. బీసీలు బీఆర్‌ఎస్ పార్టీపై రాజకీయ యుద్ధం ప్రకటించాలని ఆయన పిలుపునిచ్చారు. 2018లో బీసీలకు బీఆర్‌ఎస్ పార్టీ 26 అసెంబ్లీ స్థానాలు కేటాయించగా 2023లో కామారెడ్డి, హుజూరాబాద్, భూపాలపల్లి ముగ్గురు బీసీ అభ్యర్థుల స్థానాలలో అగ్రకులాలకు సంబంధించిన వ్యక్తులను అసెంబ్లీ స్థానాలు ప్రకటించడం పట్ల బీసీలపై సీఎం వివక్షత స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలు కేసీఆర్‌ను నమ్మవద్దని సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు జాజుల లింగంగౌడ్, మాదేశి రాజేందర్, నగర మహిళా అధ్యక్షులు శ్యామల, నాయకులు పద్మావతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను

బ్రాహ్మణ/2వ పెళ్లి /గుడ్ లుకింగ్ / 43/ 5'10"/ MBA, BE/SWE/4 Lakhs.PM/ Hyd/ కోట్ల ఆస్తి గల వరుడికి 1st మ్యారేజ్ వధువు కావలెను. Ph: 8367619529, 9515349877 [HA-14756]

రెడ్డి/High ప్రొఫైల్, డివోర్స్, 40 ఉన్నత విద్య, ఎలైట్ ఫ్యామిలీ, మంచి జాబ్ 30 లక్షలు జీతం, Well సెటిల్, గుడ్ ప్రాపర్టీ గల వరుడికి తగిన రెడ్డి వధువు కావలెను. కాల్ : 9347668696 [HA-11771]

SC హిందూ మాదిగ: M.Tech / Govt. Asst. ఇంజనీర్/ జెన్కో/ 14 Lakhs. P.A/ 6'ఎత్తు/ 29 సం။ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8963410191 [HA-14749]

ముదిరాజ్: కట్నం ప్రసక్తిలేదు/ B.Tech, IIT/C.Govt. ఇన్‌స్పెక్టర్/ కస్టమ్స్ Dept/ 75000/- PM/5'11" ఎత్తు/ 29 సం။ల వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-14749]

వడ్డెర: కట్నం ప్రసక్తిలేదు/ M.Tech/ C.Govt. ఇంజనీర్/ రైల్వే/ 90,000/- PM/ 5'11" ఎత్తు/ 29 సం။ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-14749]

రజక: కట్నం ప్రసక్తి లేదు/B.Tech / C.Govt బ్యాంక్ మేనేజర్/ SBI / 80,000/- PM/ 5'10" ఎత్తు/ 29 సం။ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 8341650195 [HA-14749]

SC మాల: కట్నం ప్రసక్తి లేదు/B.Tech / C.Govt కస్టమ్స్ ఆఫీసర్/ 80,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం။ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 8341650195 [HA-14749]

SC మాల & క్రిస్టియన్: B.Tech(EEE)/ C.Govt. ఇంజనీర్ రైల్వే/ 85,000/- PM/ 5'8" ఎత్తు/ 28 సం။ల వరునికి తగిన వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-14749]

SCమాదిగ & క్రిస్టియన్: B.Tech(EEE)/C.Govt. మేనేజర్/ యూనియన్ బ్యాంక్/ 14 Lakhs P.A/ 5'8" ఎత్తు/ 28 సం။ల వరునికి వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-14749]

మాదిగ: Govt Job 30 సం॥ 5'9" B.Tech, MBA (గ్రూప్-I Job) 18L P/A Two Own House Well Settled Family వరుడికి తగిన వధువు కావలెను. Ph: 6281925716 [H-11772]

కాపు: 30 సం॥ 5'9" M.Tech, 24L P/A, SWE Job Well Settled Family 10Cr ఆస్తి కలదు వరుడుకి తగిన వధువు కావలెను. Ph: 6301621607 [H-11772]

గౌడ్స్/2వ పెళ్లి 33Y/5'9"/ఫెయిర్/M.Tech/ Software/well settled Hyd వరునికి గౌడ్స్/other caste వధువు కావలెను. డైరెక్ట్ Ph: 9505232926, 9848065087 [H-788367]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 27, 5'9", Manager, 125 K, 50 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 7", SWE, 153 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 6' 1", Data Engineer, 200 K, 80 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 6', Associate, 140 K, 200 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MS, 27, 5'8", Data Engineer, 110 K, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 5", Doctor, 3 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 5", Analyst, 85 K, 6 Crores, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 7", SWE, 170 K, 40 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, M Tech (BITS), 28, 5'9", SWE, 24 L P/A, Hyd, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE, Business, 30, 5' 8", 30 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, MBA, 30, 5' 11", 130 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), MBA (IIM), 32, 5' 10", 34 L P/A, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 23, 5' 4", Software Developer, 10.8 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, Doctor, 28, 5' 7", 25 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 3", Team Leader, 80 K, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Degree, 32, 5' 2", Hyderabad, 5 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెడ్డి: 35y/5'8"/Business/ 60 లక్షలు నెలకు సొంత ఇల్లు 10 ఎకరాల పొలం కల్గిన వరుడికి మిడిల్ క్లాస్ వధువు కావలెను కట్నప్రసక్తి లేదు డైరెక్ట్. Ph: 8897213126, 8019468462 [H-189396]

36 సం॥ల బిజినెస్ చేస్తున్న ప్రాపర్టీ ఉన్న వరుడికి రెండవ/విడో పిల్లలు ఉన్న వారు అయిన సంప్రదించండి. ఔరో, కుల ప్రసక్తి లేదు. Ph: 8885582668, 7396730091 [H-189494]

రెడ్డి: 45y/5'10"/Govt Employee/ 1 లక్ష నెలకు 3Cr Well Settled పిల్లలులేని విడో వరుడికి వధువు కావలెను. కుల ప్రసక్తిలేదు డైరెక్ట్ Ph: 8019468462, 8897213126 [H-189396]

దేవాంగ/ (Cast No Bar)/40yrs/5'5"/Fair/ M.Tech, MCA, RPM వరుడునకు. చదువు కున్న, దైవభక్తి గల సాంప్రదాయ కుటుంబంలో వధువు కాలెను. (డైరెక్ట్) సంప్ర: 7036361292 [H-788682]

1 వ పెళ్లి/30, 1L.PM & 2వ పెళ్లి/36Y/కుల పట్టింపు లేదు/2L.PM, బాగా స్థిరపడిన వరునికి వధువు కావలెను. పిల్లలున్నా OK. సంప్ర: 7386429819, 8520829819 [HA-13700]

క్యాస్ట్ నో బార్, డైవర్సీ, యాదవ్, 43y, 5'.10", (MBBS/MD) డాక్టర్ @hyd, జీతం : 50 లక్షలు PA సంపన్న వరుడికి తగిన గ్రాడ్యుయేట్ వధువు కావలెను ✆ 879 079 6154 [B-394]

వడ్డెర /2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు / సొంత వ్యాపారం సం॥లక్ష ఆదాయం, 12సం॥ పాప, 13సం॥ బాబు ఉన్నారు . ఏ బాదరబందీలేని పిల్లలు లేని జీవిత భాగస్వామి కావలెను. 9949699139 [G-781718]

రెడ్డి/2వ పెళ్లి/43y/M.Sc/సాఫ్ట్‌వేర్/10 Lakhs. PA/పిల్లలు లేని వరునికి తగిన Any FC/BC వధువు కావలెను. కట్నం పట్టింపు లేదు. Ph: 9701605100 [HA-14756]

గౌడ/29 /5'5"/ B.Tech, NIT / Own హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్/2 Lakhs PM/20Cr ప్రాపర్టీ గల అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. Ph: 9441039962 [HA-14756]

★

2వ వివాహం : మాదిగ 40 years, జాబ్ చేస్తున్న వరునికి వధువు కావలెను. వివరాలకు సంప్ర. 95815 77024. [M-1221549]

★★

బ్రాహ్మణ వరుడు/43y/డిగ్రీ/SWE, 6L/Per Year/Hyd/ 2nd మ్యారేజ్ గల వరుడికి 35-40y/Inter మిడిల్ క్లాస్ సాంప్రదాయ కుటుంబం గల వధువు కావలెను. Ph: 9290758336 [H-788917]

కాపు 53సం॥, 5.10ఎత్తు అందమైన వరుడుకు ప్రేమతో నవ్విస్తూ, నవ్వుతూ ఉండే మంచి కుటుంబములోని వధువు కావలెను. డైరెక్ట్. సంప్ర॥ 8985800554 [G-751641]

వరుడు కావలెను

రెడ్డి/కుల, ఆస్తి పట్టింపు లేదు. బిజినెస్, జాబ్, 6 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ముఖాముఖి కల్పించి త్వరగా ఖచ్చితంగా కుదుర్చబడును. Ph: 9704477206 [H-189494]

No Caste Bar/1వ, 2వ 1కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK. త్వరగా చూసుకునే వారి కోసం మాత్రమే. Ph: 7794960803 [H-189494]

కుల పట్టింపు లేదు/విడో/53y / Dept Of PR & RD/1 L PM/Own House/ల్యాండ్స్ / కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన వధువుకు వరుడు కావలెను. Ph: 8019928755 [H-788546]

కాపు/డైవర్సీ/32y/5'4"/Fair/MA /Govt Emp /95,000/-PM/కోట్ల ప్రాపర్టీ గల అందమైన పిల్లలులేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9848226983 [H-788546]

రెడ్డి/27/5'4"/V.Fair/MBA/Business / 24Lakhs PA వెల్ సెటిల్ ఫ్యామిలీ గల ఏకైక వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309344166 [H-788546]

కాపు/డైవర్సీ/29y/5'5"/Fair / M.Com/Bank Officer/80,000/-PM కోట్ల ప్రాపర్టీ గల పిల్లలు లేని అందమైన వధువుకు తగిన వరుడు కావలెను (కుల ప్రసక్తి లేదు) Ph: 9553652167 [H-788546]

రెడ్డి/విడో కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/A: 30, Qly: డిగ్రీ/బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకి 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను (ఇల్లరికం OK) Ph: 8143011223 [HA-11771]

కాపు/2వ పెళ్లి/37/5'5"MCA/ SWE/ MNC/ Hyd/20L PA/Good Looking వెల్ సెటిల్ వధువుకు తగిన వయసు గల SWE వరుడు కావలెను. నో బ్రోకర్స్. 8019933068, 6590103583wup. [HA-11771]

రెడ్డి/సెకండ్ Matches వధువులు "USA, 32, సాఫ్ట్‌వేర్, "డాక్టర్, 35 "ఫెయిర్, 28. మరిన్ని వివరాలకు వాట్సాప్ 9392023911 (దేశ, విదేశీ, హైస్టాయి సంబంధాలు రెడ్డీస్‌కి చూడబడును) [HA-11771]

రెడ్డి/విడో/50y/5'5"/VFair / Govt. Teacher / సొంత ఇల్లు/ఆంధ్రాలో 2 ఎకరాల మాగాణి గల ఒంటరి వధువుకి స్నేహ స్వభావం గల వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 8019324258 [H-788918]

చౌదరి/విడో/58y/ప్రభుత్వ పెన్షనర్/2 సొంత ఇళ్ళు గల వెల్ సెటిల్డ్ వధువుకు కుల ప్రసక్తి లేని స్నేహ స్వభావం గల వరుడు కావలెను Ph: 9121509718 [H-788918]

రెడ్డి/విడో/50y/ 5'5"/ V.Fair/ Govt.Job/ సొంత ఇల్లు & రెంట్స్/25 ఎకరాల పొలం ఏ బాదరబందీలేని సాంప్రదాయక వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7287079096 [H-788918]

ఆస్తి, కుల పట్టింపు లేని/వధువుకి వరుడు కావలెను/58y/ విడో/ 5'3"/సొంత ఇల్లు/ Govt. Teacher/60,000/PM/ ట్యూషన్స్/ 40K/PM పిల్లలు లేరు. Ph: 6303063858 [H-788918]

కాపు/52y/విడో/B.Ed/ పెన్షనర్/సొంత ఇల్లు & షాప్/75,000/PM/2 ఎకరాల ల్యాండ్ గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9703982351 [H-788918]

క్రిస్టియన్ మాల: ఏకైక కుమార్తె / B.Tech/ C.Govt. టెక్నికల్ Asst/ ఇస్రో/60,000/- PM/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14749]

రజక: B.Tech / C.Govt Asst. మేనేజర్/ బ్యాంక్ ఆఫ్ బరోడా/ 50,000/- PM, / 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-14749]

వడ్డెర: C.A/ చార్టర్డ్ అకౌంటెంట్ / 60,000/- PM, / 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14749]

CNOB: II Match కాపు 42 సం॥ 5'4" సెంట్రల్ Govt Job 10L P/A Own House అందమైన వధువుకు, అర్థము చేసుకునే, వరుడు కావలెను. (No Issues) Ph: 9390933661. [H-11772]

MALA SC: Govt Job 27 సం॥ 5'4"/ B.Tech/ MBA/ 12L P/A Only Daughter Well Settled Family అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7702195227 [H-11772]

ఖమ్మ: 40y/5'5"/Govt Employee/ 60 వేలు నెలకు Own House బాగా స్థిరపడిన వధువుకి వరుడు కావలెను కుల ప్రసక్తి లేదు. Ph: 8019484384, 8019468462 [H-189396]

వైశ్య: 45y/5'5"/Own Super Market/ 1లక్ష నెలకు Widow వధువుకు బిజినెస్ చూసుకునే వరుడు కావలెను కుల ప్రసక్తి లేదు. Ph: 7396608019, 8019468462 [H-189396]

రెడ్డి: 38y/ 5'4"/ JOB/ 80 వేలు నెలకు /1Cr, Late Marriage వధువుకు Job/ Business చేయు వరుడు కావలెను. Ph: 7396608019, 8019468462 [H-189396]

రెడ్డి/విడో/53y/5'2"/ఇంగ్లీషులో సొంత స్కూల్స్/ Hydలో/సొంత బిజినెస్: రెంట్స్ /మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్). 7799083500, 7386660643 [H-189494]

కుల పట్టింపు లేదు/2వ పెళ్లి/Govt.ఎంప్లాయ్/ 2,50,000(pm)/35years. కోట్ల ప్రాపర్టీ కలిగి & బాగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం & పిల్లలు ఉన్నా OK) సంప్ర : 7386550413 [H-788682]

కమ్మ/40y/కుల పట్టింపు లేదు/Govt.ఎంప్లాయ్/ 80K (pm)/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (1st & 2nd మ్యాచ్, ఇల్లరికం OK) సంప్ర : 9492081545 [H-788682]

కాపు/35yr/కుల పట్టింపు లేదు/Govt.ఎంప్లాయ్/ 60K (pm), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ, బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 7095282404 [H-788682]

రెడ్డి/48yr/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ Govt. ఎంప్లాయ్/ 11 లక్షల (pm), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ, సొంత బిజినెస్ & 4 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 8374802603 [H-788682]

1వ పెళ్లి/26, 1L.PM & 2వ పెళ్లి/32Y/కుల పట్టింపులేదు/2.5L.PM, బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. పిల్లలున్నా OK. సంప్ర:8520829819, 7386429819 [HA-13699]

29, 5.3", MNC Job, 50K ముస్లిం సున్నీ వధువునకు Hydలో జాబ్ చేస్తున్న 30-33 సం॥లలోపు SW / MNC (ముస్లిం/దూదేకుల) వరుడు కావలెను. ✆ 86396 56798 [B-66]

మాల : MBBS., MS (Gynic) / 5'5 / 26Y / V.Fair/2 Cr. / నెలకు 1 లక్ష జీతంతో జాబ్ చేస్తున్న వధువు కొరకు (అర్జెంట్‌గా) సంప్ర॥ 81065 01199, 92484 94810. [M-274]

కాపు/ 54yr/5'4"/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ MA. English/Govt. ఎంప్లాయ్ 85K (PM) & బిజినెస్, సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 8008474869 [H-189494]

కాపు/2వ పెళ్లి, 34Y, పిల్లలు లేరు, MBA, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి, 60,000/PM కి వరుడు కావలెను. Any FC/ BC Only. Ph: 9542093659 [HA-14756]

బ్రాహ్మణ /24/5'3"/B.Com/డైవర్సీ * డైవర్సీ/27/ 5'5"/ B.Sc *26/5'3"/MBA వధువులకు జాబ్/బిజినెస్ /పురోహితం వరులు కావలెను. కట్నం ప్రసక్తి లేని వారు 1వ, 2వ సం॥దాలు సెటిల్మెంట్ Ph: 7842635086 [HA-14756]

క్రిస్టియన్/2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/ B.Tech/SWE/60,000/-PM / 5'5" ఎత్తు/ 36 సం॥ల పిల్లలులేని వధువుకు వరుడు కావలెను. Ph: 9550650024 [HA-14756]

బ్రాహ్మణ /33yrs/5'2"/ఇంటర్/29Yrs/5'4"/ డిగ్రీ/25Yrs/5'2"/MBA వధువులకు వరులు కావలెను/రిటైర్ Pvt, Govt జాబ్ & పురోహితం అయినా OK. Ph: 9959725419 [HA-14756]

కుల పట్టింపు లేదు/53Yrs/2వ పెళ్లి/ఫ్యామిలీ పెన్షన్ 50,000/-PM & Own House & 12 ఎకరాల భూమి గల వధువుకు కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 8885374003. [HA-14756]

యాదవ/B.Tech(సివిల్) / Govt.A.E / ట్రాన్స్‌కో/ 65000/-PM/ 5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [HA-14756]

★

హిందూ/SC/ఆది ఆంధ్ర/ఇంటర్/ 43y/ 5'3"/ లేట్ మ్యారేజ్ వధువుకు Hydలో 40K పైన జీతం జాబ్ ఉన్న అప్పర్‌క్లాస్ 1st మ్యారేజ్ వరుడు కావలెను. Ph: 9502172967 [H-189524]

SC Mala Christian Parents seek alliances for their daughter working as Grp-I officer in nationalised bank. The boy should be employed in MNCs/category-1 Central/State aged 27 to 30 years. No brokers Pl. Contact: 8106903423 [HA-5443]

★★

రెడ్డి/Age: 28, Height: 5'4", Colour: Fair/సొంత వ్యాపారం కలిగిన వధువుకి మంచి వరుడు కావలెను 1st (or) 2nd అయినా పర్వాలేదు. Ph: 9121300377 [HA-14757]

పద్మశాలి, క్రిస్టియన్, డైవర్సీ (BPT, MIAP) 30 yrs, 5'.1", Good Look, ఇన్‌కం, 35,000/- (PM), Property : 50 Lakhs, Girl. 5 Yrs, No Caste, No Brokers, VJA ✆ 94946 50753 [B-1210228]

వేదికలు

కావ్య మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్స్, అన్ని కులాలవారికి త్వరగా కుదుర్చబడును స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-788546]

ఒంటరి జీవితమా? తగిన తోడు/భాగస్వామి కోసం చూస్తున్నారా? అన్ని వయస్సుల వారికి నమ్మకమైన సర్వీస్ ద్వారా మీకు నచ్చే, తగిన పార్ట్‌నర్ మేము చూస్తాము. మీ వివరాలు వాట్సాప్ 6304826162 చేయండి [HA-11771]

కులపట్టింపు లేని అన్ని కులములవారికి ఒకటవ, రెండవ సంబంధములు చూడబడును. 21 సం॥ నుండి 60 సం॥ వరకు సంబంధములు చూడబడును. Govt, Pvt, SWE బిజినెస్ మొదలగునవి ఫాస్ట్ సెటిల్. Ph: 9391646037 [H-11772]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, రెడ్డి బలిజ, 1st/ 2nd చేర/ విదేశ సంబంధాలకై సం॥ S.నాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.నారాగౌడ్, Ph: 8790690809 [H-788919]

Brahmin పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14751]

Christian పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14751]

Kamma - Kapu పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14751]

Madiga - Mala పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14751]

Reddy పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14751]

మాల, మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK, Ph : 73969 15712 (A). [M-10225]

గంగపుత్రుల పెళ్లి సంబంధాలకైతిస్త, గూండ్ల, అగ్నికుల క్షత్రియ, వాదబలిజ, జాలరి & ఇతరత్రా. శ్రీ గంగాభవాని గంగపుత్రుల వివాహ పరిచయాలు. అంబర్‌పేట్, Hyd. Ph: 9000541008 [H-189411]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/ MBBS/ PG/ NRI/Pvt/బిజినెస్/1వ/2వ/లేట్ AP, TS 15 సం॥ Exp. Ph: 8712384555 [H-30503]

శ్రావణమాసం-పెళ్లిళ్ల సీజన్. అబ్రాడ్, సాఫ్ట్‌వేర్స్, రిచ్, IAS, IPS, IRS వారికి ఫాస్ట్ సెటిల్మెంట్. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, సంప్రదించండి: 7093722724. [T-1918]

కురవ/కురుమ/కురుబ: వివాహ వేదిక 24-09-2023, ఉ॥9.00 గం॥లకు జిల్లా పరిషత్‌లో, కర్నూలు, ఆంధ్ర. బయోడేటా, కలర్ ఫోటోలు, రిజిస్ట్రేషన్ ఫీజు:800/-. 99857 39713, 90327 41194 [L-780992]

ఫ్రీ*...అన్ని కులముల (India& Abroad) మొదటి, రెండవ, లేటు వధువు/వరుల వివాహ సంబంధములకై వెంటనే ఫోటో బయోడేటా పంపించండి. "మా సేవ" (Since: 1998) PH/WA: 9291503949 [HA-14756]

★★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-500]

రాష్ట్రమంతా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

సాక్షి, హైదరాబాద్: విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడించారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శనివారం సచివాలయంలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఉప్పల్ భగాయత్‌లోని విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవనం ఆవరణలో వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, కార్యదర్శి నామోజు బాలాచారి, భవన ట్రస్టు ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి సుందర్, తదితరులు పాల్గొన్నారు.

సతీశ్‌రెడ్డికి ఐఈటీఈ గౌరవ ఫెలోషిప్

రక్షణ రంగంలో విశిష్ట సేవలకుగాను ప్రదానం



సాక్షి, హైదరాబాద్: 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఈటీఈ) ఇండియా' ఆధ్వర్యంలోని అత్యున్నత పురస్కారమైన 'గౌరవ ఫెలోషిప్ 2022-23' డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ జి.సతీశ్‌రెడ్డిని వరించింది. దేశ రక్షణరంగంలో సతీశ్‌రెడ్డి చేసిన విశేష సేవలకుగాను పుణేలోని యషాడ వేదికగా శనివారం నిర్వహించిన ఐఈటీఈ వార్షికోత్సవంలో ఈ ఫెలోషిప్ అందజేశారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త వీఎస్ఎస్‌సీ మాజీ డైరెక్టర్ (ఇస్రో) పద్మశ్రీ డాక్టర్ ప్రమోద్‌కాలే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశ రక్షణ వ్యవస్థలో భాగంగా క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థలు, ఫైటర్ ఎయిర్ క్రాఫ్టులు, యూఏవీ, జలాంతర్గామి వ్యవస్థలు తదితర అంశాల్లో డీఆర్‌డీఓ కృషిచేస్తోంది. నావిగేషన్ సిస్టమ్స్, ఏవియానిక్స్‌తోపాటు డిఫెన్స్ సిస్టమ్స్-సాంకేతిక వ్యవస్థల్లో మెరుగైన సేవలందించినందుకుగాను, టెక్నాలజీ లీడర్‌షిప్‌లో చేసిన సేవలకుగాను సతీశ్‌రెడ్డి పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెన్సార్లు, డిటెక్టర్లు తదితర సాంకేతిక పరికరాలను దేశీయంగా అభివృద్ధి చేయడమే కాకుండా ఎగుమతులకు మార్గం సుగమం చేయడం ద్వారా ఎలక్ట్రానిక్స్- టెలికమ్యూని కేషన్‌లలో అగ్రగామిగా నిలవొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈటీఈ ప్రెసిడెంట్ డాక్టర్ వి.గుణశేఖర్‌రెడ్డి, జనరల్ కౌన్సిల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మరో 8 మెడికల్ కాలేజీలకు నిధులు!

- కళాశాలలు, హాస్టళ్ల నిర్మాణం కోసం రూ.1,447 కోట్లు మంజూరు
- 2024-25 విద్యా సంవత్సరం నుంచి కొత్త కాలేజీలు అందుబాటులోకి..
- వేగంగా భవనాల నిర్మాణం పూర్తిచేయాలని అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు లక్ష్యం వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తికానుంది. రెండు రోజుల కిందే తొమ్మిది కొత్త మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ ప్రారంభించగా.. వచ్చే ఏడాది మరో ఎనిమిదింటిని అందుబాటులోకి తేనున్నట్టు ప్రకటించారు. రూ.1,447 కోట్లతో ఈ 8 మెడికల్ కాలేజీలకు భవనాలు, హాస్టళ్లను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వుల ప్రతిని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి టి.హరీశ్‌రావు ట్వీట్ చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఇక్కడ కేవలం ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలే ఉండగా.. వచ్చే ఏడాది నాటికి ఏకంగా 34కు పెరుగుతున్నాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తొమ్మిది కొత్త వైద్య కళాశాలలను ప్రారంభించుకున్న మరుసటి రోజే మరో ఎనిమిది కాలేజీల ఏర్పాటుకు పరిపాలన అనుమతుల మంజూరు చేసేలా అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. నారాయణపేట్, ములుగు, మెదక్‌లలో ఏర్పాటు చేసే మెడికల్ కాలేజీల కోసం రూ. 180 కోట్ల చొప్పున.. గద్వాల, నర్సంపేట, యాదాద్రిలలో కాలేజీలకు రూ.183 కోట్ల చొప్పున, కుత్బుల్లాపూర్ కాలేజీకి రూ.182 కోట్లు, మహేశ్వరం కాలేజీకి రూ. 176 కోట్లు కేటాయించినట్టు మంత్రి తెలిపారు. ఈ మేరకు కాలేజీలు, హాస్టల్ భవనాల నిర్మాణాన్ని వేగంగా చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ 8 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి, ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సీడబ్ల్యూసీ భేటీ పేరుతో కాంగ్రెస్ జిమ్మిక్కులు

హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశాల పేరుతో కాంగ్రెస్ జిమ్మిక్కులకు పాల్పడుతోందని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేయడం కుదరదని, రాష్ట్రానికి పర్మనెంట్ గ్యారంటీ కేసీఆరేనని చెప్పారు. ఎవరెన్ని చేసినా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అబర్న్ వర్సిటీతో ఫారెస్ట్ కాలేజీ ఒప్పందం

- ప్రతి ఏటా ఇద్దరు ఎఫ్‌సీఆర్ఐ విద్యార్థులకు పూర్తి ఫండింగ్‌తో మాస్టర్స్ డిగ్రీ

సాక్షి, హైదరాబాద్: అమెరికా అలబామాలోని అబర్న్ యూనివర్సిటీలో ఫారెస్ట్రీ విద్యను అభ్యసించే అవకాశం రాష్ట్ర విద్యార్థులకు దక్కనుంది. ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ) లోని ఇద్దరు బీఎస్సీ ఫారెస్ట్రీ విద్యార్థులు ప్రతి ఏటా ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ చదివేందుకు పూర్తి ఫండింగ్ చేస్తామని అబర్న్ యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు అమెరికా యూనివర్సిటీ ప్రాంగణంలో ఒ ప్పందం కుదిరింది. అబర్న్ యూనివర్సిటీ ఫారెస్ట్రీ కాలేజీ డీన్ డాక్టర్ జానకి అలవలపాటి, తెలంగాణ ఫారెస్ట్ కాలేజీ డీన్ ప్రియాంక వర్గీస్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ఆరేళ్ల పాటు అమల్లో ఉంటుందని వారు తెలిపారు. కార్య క్రమంలో అబర్న్ వర్సిటీ ప్రతినిధులు విన్నీ నాథన్, డాక్టర్ క్రిస్టోఫర్ రాబర్ట్స్, బ్రెట్ వైట్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ చొరవ, ముందుచూపుతో ప్రారంభించిన అటవీ కళాశాలకు అంతర్జాతీయ గుర్తింపుతోపాటు తెలంగాణ విద్యార్థులు అటవీ విద్యలో ఉన్నత చదువు, పరిశోధనలు, మంచి ఉద్యోగాల కల్పనకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని ప్రియాంక వర్గీస్ తెలిపారు. ఇందుకు సహకరించిన అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ, స్పెషల్ సీఎస్(అటవీశాఖ) శాంతికుమారి, పీసీసీఎఫ్ డోబ్రియాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే డీమ్డ్ హోదా పొందనున్న ఎఫ్‌సీఆర్ఐ, ఈ తరహా ప్రత్యేకంగా ఫారెస్ట్రీ విద్య కోసమే నెలకొల్పిన యూనివర్సిటీగా ప్రపంచంలోనే మొదటిది అవుతుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ హరితహారం విజయవంతంపై అబర్న్ వర్సిటీ ప్రతినిధులు, విద్యార్థులకు ప్రియాంక ప్రత్యేకంగా వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. గత తొమ్మిదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 7.7 పచ్చదనం పెంపు సాధించినట్లు తెలిపారు.

21 నుంచి మరోవిడత దోస్త్ కౌన్సెలింగ్

- 19 నుంచి ఇంట్రా కాలేజీల ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి మరోవిడత దోస్త్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు ఉన్నత విద్యామండలి తెలిపింది. ఇప్పటివరకూ రిజిస్ట్రేషన్ చేసుకోనివారు, రద్దయిన అభ్యర్థులు ఈ నెల 21 నుంచి 24వ తేదీలోగా రూ.400 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. దోస్త్ ద్వారా మిగిలిపోయిన వివిధ కాలేజీల్లోని సీట్లకు 21 నుంచి 25 వరకూ ఆప్షన్లు ఇవ్వొచ్చు. ఈ నెల 29న సీట్లు కేటాయిస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులు 30వ తేదీలోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. వచ్చే నెల 3, 4 తేదీల్లో అన్ని ప్రైవేటు కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ నిర్వహించాలని మండలి పేర్కొంది. కాగా, సీటు పొందిన కాలేజీలో వేరే బ్రాంచీకి మారాలనుకునే అభ్యర్థులు ఈ నెల 19, 20 తేదీల్లో ఇంట్రా కాలేజీ వెబ్ ఆప్షన్లు ఇవ్వొచ్చు. ఈ నెల 21న ఇంట్రా కాలేజీ సీట్ల కేటాయింపు ఉంటుంది.

3,065 జేపీఎస్ పోస్టులు ఖాళీ

- గ్రేడ్-4 కార్యదర్శులుగా 6,616 మందికి అర్హత
- పరిగణనలోకి 3,551 మంది జేపీఎస్‌లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రస్తుతం 3,065 జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ప్రభుత్వం నిర్ధారించింది. జిల్లా పంచాయతీ అధికారుల (డీపీవో) నివేదిక మేరకు ఈ నెల 30 నాటికి క్రమబద్ధీకరణతో పాటు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా నియామకానికి అర్హులైన జేపీఎస్‌లు 6,616 మంది ఉన్నట్టు తేలింది. కాగా, గ్రేడ్-4 పోస్టుల కోసం 3,551 మంది జేపీఎస్‌లను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. మిగిలిన అర్హులైన పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ, నియామకాలకు కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, డీపీవోలకు పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ ఎం.హనుమంతరావు ప్రొసీడింగ్స్ పంపించారు.

పార్టీలకు పర్యావరణ ఎజెండా ఉండాలి

- పర్యావరణవేత్తల హితవు
- ఎన్నికల మేనిఫెస్టోల్లో చేర్చాలి

సాక్షి, హైదరాబాద్: వాతావరణ మార్పులు ముంచుకొస్తున్న ఈ తరుణంలో దేశంలోని రాజకీయ పార్టీలు పర్యావరణ పరిరక్షణను కూడా తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో చేర్చాల్సిన అవసరముందని వక్తలు చెప్పారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, కౌన్సిల్ ఫర్ ఎర్త్ లీడర్‌షిప్ అండ్ సస్టెయినబిలిటీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సంయుక్తంగా శనివారం 'గ్రీన్ మేనిఫెస్టోస్-ఎ డైరెక్షన్ ఫర్ పొలిటికల్ పార్టీస్ ఇన్ ఇండియా' పేరుతో జాతీయ సదస్సు నిర్వహించాయి. పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ఆర్థికవేత్త మోహన్ గురుస్వామి, సమాచార హక్కు మాజీ కమిషనర్ ఆర్.దిలీప్‌రెడ్డి, నార్వే దౌత్యవేత్త ఎరిక్ సోల్‌హేమ్, పబ్లిక్ పాలసీ నిపుణులు దొంతి నరసింహారెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎల్. వేణుగోపాల నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ అంశాలకు రాజ కీయాల్లోనూ ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం గురించి మాట్లాడారు. యూరప్ దేశాల మాదిరిగా పర్యావరణవేత్తలు స్వయంగా ఒక రాజకీయ పార్టీని పెట్టడంపై కార్యక్రమంలో చర్చ జరిగింది. వాతావరణ మార్పుల ప్రభావం కారణంగా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా విపత్తులు పెరిగిపోతున్నాయని, వాతావరణం ఇస్తున్న ఈ ఆఖరి హెచ్చరికనూ పట్టించుకోకపోతే.. మానవాళికి రేపన్నది ఉండదని ప్రొఫెసర్ పురుషోత్తమరెడ్డి హెచ్చరించారు. పర్యావరణ, ఆర్థికాభివృద్ధి కోసం ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు పదిహేడింటినీ సాధించేందుకు రాజకీయ నాయకులూ తమ చిత్తశుద్ధిని ప్రదర్శించాలని కోరారు.

మరీ నిరాశాజనకం కాదు: ఎరిక్ సోల్‌హేమ్

పర్యావరణం విషయంలో భారత్‌లో పరిస్థితి ఆశాజనకంగానే ఉందని నార్వే దౌత్యవేత్త ఎరిక్ సోల్‌హేమ్ అభిప్రాయపడ్డారు. పెద్ద ఎత్తున సోలార్ ప్లాంట్లు వస్తుండటంతో ఇంధన అవసరాలను పర్యావరణానికి అనుకూలంగానే తీర్చుకునే అవకాశం ఏర్పడిందన్నారు. సీఎం కేసీఆర్ పర్యవేక్షణలో తెలంగాణకు హరితహారం అమలు ద్వారా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. భారత్‌లోని ఇతర రాష్ట్రాలు కూడా హరితహారం స్ఫూర్తితో పచ్చదనం పెంపుపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఎరిక్ సోల్‌హేమ్ హైదరాబాద్‌లో కండ్లకోయ ఆక్సిజన్ అర్బన్ ఫారెస్ట్ పార్క్, దూలపల్లిలో అటవీ శాఖ నర్సరీని సందర్శించారు. తాను గతంలో తెలంగాణలో పర్యటించినప్పటికీ, ఇప్పటికీ పచ్చదనం పెంపులో స్పష్టమైన మార్పు కనిపిస్తోందన్నారు. అటవీ అర్బన్ పార్కుల్లో సౌకర్యాలు బాగున్నాయని చెప్పారు.

సంగీత నాటక అకాడమీ అవార్డుల ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురికి సంగీతనాటక అకాడమీ అవార్డులు ప్రదానం చేసింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ గ్రహీతలకు అవార్డు అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కూచిపూడికి చెందిన మహంకాళి శ్రీమన్నారాయణ మూర్తి (కూచిపూడి), ముమ్మిడివరానికి చెందిన పండితారాధ్యుల సత్యనారాయణ (హరికథ), మచిలీపట్నానికి చెందిన మహాభాష్యం చిత్తరంజన్ (సంప్రదాయ సంగీతం-సుగమ్ సంగీత్), తెలంగాణ నుంచి కోలంక లక్ష్మణరావు (కర్ణాటక సంగీతం-మృదంగం) (స్వస్థలం పిఠాపురమైనా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు), నల్లగొండ జిల్లా కూర్మపల్లికి చెందిన ఐలయ్య ఒగ్గరి (ఒగ్గు కథ), వరంగల్‌కు చెందిన బాసని మర్రెడ్డి (థియేటర్ డైరెక్టర్)లు అవార్డులు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను రూ.లక్ష బహుమతి, తామ్రపత్రం, శాలువాతో సత్కరించారు.



ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ చేతులు మీదుగా అవార్డులు అందుకుంటున్న మహంకాళి శ్రీమన్నారాయణ మూర్తి, కోలంక లక్ష్మణరావు, మహాభాష్యం చిత్తరంజన్, ఐలయ్య ఒగ్గరి



ప్రపంచకప్‌కు నసీమ్ షా దూరం!

వచ్చే నెలలో భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ ప్రారంభానికి ముందే పాకిస్తాన్ జట్టుకు గట్టి దెబ్బ తగిలే అవకాశముంది. ఆ జట్టు యువ పేస్ బౌలర్ నసీమ్ షా ఈ మెగా ఈవెంట్ మొత్తానికి దూరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆసియా కప్ టోర్నీలో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా నసీమ్ షా భుజానికి గాయమైంది. ఈ గాయానికి స్కాన్‌లు నిర్వహించారు. గాయం తీవ్రతదృష్ట్యా నసీమ్ షా మూడు నెలలు ఆటకు దూరమయ్యే అవకాశముందని తెలిసింది. 20 ఏళ్ల నసీమ్ పాక్ తరఫున 14 వన్డేలు ఆడి 32 వికెట్లు తీశాడు.

పోరాడి ఓడిన రష్మిక జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది. పెర్త్‌లో జరిగిన డబుల్స్ సెమీఫైనల్లో రష్మిక (భారత్)-మోనిక్ బ్యారీ (న్యూజిలాండ్) ద్వయం 6-3, 1-6, 7-10తో మిసాకి-నాహో (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది. సింగిల్స్‌లో రష్మిక తొలి రౌండ్‌లో 3-6, 3-6తో ఐవా డెస్టానీ (ఆస్ట్రేలియా) చేతిలో ఓటమి పాలైంది.

విజేత మౌనిక అక్షయ

ఆసియా జూనియర్ చెస్



జంషెడ్‌పూర్: టాటా స్టీల్ ఆసియా జూనియర్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల బ్లిట్జ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మిని మౌనిక అక్షయ విజేతగా అవతరించింది. గుంటూరు జిల్లాకు చెందిన 20 ఏళ్ల మౌనిక అక్షయ నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత 7.5 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. మౌనిక అక్షయ ఏడు గేముల్లో గెలిచి, ఒక గేమ్‌ను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. భారత్‌కే చెందిన భాగ్యశ్రీ పాటిల్, బ్రిస్టీ ముఖర్జీ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి రజత, కాంస్య పతకాలను దక్కించుకున్నారు.

కుశాగ్ర మోహన్‌కు రజతం



బ్లిట్జ్ ఓపెన్ విభాగంలో తెలంగాణకు చెందిన కుశాగ్ర మోహన్ రజత పతకం సాధించాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత అలెక్సీ గ్రెబనోవ్ (రష్యా), కుశాగ్ర మోహన్ 7.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌ను వర్గీకరించగా... గ్రెబనోవ్‌కు స్వర్ణం ఖరారైంది. కుశాగ్ర మోహన్‌కు రజతం లభించింది.

క్వార్టర్స్‌లో ఓడిన అభిమన్యు



బెల్‌గ్రేడ్: ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు నలుగురు భారత రెజ్లర్లు నిరాశపరిచారు. ఆకాశ్ దహియా (61 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో, అభిమన్యు (70 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో... సందీప్ మాన్ (86 కేజీలు) రెండో రౌండ్‌లో... సుమిత్ మలిక్ (125 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. ఒలింపిక్ వెయిట్ కేటగిరీల్లో సందీప్, సుమిత్‌లపై నెగ్గిన రెజ్లర్లు ఫైనల్ చేరుకోకపోవడంతో భారత రెజ్లర్లకు 'రెపిచాజ్' రౌండ్‌లలో ఆడే అవకాశం కూడా రాలేదు. అభిమన్యు క్వార్టర్ ఫైనల్లో 2-9తో అలెన్ రూథర్‌ఫర్డ్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. అలెన్ ఫైనల్ చేరుకోవడంతో అభిమన్యుకు నేడు 'రెపిచాజ్' బౌట్‌లలో పోటీపడే అవకాశం లభించింది.

నిరీక్షణ ముగించాలని!

- ఐదేళ్లుగా అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు నిరాశ
- ఆసియా కప్‌తో ముగింపు పలకాలని రోహిత్ బృందం పట్టుదల
- నేడు శ్రీలంకతో ఆసియా కప్ టైటిల్ పోరు
- మధ్యాహ్నం గం. 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం
- వర్షం అంతరాయం కలిగిస్తే 'రిజర్వ్ డే'న కొనసాగింపు



రోహిత్ శర్మ, షనక

ద్వైపాక్షిక సిరీస్‌లు కాకుండా మూడు అంతకంటే ఎక్కువ దేశాలు పాల్గొన్న అంతర్జాతీయ టోర్నీలలో భారత జట్టు విజేతగా నిలిచి ఐదేళ్లయింది. 2018లో ఆసియా కప్ టైటిల్ సాధించాక భారత జట్టు మరో టోర్నీలో చాంపియన్‌గా నిలువలేదు. 2019 వన్డే ప్రపంచకప్‌లో, 2022 టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్స్‌లో ఓడిన టీమిండియా... 2019, 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్స్‌లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్ల చేతుల్లో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ టోర్నీ టైటిల్ నిరీక్షణ ముగించేందుకు భారత జట్టుకు ఆసియా కప్ రూపంలో మరో అవకాశం దక్కింది. స్ఫూర్తిదాయక ఆటతీరుతో ఆకట్టుకుంటున్న శ్రీలంకతో నేడు జరిగే ఫైనల్లో టీమిండియా 'ఢీ'కొంటుంది. తుది పోరులో గెలిచి భారత జట్టు టైటిల్ నిరీక్షణకు తెరదించుతుందా లేదా మరికొన్ని నెలలు పొడిగిస్తుందా మరికొన్ని గంటల్లో తేలిపోతుంది.

కొలంబో: వర్షంతో దోబూచులాడిన ఆసియా కప్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ తుది అంకానికి చేరుకుంది. నేడు భారత్, శ్రీలంక జట్ల మధ్య జరిగే ఫైనల్‌తో ఈ టోర్నీకి తెరపడనుంది. వచ్చే నెలలో మొదలయ్యే వన్డే ప్రపంచకప్‌నకు సన్నాహకంగా భారత్, శ్రీలంక జట్లకు ఈ టోర్నీ ఉపయోగపడుతోంది. బంగ్లాదేశ్‌తో చివరి 'సూపర్-4' మ్యాచ్‌లో అనూహ్యంగా ఓడిపోయిన భారత జట్టు ఫైనల్‌ను మాత్రం తేలిగ్గా తీసుకునే అవకాశం లేదు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకున్న విరాట్ కోహ్లి, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, సిరాజ్, బుమ్రా ఫైనల్లో బరిలోకి దిగుతారు. అక్షర్ పటేల్ చేతి వేళ్లకు గాయం కావడంతో అతను ఫైనల్‌కు దూరమయ్యాడు. అక్షర్ పటేల్‌కు ప్రత్యామ్నాయంగా టీమ్ మేనేజ్‌మెంట్ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను శనివారం కొలంబోకు రప్పించింది. బ్యాటింగ్ పరంగా భారత్ పటిష్టంగా కనిపిస్తోంది. రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్, కోహ్లి, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా మెరిస్తే భారత్ భారీ స్కోరు చేయడం ఖాయం. ఈ టోర్నీలో గిల్, కోహ్లి, రాహుల్ ఒక్కో సెంచరీ కూడా చేశారు. బౌలింగ్‌లోనూ భారత్ సమతూకంగా ఉంది. జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, పాండ్యా పేస్‌తో ఆకట్టుకుంటే.. కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా స్పిన్‌తో ప్రత్యర్థిని కట్టడి చేయగలరు.

సమష్టిగా రాణిస్తూ...

ఆసియా కప్‌లో ఆరుసార్లు చాంపియన్‌గా నిలిచిన శ్రీలంక ఏడో టైటిల్‌పై గురి పెట్టింది. భారత్ అత్యధికంగా ఏడుసార్లు ఆసియా కప్ టైటిల్‌ను సాధించింది. పలువురు స్టార్ ఆటగాళ్లు అందుబాటులో లేకపోయినా ఈ టోర్నీలో శ్రీలంక స్ఫూర్తిదాయక ఆటతో ఫైనల్‌కు దూసుకొచ్చింది. దాసున్ షనక నాయకత్వంలో తుది పోరులోనూ అదే జోరు కొనసాగించాలని శ్రీలంక పట్టుదలతో ఉంది. బ్యాటింగ్‌లో కుశాల్ మెండిస్, నిసాంక, అసలంక, సమర విక్రమపై లంక ఆశలు పెట్టుకుంది. షనక, ధనంజయ డిసిల్వా, వెలలాగె ఆల్‌రౌండ్ పాత్రలను పోషిస్తారు. గాయం కారణంగా స్పిన్నర్ తీక్షణ ఫైనల్‌కు దూరమయ్యాడు. పతిరణ, కసున్ రజిత తమ పేస్‌తో భారత బ్యాటర్లను ఏమేరకు కట్టడి చేస్తారో చూడాలి.

పిచ్, వాతావరణం



గత తొమ్మిది రోజుల్లో ప్రేమదాస స్టేడియంలో ఆరు మ్యాచ్‌లు జరిగాయి. దాంతో పిచ్ మందకొడిగా మారింది. స్పిన్నర్లకు ఎక్కువ అనుకూలంగా ఉండే అవకాశముంది. ఈ మ్యాచ్‌కు వర్ష సూచన ఉంది. ఆదివారం సాయంత్రం, రాత్రి వేళల్లో ఒకట్రెండు సార్లు ఉరుములతో కూడిన వర్షం పడవచ్చు. ఒకవేళ వర్షంవల్ల ఆట సాధ్యపడకపోతే రిజర్వ్ డే సోమవారం ఫైనల్‌ను కొనసాగిస్తారు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, కోహ్లి, ఇషాన్ కిషన్/తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, శార్దుల్ ఠాకూర్/వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, సిరాజ్.

శ్రీలంక: షనక (కెప్టెన్), కుశాల్ పెరీరా, నిసాంక, కుశాల్ మెండిస్, సమరవిక్రమ, అసలంక, ధనంజయ డిసిల్వా, దునిత్ వెలలాగె, దుషాన్ హేమంత, పతిరణ, కసున్ రజిత.

7 ఆసియా కప్ ఇప్పటి వరకు 15 సార్లు జరిగింది. 13 సార్లు వన్డే ఫార్మాట్‌లో, రెండుసార్లు టి20 ఫార్మాట్‌లో నిర్వహించారు. భారత్, శ్రీలంక జట్లు ఆసియా కప్ ఫైనల్స్‌లో ఏడుసార్లు తలపడ్డాయి. నాలుగుసార్లు భారత్, మూడుసార్లు శ్రీలంక గెలుపొందాయి.

250 శ్రీలంకతో ఫైనల్ మ్యాచ్ భారత కెప్టెన్ రోహిత్ శర్మకు 250వ వన్డే మ్యాచ్ కానుంది. 250 వన్డేలు ఆడిన ఎనిమిదో భారతీయ క్రికెటర్‌గా రోహిత్ గుర్తింపు పొందుతాడు.

5 ప్రస్తుత ఆసియా కప్‌లో కొలంబో వేదికగా జరిగిన ఆరు మ్యాచ్‌ల్లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన జట్టు ఐదుసార్లు గెలిచింది.


భారత్ 1 మొరాకో 1



సుమిత్

లక్నో: డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-2 టెన్నిస్ పోటీలో తొలి రోజు భారత్, మొరాకో క్రీడాకారులు ఒక్కో మ్యాచ్‌లో గెలిచారు. దాంతో స్కోరు 1-1తో సమంగా నిలిచింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 7-6 (7/4), 5-7, 1-4తో యాసిన్ దిల్మీ చేతిలో ఓడిపోయాడు. రెండో సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 6-3, 6-3తో ఆడమ్ మౌన్‌డిర్‌పై గెలుపొందాడు. దిల్మీతో జరిగిన మ్యాచ్‌లో ముకుంద్ నిర్ణాయక మూడో సెట్‌లో 1-4తో వెనుకబడిన దశలో కాలి కండరాలు పట్టేయడంతో వైదొలిగాడు. నేడు మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. డబుల్స్ మ్యాచ్‌లో రోహన్ బోపన్న-యూకీ బాంబ్రీ జోడీ బెన్‌చిట్రి-లారూసి జంటతో ఆడుతుంది. రివర్స్ సింగిల్స్‌లో దిల్మీతో సుమిత్ నగాల్, ఆడమ్‌తో శశికుమార్ తలపడతారు.

సెయింజ్‌కు 'పోల్'



సింగపూర్: ఫార్ములావన్‌లో ఈ సీజన్‌లో తొలిసారి రెడ్‌బుల్ డ్రైవర్లు వెర్‌స్టాపెన్, సెర్జియో పెరెజ్ నిరాశ పరిచారు. శనివారం జరిగిన సింగపూర్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ సెషన్‌లో వెర్‌స్టాపెన్ 11వ స్థానంలో, పెరెజ్ 13వ స్థానంలో నిలిచారు. నేడు జరిగే ప్రధాన రేసును వెర్‌స్టాపెన్ 11వ స్థానం నుంచి, పెరెజ్ 13వ స్థానం నుంచి ప్రారంభిస్తారు. మరోవైపు ఫెరారీ డ్రైవర్ కార్లోస్ సెయింజ్ అందరికంటే వేగంగా ల్యాప్‌ను 1 నిమిషం 30.984 సెకన్లలో ముగించి 'పోల్ పొజిషన్' సాధించాడు. నేడు జరిగే ప్రధాన రేసును సెయింజ్ తొలి స్థానం నుంచి మొదలు పెడతాడు. ఈ సీజన్‌లో 14 రేసులు జరగ్గా... 14 రేసుల్లోనూ రెడ్‌బుల్ డ్రైవర్లు వెర్‌స్టాపెన్ (12 రేసుల్లో), పెరెజ్ (2 రేసుల్లో) విజేతలుగా నిలిచారు.

ఇంగ్లండ్‌దే సిరీస్



లండన్: న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగు వన్డేల సిరీస్‌ను ఇంగ్లండ్ జట్టు 3-1తో సొంతం చేసుకుంది. లార్డ్స్ మైదానంలో న్యూజిలాండ్‌తో జరిగిన చివరిదైన నాలుగో వన్డేలో జోస్ బట్లర్ నాయకత్వంలోని ఇంగ్లండ్ జట్టు 100 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 311 పరుగులు చేసింది. ఓపెనర్ డేవిడ్ మలాన్ (114 బంతుల్లో 127; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో రచిన్ రవీంద్ర (4/60), డరైల్ మిచెల్ (2/40) రాణించారు. అనంతరం 312 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 38.2 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. రచిన్ రవీంద్ర (48 బంతుల్లో 61; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ స్పిన్నర్ మొయిన్ అలీ 50 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు.

సినిమా



● ప్రభాస్ ● అమితాబ్ ● కమల్‌హాసన్ ● నాగార్జున

కథ కలిపింది

కొన్ని కథల్లో అతిథి పాత్రలకు కూడా 'స్టార్' రేంజ్ యాక్టర్లు కావాల్సి వస్తుంది. కథలో ఆ పాత్రలకు అంత ప్రాధాన్యం ఉంటుంది. ఆ ప్రాధాన్యాన్ని గ్రహించి అతిథి పాత్రలకు స్టార్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తారు. అలా కొన్ని క్రేజీ కాంబినేషన్స్‌ని కొన్ని కథలు కలిపాయి. ఆ కాంబినేషన్స్ గురించి తెలుసుకుందాం.

కల్కి కలిపింది

ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. 'మహానటి' వంటి సూపర్ హిట్ తర్వాత డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ సినిమాలో బిగ్ బీ అమితాబ్ బచ్చన్, లోక నాయకుడు కమల్ హాసన్, ప్రముఖ దర్శకుడు రాజమౌళి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇలా ఇద్దరు లెజెండరీ నటులను, ఒక స్టార్ డైరెక్టర్‌ని 'కల్కి' కలిపింది. భారతీయ ఇతిహాసం మహాభారతం స్ఫూర్తితో మూడో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ప్రభాస్ కర్ణుడిని పోలిన పాత్రలో కనిపించనున్నారని టాక్. అమితాబ్ క్యారెక్టర్ మహాభారతంలోని అశ్వత్థామ పాత్రను పోలి ఉంటుందని భోగట్టా. అలాగే కమల్‌హాసన్ విలన్ పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళిది అతిథి పాత్ర. ఆయన ఎలాంటి పాత్రలో కనిపిస్తారనేది తెలియాల్సి ఉంది. బాలీవుడ్ హీరోయిన్లు దీపికా పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' సినిమాని జనవరి 12 విడుదల చేయనున్నట్లు చిత్రబృందం గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే.

కన్నప్పలో శివుడు?



● ప్రభాస్, విష్ణు

మంచు విష్ణు హీరోగా నటిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో స్టార్ హీరో ప్రభాస్ నటించనున్నారు. ఈ మూవీకి 'మహాభారత' ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించనున్నారు. అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై నటుడు, నిర్మాత మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ సినిమా ఇటీవల శ్రీకాళహస్తిలో ప్రారంభమైంది. శివ భక్తుడైన కన్నప్ప, ఆయన భక్తి నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుంది. కన్నప్పగా మంచు విష్ణు నటించనున్నారు. శివుడి పాత్రలో ప్రభాస్ కనిపిస్తారని టాక్.

కోలీ స్టార్‌తో టాలీ స్టార్

'సార్' వంటి హిట్ సినిమా తర్వాత తమిళ హీరో ధనుష్ తెలుగులో నటిస్తున్న రెండో స్ట్రయిట్ ఫిల్మ్ 'డీ 51' (వర్కింగ్ టైటిల్). శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించనున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో తెలుగు స్టార్ హీరోల్లో ఒకరైన అక్కినేని నాగార్జున కీలక పాత్రలో నటించనున్నారు. నాగార్జున పుట్టినరోజుని (ఆగస్టు 29) పురస్కరించుకుని 'డీ 51' చిత్ర నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహనరావు ఈ చిత్రంలో ఆయన నటించనున్న విషయాన్ని వెల్లడించారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందనున్న ఈ చిత్రంలో నాగార్జున పాత్రకి చాలా ప్రాధాన్యం ఉందని టాక్. ప్రస్తుత సమాజంలో నెలకొన్న అసమానతల నేపథ్యంలో ఈ సినిమా రూపొందనుందట. ఈ చిత్రంలో రష్మికా మందన్న కథానాయికగా నటిస్తారు.

వార్‌కి సిద్ధం



● రాజమౌళి ● ఎన్టీఆర్ ● హృతిక్ రోషన్ ● ధనుష్

'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాన్ ఇండియాని మించిన స్థాయిలో స్టార్‌డమ్ సొంతం చేసుకున్నారు హీరో ఎన్టీఆర్. ఇప్పటివరకూ తెలుగు సినిమాలు మాత్రమే చేసిన ఆయన తొలిసారి పరభాషా చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. హృతిక్ రోషన్ హీరోగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందనున్న 'వార్ 2' సినిమా ద్వారా ఎన్టీఆర్ హిందీ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ నటించిన 'వార్' (2019) సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' రూపొందనుంది.

ఒట్టుగా.. గుట్టుగా...



● నాని, మృణాల్ ఠాకూర్

'సమయమా... భలే సాయం చేశావమ్మా ఒట్టుగా... కనులకే తన రూపా న్నందించావే గుట్టుగా..' అని పాడుకున్నారు నాని.. 'సరే సరే.. త్వరపడకో.. తదుపరి కథ ఎటుకో..' అని పాడారు మృణాల్ ఠాకూర్. ఈ ఇద్దరూ జంటగా రూపొందుతున్న 'హాయ్ నాన్న' చిత్రంలోని తొలి పాట ఇది. చిత్ర సంగీతదర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. శనివారం ఈ పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో బేబీ కియారా ఖన్నా కీలక పాత్ర పోషిస్తోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని డిసెంబర్ 21న విడుదల చేయనున్నారు.



"నలభై ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 800 పైగా సినిమాలు చేశాను. వీటిలో 300 పైగా తండ్రి పాత్రలు ఉన్నాయి. దీంతో తండ్రి పాత్రలు చేయాలంటే విసుగొచ్చింది. ఈ ఏడాది 18 సినిమాల్లో తండ్రి పాత్రలు చేయమని అవకాశాలు రాగా, వదులుకున్నాను. కొత్త తరహా పాత్రలు చేయాలనుకుంటున్న నాకు 'పెదకాపు-1'లో మంచి పాత్ర దొరికింది. నా కెరీర్‌లో నేను గుర్తుంచుకోదగ్గ పాత్రల్లో 'పెదకాపు 1' ఉంటుంది" అన్నారు నటుడు- దర్శకుడు తనికెళ్ల భరణి. విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ చిత్రంలో కీలక పాత్రలో నటించిన తనికెళ్ల భరణి పంచుకున్న విశేషాలు.

అందుకే పద్దెనిమిది సినిమాలు వదులుకున్నా!

- తనికెళ్ల భరణి

● 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు', 'బ్రహ్మోత్సవం' చిత్రాల తర్వాత శ్రీకాంత్ అడ్డాలతో నేను చేసిన చిత్రం 'పెదకాపు 1'. ఈ చిత్రంలో సమాజంపై విసిగిపోయిన ఓ టీచర్ పాత్రలో కనిపిస్తాను. శ్రీకాంత్ అడ్డాల పోషించిన పాత్రను తప్పిస్తే ఈ సినిమాలో లీడ్ రోల్ చేసిన అందరితో నాకు కాంబినేషన్ సీన్స్ ఉన్నాయి. 'మాతృ దేవో భవ, లేడీస్ టైలర్, శివ, మన్మథుడు, అతడు'.. ఇలా నిడివితో సంబంధం లేకుండా నా కెరీర్‌లో నేను గుర్తుపెట్టుకోదగ్గ పాత్రలు ముప్పై వరకు ఉంటాయి. ఈ జాబితాలో 'పెదకాపు 1' చేరుతుంది. చాలా గ్యాప్ తర్వాత ఈ సినిమాకి కెమెరామేన్ ఛోటా కె. నాయుడుతో వర్క్ చేయడం థ్రిల్‌గా అనిపించింది. విరాట్ కర్ణ కొత్తవాడైనా బాగా నటించాడు. మిక్కీ జే మేయర్ సంగీతం బాగుంటుంది. మిర్యాల రవీందర్‌రెడ్డి గారు ఈ సినిమాను భారీగా నిర్మించారు.

● 'మిథునం' తర్వాత నా దర్శకత్వంలో మరో చిత్రం రాలేదు. నేను కమర్షియల్ సినిమాలు తీయలేను. నా దగ్గర కొన్ని కథలు ఉన్నాయి. ఆర్ట్ ఫిల్మ్ తరహా చిత్రాలను నిర్మించే నిర్మాతలు దొరకడం లేదు. నా నలభై ఏళ్ల కెరీర్‌లో నేను అనుకున్నవన్నీ చేశాను. అయితే ఓ అంతర్జాతీయ సినిమా తీయాలనే ఆకాంక్ష మాత్రం మిగిలిపోయి ఉంది. ప్రస్తుతం శివరాజ్‌కుమార్, ప్రభుదేవా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమాలో కీలక పాత్ర చేస్తున్నాను. శేఖర్ అనే కొత్త దర్శకుడు తీస్తున్న సినిమాలో ఓ వైవిధ్యమైన పాత్ర చేస్తున్నాను.

సౌత్ ఇండియన్ ఇంటర్‌నేషనల్ మూవీ అవార్డ్స్ - 2023 (సైమా) వేడుకలు దుబాయ్‌లో ఘనంగా జరిగాయి. ఈ నెల 14న బిజినెస్ అవార్డ్స్‌ని, 15న తెలుగు, కన్నడ చిత్రపరిశ్రమల విజేతలకు, 16న తమిళ, మలయాళ పరిశ్రమల విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించి ఉత్తమ నటుడుగా ఎన్టీఆర్ (ఆర్ఆర్ఆర్), ఉత్తమ నటిగా శ్రీలీల (ధమాకా) అవార్డులు అందుకున్నారు. ఇక ఉత్తమ చిత్రంగా 'సీతారామం', ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి (ఆర్ఆర్ఆర్), ఉత్తమ సంగీత దర్శకుడిగా కీరవాణి, ఇంకా పలు విభాగాలకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు అవార్డులు ప్రకటించారు.



● ఎన్టీఆర్



● శ్రీలీల

హాలీవుడ్ థ్రిల్లర్



● వెంకట్ సాయి

తెలుగు నటుడు వెంకట్ సాయి గుండ హీరోగా నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం హాలీవుడ్ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'ది డిజర్వింగ్'. ఎస్ఎస్ అరోరా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో పలువురు హాలీవుడ్ స్టార్స్‌తో పాటు ఇండియన్ స్టార్స్ నటిస్తున్నారని యూనిట్ పేర్కొంది. విస్మయ్ కుమార్, తిరుమలేష్ గుండ్రాత్ ఇతర నిర్మాతలు. "హాలీవుడ్‌లో ప్రధాన పాత్రధారుడిగా ఒక తెలుగు కుర్రాడు నటించడం ఇదే మొదటిసారి కావొచ్చు. ప్రపంచ వ్యాప్త ప్రేక్షకులకు నచ్చేలా ఈ చిత్రం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. విదేశీ యాక్టర్లు సిమోన్ స్టాడ్లర్, కెల్సీ స్టార్లర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్‌జీఏ వెంగ్ చియా, సినిమాటోగ్రఫీ: కోషి కియోకావా.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.